అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 13-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

9వ వార్షికోత్సవం

నవతరానికి ప్రేరణ



నవతెలంగాణ దినపత్రిక నవతరానికి ప్రేరణగా అనేక రకాల విషయాలపై చక్కటి సమాచారాన్ని ఇస్తూ చైతన్య పరుస్తున్నది. ఈ పత్రిక తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు. ఈ పత్రిక ఇలాగే సమాజ మార్పునకు అనేక రకాల విషయాలపై ప్రజలను చైతన్యపరచాలి. రాజకీయంగా, సామాజిక, సాంస్కృతికంగా, అవగాహనను పెంచుతూ ముందుకెళ్లాలి. సమకాలీన రాజకీయ పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న సమయంలో ప్రపంచీకరణ కాలంలో ఇలాంటి ఆలోచన ధార కలిగిన పత్రికలు చారిత్రక అవసరం. ఇది పది కాలాలపాటు ప్రజలకు అండగా ఉండాలి.

- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి

సంపుటి : 10 | సంచిక : 225 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

సీబీఐ దర్యాప్తు చేయాల్సిందే

కోల్‌కతా డాక్టర్‌పై లైంగికదాడి, హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె

- మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజీనామా
- బాధితురాలి ఇంటికి సీఎం మమత

న్యూఢిల్లీ : కోల్‌కతాలోని ఆర్‌జికార్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య కేసులో నిరసనలు, ఆందోళనలు మిన్నంటాయి. సీబీఐ దర్యాప్తు చేయాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులు గళమెత్తారు. ఈనేపథ్యంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. మృతురాలు తన కుమార్తె వంటిదని, ఒక తండ్రిగా ఆ బాధ తనకు తెలుసునని, అందువల్లే తన పదవికి రాజీనామా చేస్తున్నానని డాక్టర్ సందీప్ ఘోష్ విలేకర్లకు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని అన్నారు. సోషల్ మీడియాలో... 6లో

హెచ్‌ఎంఐఈ మెగా కార్ టెస్ట్ సెంటర్

హైదరాబాద్‌లోని హ్యుందాయ్ ఇంజినీరింగ్ సెంటర్ ఆధునీకరణ



సీఎం రేవంత్‌తో ఆ సంస్థ ప్రతినిధులు భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ కొరియా ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ, దాని భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రయివేట్ లిమిటెడ్ (హెచ్‌ఎంఐఈ) ద్వారా తెలంగాణలో కార్లకు సంబంధించిన మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించేందుకు యోచిస్తోంది. ఆ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం... 15లో



ఆర్మీ భూమికి రెక్కలు

అయోధ్యలో భూ రాబందులు

స్నేహితుల కోసం మోడీ ధారాదత్తం చేశారు : ప్రతిపక్షం

కొనుగోలు చేసిన అదానీ, రవిశంకర్, బాబా రాందేవ్

ఆ తర్వాత డీ-నోటిఫై చేసిన యూపీ గవర్నర్

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఆర్మీ శిక్షణ కోసం ప్రభుత్వం నోటిఫై చేసిన భూమిని పారిశ్రామికవేత్త అదానీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్, యోగా గురు బాబా రాందేవ్ గుట్టుచప్పుడు కాకుండా కొనేశారు. ఇది జరిగిన తర్వాత రాష్ట్ర గవర్నర్ దానిని డీ-నోటిఫై చేశారు. చట్ట ప్రకారం ఆ భూమిని కేవలం వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉండగా ఇప్పుడు నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో మ్యాపింగ్‌ను అనుమతిస్తామని అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ తాజాగా చేసిన ప్రకటన దీనికి ఊతమిస్తోంది. ప్రధాని మోడీ తన స్నేహితుల కోసం సైనిక భూమిని ధారాదత్తం చేశారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

లక్నో : అయోధ్యలో సైనిక శిక్షణ కోసం 'బఫర్ జోన్'గా గుర్తించిన ప్రాంతాన్ని ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ డీ-నోటిఫై చేసిన మరునాడే ఆ ప్రాంతంలో మ్యాపింగ్‌ను అనుమతిస్తామని అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ (ఏడీఏ) తెలిపింది. అంటే ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేందుకు, దానిని వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు పచ్చజెండా ఊపింది. అదానీ గ్రూపుకు చెందిన హోంక్వెస్ట్ ఇన్‌ఫ్రా స్పేస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో రిజిస్టరైన వ్యక్తి వికాస్ కేంద్రం (వీవీకే)తో పాటు యోగా గురు రాందేవ్ బాబాతో, రాందేవ్‌కే చెందిన భారత్ స్వాభిమాన్ ట్రస్ట్‌తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు భూమిని కొనుగోలు చేసిన ... 3లో

గోల్కొండ కోటలో సీఎస్

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలన.. పలు సూచనలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం గోల్కొండ కోటను ఆమె సందర్శించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని డీజీపీ జితేందర్‌కు సూచించారు. మనదేశ సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా సాంప్రదాయ దుస్తులలో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. గుస్సాడి, కొమ్ము కోయ, లంబాడీ, డప్పులు, ఒగ్గుడోలు ప్రదర్శన, బోనాల కోలాటం, ఖైండ్ల ... 15లో

రేపు రాష్ట్రానికి సీఎం 15లో..

- 15న గోల్కొండ కోటలో జాతీయ జెండా ఎగరేయనున్న రేవంత్
- అదే రోజు సీతారామ ఎత్తిపోతల, రూ.2 లక్షల రుణమాఫీ ప్రారంభం

పోరాటానికి భారీ మూల్యం?

గతంలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న వినేశ్ ఫోగట్

- డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై తోటి రెజ్లర్లతో కలిసి ఆందోళనలు
- ఆ సమయంలో ఆమెతో పాటు రెజ్లర్ల పోరాటంపై విషం చిమ్మిన బీజేపీ ఐటీ సెల్
- ఒలంపిక్స్ ఫైనల్‌లో ఆమె అనర్హతకు ఇదే కారణమా?
- తెరవెనక కాషాయపార్టీ కుట్రలు 3లో..
- కొందరు రాజకీయ నాయకులు, విమర్శకుల విశ్లేషణ





ప్రపంచ పటంలో తెలంగాణ పర్యాటకం

టూరిజం అభివృద్ధికి నిధులు



- జిల్లాలో ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు
- ఖిల్లాపై రోప్‌వే నిర్మాణానికి పర్యాటక శాఖ అనుమతులు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రుల పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రపంచ పటంలో తెలంగాణ పర్యాటకానికి ప్రత్యేక స్థానం కల్పిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు, ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాలను సందర్శించారు. అనంతరం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామన్నారు. ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం కల్పించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలో దీనిని పూర్తి చేసుకుని ఖమ్మం జిల్లాలో ప్రారంభించారని ... 8లో

కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

ఇతర చర్యలు నిలిపేయండి.. మేడిగడ్డ కేసులో హైకోర్టు ఉత్తర్వులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతనెల 26న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామరావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్‌ల మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనపై ఇరిగేషన్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే విధించింది. మేడిగడ్డ ఇరిగేషన్ అధికారి గతనెల 29న ఇచ్చిన ఫిర్యాదులో సదరు నేతలు మేడిగడ్డ రిజర్వాయర్ సందర్శన సమయంలో డ్రోన్ కెమెరా వినియోగించారనీ, దాని వల్ల ప్రాజెక్టుకు నష్టం వస్తుందని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఆ ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. మహదేవ్‌పూర్ పీఎస్‌లో నమోదైన కేసులో కేటీఆర్ ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయొద్దనీ, ఇతర చర్యలూ తీసుకోరాదని ఆదేశించారు. కేసు దర్యాప్తునే నిలిపివేస్తూ స్టే ఇచ్చారు. విచారణను వచ్చే నెల మొదటి వారానికి వాయిదా వేశారు.

మెడికల్ అడ్మిషన్లలో స్థానికులకు నష్టం

రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో అడ్మిషన్ అర్హత నిబంధనలను మార్పు చేస్తూ గత నెల 19న జారీ అయిన జీవో 33ను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సోమవారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గత నిబంధనలను సవరించి అందులో 3ఏను చేర్చుతూ జీవో 33 జారీ వల్ల తెలంగాణ లోకల్ స్టూడెంట్స్‌కు అన్యాయం జరుగుతుందనే పిటిషన్లలో మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. ప్రభుత్వ వాదనలు విన్నాకే తగిన ఆదేశాలిస్తామని చెప్పింది. మంగళవారం... 15లో

ముమ్మాటికీ అక్రమ ఆర్థిక బంధమే

అదానీ గ్రూపుతో సెబి చీఫ్‌కు సంబంధాలు

- పెట్టుబడులపై మాధాబి బుచ్ అంగీకరించారు
- బహిరంగ విచారణ జరపాలి : హిండెన్‌బర్గ్ మళ్లీ విమర్శలు

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధం రుజువయ్యిందని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ తెలిపింది. దీనిని మాధాబి ప్రకటనే రుజువు చేస్తుందని హిండెన్‌బర్గ్ స్పష్టం చేసింది. 'మా నివేదికపై సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్ ఇచ్చిన వివరణతో ప్రస్తుతం కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రిపోర్టులోని పలు ముఖ్యమైన అంశాలను ఆమె అంగీకరించారు' అని హిండెన్ బర్గ్ రీసెర్చ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. హిండెన్ బర్గ్ ఆరోపణలు నిరాధారం అంటూనే బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో




పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిందని తెలిపింది.'తన భర్త బాల్య స్నేహితుడు నిర్వహిస్తున్న ఫండ్‌లోనూ పెట్టుబడులు పెట్టామని మాధాబి బూచ్ ధృవీకరించారు. ఆ సమయంలో సదరు వ్యక్తి అదానీ గ్రూప్ సంస్థల డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్మెన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది.' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. సెబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతూనే మాధాబి కన్సల్టింగ్ సంస్థలను నడుపుతున్నారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. సింగపూర్‌లో నివసిస్తున్నప్పుడు ఏర్పాటు చేసిన కంపెనీల్లో అగోరా అడ్వైజరీ లిమిటెడ్ (ఇండియా)లో 99 శాతం వాటా బుచ్ లదేనని తెలిపింది. ఈ కన్సల్టెన్సీ సంస్థల నుంచి ఆదాయం పొందుతూ మరోవైపు అదానీ గ్రూప్ సంస్థలపై దర్యాప్తు చేశారని పేర్కొంది. సెబీ పూర్తికాల సభ్యురాలిగా చేరినప్పటి నుంచి ఆమె తన భర్త పేరిట ఉన్న ఇ-మెయిల్స్ ద్వారా వ్యాపార లావాదేవీల వివరాలు... 15లో

సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సులకే డిమాండ్

98.01 శాతం సీట్లు భర్తీ

- ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్లు 5,039
- 81,904 మందికి సీట్ల కేటాయింపు
- 90 కాలేజీలు, 22 బ్రాంచీల్లో వంద శాతం సీట్లు భర్తీ
- 15 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు
- కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు 17 దాకా అవకాశం
- ఎప్‌సెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రవేశాలు




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కోర్సులకే భారీగా డిమాండ్ ఉన్నది. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సోమవారం సీట్లు కేటాయించింది. సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో చేరేందుకే అభ్యర్థులు మొగ్గు చూపారు. ఆయా బ్రాంచీల్లో 61,587 సీట్లుంటే, 60,362 (98.01 శాతం) మందికి సీట్లు కేటాయించారు. వాటిలో 1,225 (1.99 శాతం) సీట్లు మిగిలాయి. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్... 15లో

బెయిల్ ఇవ్వండి

సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ కోసం సుప్రీంను ఆశ్రయించారు. లిక్కర్ స్కాంకు సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు ఆగస్టు 5న ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. దీంతో ఆయన మరోసారి బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇప్పటికే ఈడీ కేసులో కేజ్రీవాల్‌కి బెయిల్ మంజూరైనా.. సీబీఐ కేసులో బెయిల్ రాకపోవడంతో ఆయన తీహార్ జైలులోనే ఉన్నారు. కాగా, లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేం



- ఈడీ, సీబీఐకి సుప్రీం నోటీసులు
- 20కి విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తీహార్ జైల్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఇప్పుడే మధ్యంతర బెయిల్ మంజూరు చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ... 15లో

ఆరోసారి అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటీ మద్రాస్

వర్సిటీల ర్యాంకులను ప్రకటించిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

వివరాలు 15లో



త్వరలో రాష్ట్రానికి ఎల్‌ఎస్ కంపెనీ బృందం

- వరంగల్ టెక్స్‌టైల్ పార్కుపై కొరియన్ సంస్థల ఆసక్తి
- కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ కొరియాలో అతి పెద్ద పారిశ్రామిక సంస్థ అయిన ఎల్‌ఎస్ కంపెనీ ప్రతినిధులు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎల్‌ఎస్ గ్రూప్ చైర్మెన్ కు.జా.యున్‌తోపాటు ఆ కంపెనీ సీనియర్లతో భేటీ అయింది. ఈ సమావేశంలో తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుళ్లు, గ్యాస్, విద్యుత్ బ్యాటరీల ఉత్పత్తి, సంబంధిత పరిశ్రమలకు పెట్టుబడులపై చర్చలు జరిపారు. ఈ క్రమంలో సీఎం ఆహ్వానం మేరకు ఎల్‌ఎస్ బృందం త్వరలోనే రాష్ట్రంలో పర్యటించేందుకు అంగీకరించింది. గతంలో ఈ కంపెనీ ఎల్‌జీ గ్రూపులో భాగస్వామిగా ఉండేది.

మరోవైపు వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ పిలుపు మేరకు కొరియన్ జౌళి పరిశ్రమ సమాఖ్య సానుకూలతను వ్యక్తం చేసింది. సోమవారం దక్షిణ కొరియాలోని సియోల్‌లో కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ (కేఓఎఫ్‌ఓటీఐ) ఆధ్వర్యంలో బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. యాంగాన్ చైర్మెన్ కిహక్ సుంగ్, కేఓఎఫ్‌ఓటీఐ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ సోయాంగ్ సహా 25 భారీ జౌళి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ, వరంగల్ టెక్స్‌టైల్ పార్కుతోపాటు రాష్ట్రంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి ఉన్న సానుకూలతలను సీఎం ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలంటూ ఆయన కోరగా, కొరియన్ టెక్స్‌టైల్ కంపెనీలు సానుకూలంగా స్పందించాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌లో ప్రయివేటుకు పెద్దపీట

- నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు ద్వారా బాటలు వేస్తాం
- ఏపీలో ఎమ్‌ఈఆర్‌ఐటీ ఏర్పాటు అభినందనీయం : ఎన్‌ఎమ్‌ఈటీ గవర్నింగ్ బాడీ మీటింగ్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మన దేశంలో ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామనీ, అందులో ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు(ఎన్‌ఎమ్‌ఈటీ) ఆరో గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఎక్స్‌అఫిషియో చైర్మెన్ హోదాలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఖనిజ సంపదకు లోటులేదనీ, అనుకున్నంత మేరకు ఖనిజాల సామర్థ్యాన్ని గుర్తించలేక పోయామని తెలిపారు. దాన్ని దృష్టిలో పెట్టుకునే 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్‌ఎమ్‌ఈటీని స్థాపించారని తెలిపారు. దీంతో ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌లో ఏటేటా పురోగతి సాధిస్తున్నామన్నారు. రాష్ట్రాలు ఎన్‌ఎమ్‌ఈటీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్‌ఎమ్‌ఈటీ తరహాలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎమ్‌ఈఆర్‌ఐటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామనీ, ప్రయివేటు రంగానికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టం చేశారు. సహకార సమాఖ్య విధానంలో అన్ని రాష్ట్రాలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు.

ఎన్‌ఎమ్‌ఈటీ ద్వారా చేసిన కార్యక్రమాలు, ప్రాజెక్టులను ఆయన వివరించారు. నేషనల్ జియోసైన్స్ డేటా రిపాజిటరీ పోర్టల్ ద్వారా.. ఎక్స్‌ప్లోరేషన్ ద్వారా సాధించిన పురోగతిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కేంద్ర అటామిక్ ఎనర్జీ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ దుబే మాట్లాడుతూ.. దేశంలో ఖనిజాల సామర్థ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ..గనుల రంగంలో తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నదని చెప్పారు. ఆఫ్ షోర్ మైనింగ్, క్రిటికల్ మినరల్స్ ఎక్స్‌ప్లోరేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించామన్నారు.

ఐసిఎస్ఐ గోల్డెన్ జూబ్లీ ఇయర్ ఉత్సవాలు

- హైదరాబాద్ చాప్టర్ 50 ఏండ్ల వ్యవస్థాపక దినోత్సవం



హైదరాబాద్ : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఘనంగా 50 ఏళ్ల వ్యవస్థాపక దినోత్సవాలు, గోల్డెన్ జూబ్లీ ఇయర్‌ను నిర్వహించుకుంది. నగరంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం విశేషం. గోల్డెన్ జూబ్లీ ఇయర్ సందర్భంగా తమ విద్యార్థులు ఆగస్టు 1 నుంచి 15వ తేది వరకు పలు వైద్య క్యాంప్‌లు, రక్తదానం, పారిశ్రామిక సందర్శనలు చేపడుతున్నారని ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సిఎస్ గామిని శ్రీ లక్ష్మీ నారాయణ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిఎస్ఐ ప్రతినిధులు రాజవోలు వెంకటరమణ్, మహదేవ్ తిరినగరి, శిల్పా బుంగ్, లలితా దేవి తంగిరాల తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మకమైన శక్తిగా ఎదగాలి

- శ్రీ వినాయక యాడ్స్ ఎమ్‌డీ వినాయకరావు



హైదరాబాద్ : నిత్యం ప్రజల సమస్యల పట్ల స్పందిస్తున్న నవతెలంగాణ దినపత్రిక వాటి పరిష్కారం కోసం కృషి చేస్తూ నిర్మాణాత్మక శక్తిగా ఎదగాలని శ్రీ వినాయక యాడ్స్ ఎమ్‌డీ వినాయకరావు ఆకాంక్షించారు. పత్రిక తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యాజమాన్యానికీ, విలేకర్లకు, సిబ్బందికి ఆయన హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

పారామౌంట్‌కమ్యూనికేషన్స్ అమ్మకాల్లో 52 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పారామౌంట్ కమ్యూనికేషన్స్ నికర అమ్మకాలు 52.5 శాతం పెరిగి రూ.321.06 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో నికర లాభాలు ఏకంగా 74.1 శాతం వృద్ధితో రూ.25.30 కోట్లుగా నమోదయ్యాయని ఆ కంపెనీ తెలిపింది. కంపెనీ రెవెన్యూ పెరగడంతో లాభాల్లోనూ మెరుగుదల చోటు చేసుకుందని పారామౌంట్ కమ్యూనికేషన్స్ పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర అమ్మకాలు 32.7 శాతం పెరిగి రూ.1,078.56 కోట్లుగా నమోదయ్యాయి.

రోగుల నుంచి ఫిర్యాదులేమీ రాలేదు

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి
- 'మందులేవీ..' కథనానికి స్పందన



నవతెలంగాణ-సిటీబ్యూరో

మందుల కొరత ఉన్నట్టుగా రోగుల నుంచి తమకు చెప్పుకోదగ్గ ఫిర్యాదులేమీ రాలేదని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి స్పష్టం చేశారు. ఈ నెల 12వ తేదీన 'మందులేవీ' అనే శీర్షికతో నవతెలంగాణ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. జాతీయ స్థాయిలో గుర్తించిన అత్యవసర స్థాయి మందులన్నీ తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా చిన్నపాటి ఇబ్బంది ఉంటే పరిష్కరించేలా సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. టీజీఎంఎస్ఐడీసీ నుంచి వస్తున్న 80శాతం మందులను అందుబాటులో ఉంచామని, మిగిలిన 20శాతం మందులను అత్యవసర సమయాల్లో అవసరమైనప్పుడు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

బీఆర్‌ఎస్ నేతల తప్పుడు ప్రచారం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనతో రాష్ట్రంలో రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకొచ్చాయని తెలిపారు. ఆ కంపెనీల్లో పని చేసేందుకు అవసరమైన శిక్షణను రాష్ట్ర యువతకు ఇవ్వనున్నట్టు తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కలిసి రావాలని కోరారు. అమర్ రాజా కంపెనీకి సహకారం ఇవ్వాల్సి ఉంటే ఇస్తామని స్పష్టం చేశారు.

పోరాటానికి భారీ మూల్యం?

గతంలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న వినేశ్ ఫోగట్ డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై తోటి రెజ్లర్లతో కలిసి ఆందోళనలు

- ఆ సమయంలో ఆమెతో పాటు రెజ్లర్ల పోరాటంపై విషం చిమ్మిన బీజేపీ ఐటీ సెల్
- ఒలంపిక్స్ ఫైనల్‌లో ఆమె అనర్హురాలవటానికి ఇదే కారణమా?
- తెరవెనక కాషాయపార్టీ కుట్రలు
- కొందరు రాజకీయ నాయకులు, విమర్శకుల విశ్లేషణ





న్యూఢిల్లీ : వినేశ్ ఫోగట్... ఇప్పుడు ఈమె పేరు తెలియనివారంటూ ఉండరు. ప్యారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌లోకి ప్రవేశించిన మొదటి భారతీయ మహిళా రెజ్లర్‌గా నిలిచిన ఆమె.. కేవలం నిర్దేశిత 50 కేజీల బరువుకు కొన్ని గ్రాములు అధికంగా ఉన్నారన్న కారణంతో అనర్హురాలయ్యారు. దీంతో ఫైనల్‌లో స్వర్ణం కానీ, రజతం కానీ ఖాయమనుకున్న తరుణంలో ఈ వార్త యావత్ భారతదేశాన్ని షాక్‌కు గురి చేసింది. ఇక క్రీడా ప్రపంచం బాధ వర్ణనాతీతం. ఆ తర్వాత వినేశ్ ఫోగట్ రెజ్లింగ్‌కు స్వస్తి పలుకటం కూడా తెలిసిందే.

అయితే, వినేశ్ ఫోగట్‌కు ఫైనల్‌లో ఇలాంటి ఊహించని పరిణామం ఎదురుకావటానికి కారణాలను కొందరు విశ్లేషిస్తున్నారు. ఆమె ఫైనల్ వరకు వచ్చి, చివరి నిమిషంలో అనర్హురాలిగా ప్రకటించబడటానికి వెనక భారత్ నుంచే కొందరు 'పెద్దల' హస్తం ఉన్నదని వివరిస్తున్నారు. అయితే, ఈ విశ్లేషణలకు సంబంధించిన పలు పోస్టులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. లైంగిక ఆరోపణలు చేస్తూ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు, మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తన తోటి రెజ్లర్లతో కలిసి వినేశ్ ఫోగట్ గతంలో నిరసనల్లో పాల్గొన్నారు. అయితే, సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సుదీర్ఘ పోరాటం మోడీ సర్కారుకు క్రీడా ప్రపంచం నుంచి కొత్త తలనొప్పిని తీసుకొచ్చింది.

మహిళా రెజ్లర్లు చేస్తున్న ఈ పోరాటం సందర్భంగా ప్రధాని హోదాలో మోడీ కనీసం మాట్లాడలేదు. పైగా మహిళా రెజ్లర్ల పైనే తన 'సోషల్' టీంతో లేనిపోని ఆరోపణలు చేయించారని కొందరు విమర్శకులు చెప్తున్నారు. ముఖ్యంగా, బీజేపీ ఐటీ సెల్ ఇందులో ముందు వరుసలో ఉన్నదని అంటున్నారు. అయితే, వినేశ్ ఫోగట్ ఈ పోరాటంలో పాలుపంచుకున్న కారణంగానే ఫైనల్‌లో ఆమెకు ఊహించని షాక్ ఎదురైందని కొన్ని విశ్లేషణలను బట్టి తెలుస్తున్నది.

ఒలంపిక్స్ ఫైనల్ గేమ్‌లో ఆమె బరువును పర్యవేక్షించే కోచ్‌లు, సిబ్బంది, ఇతర అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటానికి కారణాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారు. సెమీ ఫైనల్ విజయం తర్వాత ఫోగాట్ బరువు 52.7 కేజీలకు పెరిగింది. భారత అధికారులు ఆమెకు కొంత ఓఆర్ఎస్ ఇచ్చారు. ఆమె రాత్రిపూట 2.7 కేజీల బరువు తగ్గుతుందని వారు ఊహించారు. అయితే, దాని కోసం ఆమె రాత్రంతా వర్కవుట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒలంపిక్స్ అధికారుల ముందు ఫోగాట్‌ను న్యాయబద్ధంగా సమర్థించటంలో మోడీ ప్రభుత్వం విఫలమైందనీ, రాజకీయ కారణాలతో ఇప్పటివరకు ఆమె సాధించిన విజయాలను కించపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తూ భారత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యులు కార్యకలాపాలను కూడా బహిష్కరించారు.

ఈనెల 7న (బుధవారం) ఫోగాట్ మ్యాచ్‌కు ముందు ఉదయం 50 కిలోల కంటే 100 గ్రాములు ఎక్కువ ఉన్నట్టు కనుగొనబడింది. గేమ్ నిబంధనల ప్రకారం ఆమెపై అనర్హత వేటు పడింది. ఆమెకు రజత పతకాన్ని కూడా తిరస్కరించారు. సెమీ-ఫైనల్స్‌లో ఒక రోజు ముందు ఫోగాట్‌తో ఓడిపోయిన క్యూబా రెజ్లర్ యుస్నీలీస్ గుజ్‌మాన్‌ను యూఎస్‌కు చెందిన సారా హిల్‌డెబ్రాంట్‌తో పోటీ పడాలని ఒలంపిక్స్‌అధికారులు నిర్ణయించటంతో ఫైనల్ మ్యాచ్‌ను తిరిగి ప్రారంభించారు. సారా చివరికి బంగారు పతకాన్ని గెలుచుకున్నది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కఠినమైన పోరాటం చేస్తున్న ఫోగట్.. ఒలింపిక్స్‌కు సంబంధించిన ట్రయల్స్ ప్రారంభమయ్యే ముందు తనకు అవసరమైన సహాయక సిబ్బందిని అందించడంలో అధికారులు జాప్యం చేయటంపై ఏప్రిల్‌లో నిరాశను వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ప్రమాదాన్ని కూడా ఆమె ముందే అంచనా వేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) ఫోగాట్‌ను ఆమె సహజ బరువు కంటే చాలా తక్కువ విభాగంలో పోటీ చేయాలని ఒత్తిడి చేయటంపై వివాదం ఉన్నది. ఆమె ఇంతకుముందు 53 కిలోల విభాగంలో పాల్గొనేది. కానీ ఇప్పుడు 50 కిలోల విభాగంలో పోటీపడాలని లేదా పారిస్‌కు వెళ్లే అవకాశాలను వదులుకోవాలని డబ్ల్యూఎఫ్ఐ కోరినట్టు సమాచారం.

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఫోగట్ పోరాటం

ఫైనల్‌కు ముందు వరకు ఫోగట్ సాధించిన విజయాలు సాధారణంగా భారతీయులను ఉత్తేజపరిచాయి. ఒలిం పిక్స్‌లో భారత్ సాధించిన అరుదైన పతకాల దృష్ట్యా, వాటిలో ప్రతి ఒక్కటి దేశంలో ఒక నిధిగా గౌరవించబడు తుంది. అయితే, ఫోగట్ విషయంలో ఆమె పోటీ పడుతున్న పరిస్థితుల కారణంగా వేడుకలు పెద్ద ఎత్తునే జరిగాయి. దేశంలోని క్రీడలలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఆమె పోరాటానికి బంగారు పతకం సాధ్యపడుతుందని చాలామంది భావించారు. తోటి రెజ్లర్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఫోగట్‌తో పాటు సాక్షి మాలిక్, పునియా, ఇద్దరూ ఒలింపిక్స్ పతక విజేత రెజ్లర్లు గతేడాది మే-జూన్‌లో రాజధాని న్యూఢిల్లీలో అప్పటి డబ్ల్యూఎఫ్ఐ అధిపతి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌తో సహా అధికారులపై మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసుల్లో చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేస్తూ నిరసనకు నాయకత్వం వహిం చారు. బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ అధికార బీజేపీ ఎంపీ. మోడీ సర్కారు ఆయనపై చర్యలు తీసుకోవటానికి నిరాకరించింది. బదులుగా, ఢిల్లీలో నిరసన చేస్తున్న మహిళా రెజ్లర్లపై పోలీసులు చర్యకు దిగారు. వారిని బలవంతంగా వేదిక నుంచి తొలగిం చారు. ఫోగట్, ఇతర రెజ్లర్లకు వ్యతిరేకంగా అధికార పార్టీ సామాజిక, ప్రధాన స్రవంతి మీడియాలో ప్రచారం చేసింది. ఇది ప్రతిపక్షాల చర్యగా నిరాధారమైన ఆరోపణలతో ఒక ప్రచారాన్ని ప్రారంభించింది. కాగా, బ్రిజ్ భూషన్ డబ్ల్యూఎఫ్ఐ నుంచి నిష్క్రమించినప్పటికీ.. ఆయన తన సన్ని హితుడు సంజయ్ సింగ్‌ను కొత్త డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఎన్ను కోవటంలో విజయం సాధించాడు. ఇది సాక్షిని రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించేలా చేసింది. ఈ నిర సనలు ఉన్నప్పటికీ బీజేపీ వాటిని లెక్క చేయలేదు. బ్రిజ్ భూషన్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు ఈ సంవ త్సరం ప్రారంభంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలకు టికెట్ ఇచ్చింది. కరణ్ ఎన్నికల్లో గెలిచి ఇప్పుడు పార్ల మెంటు సభ్యుడిగా ఉన్నాడు. అయితే, ఫోగట్ ఎపిసోడ్‌లో అధికారపార్టీ హస్తం ఉన్నదని కొందరు విశ్లేషకులు అభి ప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆమె పతకం గెలవటం ఒక్క క్రీడా ప్రపంచంలోనే సంచలనం కాదనీ, అది రాజకీ యంగానూ తీవ్ర ప్రభావితం చూపుతుందని భావించిన కమలం సర్కారు.. తెరవెనక 'కుట్ర'లకు తెరలేపిందని అంటున్నారు.

ఆర్మీ భూమికి రెక్కలు



(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నెలలకే ఆ ప్రాంతాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం డీ-నోటిఫై చేయడం గమనార్హం. ఆ భూమిలో మ్యాపింగ్‌లను అనుమతిస్తామని ఈ నెల 6న ఏడీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

గుట్టుచప్పుడు కాకుండా డీ-నోటిఫై

2020 ఆగస్టు, 2024 జూలై మధ్య కాలంలో 14 గ్రామాలకు చెందిన 13,391 ఎకరాల భూమిని సైనిక శిక్షణ కోసం బఫర్ జోన్‌గా నోటిఫై చేశారు. జనవరిలో అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగానికి ముందు ఇందులోని 2,211 ఎకరాల భూమిని పైన తెలిపిన సంస్థలు కొనుగోలు చేశాయి. ఇప్పుడు ఆ భూమిని డీ-నోటిఫై చేశారని 'ది ప్రింట్' పోర్టల్ తెలిపింది. డీ-నోటిఫై చేసిన రెండు నెలల తర్వాత కానీ ఆ విషయం ప్రజలకు తెలియలేదు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి మ్యాపింగ్‌ను అనుమతిస్తామని స్థానిక మీడియాలో ప్రకటనలు విడుదల చేసిన తర్వాతే విషయం బహిర్గతమైంది.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసినా, విక్రయించినా దానిని కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని చట్టం చెబుతోంది. ఆ ప్రాంతంలో నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలు నిషిద్ధం. ఎందుకంటే దాని పక్కనే ఉన్న ఆర్మీ భూమిలో సైనిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. దీనివల్ల ప్రజలు, జంతువులకు గాయాలు కావచ్చు. ఆస్తులకు నష్టం కలగవచ్చు. అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై గత సంవత్సరం నవంబరులో ఏడీఏ ఓ ఆర్డర్ జారీ చేసింది. నోటిఫై చేసిన భూమిలో అభివృద్ధి కోసం మ్యాపింగ్‌ను లేదా నిర్మాణాలను అనుమతించబోనని అందులో తెలిపింది. బఫర్ జోన్‌లో ఆక్రమణలు జరుగుతున్నాయంటూ అయోధ్యకు చెందిన న్యాయవాది ప్రవీణ్ కుమార్ దూబే దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని పురస్కరించుకొని హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

'రక్షణ మంత్రిత్వ శాఖకు అప్పగించిన ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను అనుమతించకూడదు. చట్టాన్ని ఉల్లంఘించి ఇతర ప్రయోజనాలకు దానిని ఉపయోగించకూడదు' అని కోర్టు తెలిపింది.గతంలో కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటానని చెప్పిన ఏడీఏ, ఇప్పుడు మాట మార్చింది. గతంలో ఇచ్చిన ఆర్డర్ నుండి 2,211 ఎకరాలను తాజా పత్రికా ప్రకటన నుండి తొలగించింది.

ప్రతిపక్షాల మండిపాటు

ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. డీ-నోటిఫికేషన్‌పై నిలదీశాయి. ఈ అంశం ఇప్పటికీ కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎలా డీ-నోటిఫై చేస్తారని న్యాయవాది దూబే ప్రశ్నించారు. బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. మతం, జాతీయతావాదం ముసుగులో వారు ఏం చేస్తున్నారో చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా డిమాండ్ చేశారు. 'సైనిక శిక్షణ కోసం బఫర్ జోన్‌గా నోటిఫై చేసిన భూమిని ముందుగా అదానీ, రవిశంకర్, బాబా రాందేవ్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత గవర్నర్ దానిని డీ-నోటిఫై చేశారు' అని చెప్పారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అయోధ్యలోని సైనిక భూమిని స్వాధీనం చేసుకొని, తన స్నేహితులకు కట్టబెట్టిందని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఆరోపించారు.

రెచ్చిపోయిన హిందూ మూక

- బంగ్లాదేశ్‌లో హింసకు ప్రతీకారంగా మైనారిటీ వర్గంపై దాడి
- యూపీలోని ఘజియాబాద్‌లో ఘటన



లక్నో : బంగ్లాదేశ్‌లో అక్కడి మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయంటూ ఇక్కడి హిందూత్వ శక్తులు ప్రతీకార హింసకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా, యూపీలో ఈ దాడులు ఆందోళనను కలిగిస్తున్నాయి. హిందూ రక్షా దళ్ (హెచ్‌ఆర్‌డీ) కార్యకర్తలు, వారి నాయకుడు భూపేందర్ తోమర్ అలియాస్ పింకీ చౌదరి నేతృత్వంలో మూక రెచ్చిపోయింది. గుల్ధార్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఘజియాబాద్‌లోని కేవీ నగర్ ప్రాంతంలో మైనారిటీ వర్గానికి చెందిన నివాసితులపై దాడి చేసింది. దాడికి సంబంధించిన రెండు వీడియోలలో వారి ఆ మూక అకృత్యాలు కనిపించాయి. సదరు హిందూత్వ సంస్థ సోషల్ మీడియా ఖాతాలలో ఇది మొదట ప్రసారం చేయబడింది. ఈ దాడుల్లో అప్రమత్తమైన వ్యక్తులు గుడారాలను ధ్వంసం చేయటం, నివాసితుల వస్తువులను తగులబెట్టటం, నిరంతర మతపరమైన దూషణలను చేస్తూ మైనారిటీ ప్రజలపై లాఠీలతో దాడి చేశారు. ఈ వారంలో ఈ బృందం జరిపిన రెండో దాడి ఇదే కావటం గమనార్హం. విధ్వంసకులు మురికివాడను కాల్చివేయటమే కాకుండా, మైనారిటీలు అని నిర్ధారించుకున్న తర్వాత వారు ఎంచుకున్న ప్రజల బట్టలు, వస్తువులను హిందూత్వ కార్యకర్తలు కాల్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలని సోషల్ మీడియాలో పిలుపునిచ్చిన తర్వాత ఈ దాడులు జరగటం గమనార్హం. ఇలా పిలుపునిచ్చిన వారిలో ప్రముఖులు బీజేపీ ఎమ్మెల్యే నితీష్ రాణే, మండి బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఉన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లోని అశాంతిపై భారత్‌లోని హిందూత్వ శక్తులు, బీజేపీ అనుబంధ శ్రేణులు, సంస్థలు రెచ్చగొట్టే వార్తలను ప్రసారం చేస్తున్నాయి. భారత్‌లో ఒక వర్గంపై ద్వేషం పెరిగేలా పోస్టులను చేస్తున్నాయి.

దీంతో ఇలాంటి వాటిపై పోలీసులు, స్థానిక యంత్రాంగం దృష్టిని సారించి.. వాటికి ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయాలని సామాజిక కార్యకర్తలు, మేధావులు సూచిస్తున్నారు.

నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి

సెబీ చీఫ్ ఉదంతంపై నిపుణుల మనోగతం



న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణలకు సంబంధించిన విచారణలో సెబీ చీఫ్ మాధబి బచ్ తన నిర్దోషిత్వాన్ని తానే నిరూపించుకోవాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అదానీ గ్రూపుకు చెందిన అనుమానిత ఆఫ్‌షోర్ వాటాదారులపై చర్యలకు సెబీ చీఫ్ సుముఖత చూపలేదని హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై మాధబి, ఆమె భర్త ఇచ్చిన వివరణలపై ఎవరూ సంతృప్తి చెందలేదు. గత కొన్ని సంవత్సరాలుగా అవసరమైన మొత్తం సమాచారాన్ని సెబీ ఇప్పటికే బహిర్గతం చేసిందని బచ్ దంపతులు తెలిపారు. అయితే ఆ సమాచారం ఏమిటి, ఎవరికి ఎప్పుడు వెల్లడించారు అనే విషయాలను వారే తెలియజేయాల్సి ఉంటుందని మార్కెట్ పరిశీలకులు సూచించారు.

సెబీకి పూర్తికాలపు సభ్యురాలు లేదా ఛైర్‌పర్సన్‌ను నియమించినప్పుడు తనకు, తన బంధువులకు ఉన్న వాటాల వివరాలను బయటపెట్టాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వ మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ గార్గ్ అన్నారు. వాటిలో పరస్పర ప్రయోజనం కలిగిన సమాచారం ఉన్నట్లయితే దానిని కూడా బహిర్గతం చేయాలని చెప్పారు. సింగపూర్‌లో ఓ ప్రైవేటు పౌరురాలిగా నివసిస్తున్న సమయంలో మారిషస్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టానని బచ్ చెబుతున్నారు. అదానీ గ్రూపులో ఆ ఫండ్ ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని కూడా తెలిపారు. అయితే తాను వాటాలు కొనుగోలు చేసిన ఫండ్ విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిన తర్వాత అదానీ గ్రూపుపై జరుగుతున్న దర్యాప్తులో బచ్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉన్నదని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు.

తన భర్త వాటాలను రీడీమ్ చేయాలని గ్లోబల్ డైనమిక్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ మేనేజర్‌కు బచ్ ఎందుకు ఈ మెయిల్ పంపారని క్యాపిటల్ మార్కెట్ విశ్లేషకుడు ఒకరు ప్రశ్నించారు. తన వాటాలను బదిలీ చేసిన తర్వాత వాటిని వదిలేయాలని ఫండ్ మేనేజర్‌ను కోరడం అసాధారణమని ఆయన చెప్పారు. ఆ వాటాలు ఇప్పటికీ ఆమె నియంత్రణలోనే ఉన్నాయన్న విషయం దీనినిబట్టి అర్థమవుతోందని తెలిపారు.

మోడీ విఫలం

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయలేదు

- అన్నదాతల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయి : శరద్ పవార్



న్యూఢిల్లీ : దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నెర వేర్చడంలో ప్రధాని మోడీ విఫల మయ్యారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్ ఆరోపించారు. దేశంలో రైతులు కష్టాల్లో ఉన్నారనీ, వారి ఆత్మహత్యలు రెట్టింప య్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహా రాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో జరిగిన ఎన్సీపీ కార్యక్రమంలో పాల్గొన్న శరద్ పవార్ పై విధంగా స్పందించారు. రైతులు తమ ఉత్పత్తులకు తగిన రాబడిని పొందలేక తీవ్ర చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. " ప్రభుత్వం రైతులను పట్టించుకోవటం లేదు. రైతుల పంటలకు కేంద్రం సరైన ధర ఇవ్వటం లేదు. దీంతో వారు తీవ్ర చర్య (ఆత్మహత్య) తీసుకుంటున్నారు. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పరిరక్షించే కొత్త పాలనను ఏర్పాటు చేయటం ప్రస్తుతానికి అవసరం. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలు రైతుల కష్టాలను తగ్గించటానికి, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించటానికి తమ శక్తిని ఉపయోగించలేదు. ఉద్యోగాలు లేకపోవటంతో యువత కష్టాల్లో కూరుకుపోవటం చూస్తారు. ప్రభుత్వాన్ని మార్చాలి" అని శరద్ పవార్ పిలుపునిచ్చారు. మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఐక్యంగా ఉన్నదనీ, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడించటమే లక్ష్యంగా ఉన్నదని ఆయన చెప్పారు.

వాయనాడ్ ప్రమాదం

కొనసాగుతున్న గాలింపు చర్యలు

తిరువనంతపురం : వాయనాడ్ కొండచరియలు విరిగి పడిన విపత్తు ప్రాంతంలో సోమవారం కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. ముఖ్యంగా ఇంకా ఆచూకీ తెలియనివారి కోసం ఈ గాలింపు కొనసాగింది. ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసు, ఫైర్, రెస్క్యూ సర్వీసెస్, సివిల్ ఢిఫెన్స్ ఫోర్స్, ఫారెస్టు డిపార్ట్‌మెంట్, వాలంటీర్లతో కూడిన బృందం ఈ గాలింపు చర్యల్లో పాల్గొంది. ఆదివారం భారీ వర్షం కురిసిన కారణంగా ముండక్కై, చూరల్‌మల ప్రాంతాల్లో ఈ గాలింపు చర్యలను నిలిపివేశారు.

డాక్యుమెంట్ల కోసం ప్రత్యేక డ్రైవ్

కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో సర్వం కోల్పోయి, ప్రాణాలతో బయటపడిన వ్యక్తులు అధికారిక డాక్యుమెంట్లు తిరిగి పొందేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను సోమవారం ప్రారంభించారు. స్థానిక స్వపరిపాలన శాఖ, జిల్లా పరిపాలన, రాష్ట్ర ఐటి మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సర్టిఫికేట్, డాక్యుమెంట్ రిట్రీవల్ డ్రైవ్ ప్రత్యేక శిబిరాలను మెప్పాడిలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించారు.

పని ప్రదేశంలో ప్రసూతి ప్రయోజనాలేవి ?

- ప్రతిబంధకంగా ఉన్న నిబంధనలు
- కానరాని పర్యవేక్షణ
- సామాజిక భద్రతకూ తిలోదకాలు
- పిల్లల సంరక్షణే ముఖ్యమంటున్న ఉద్యోగినులు



న్యూఢిల్లీ : గర్భిణులు, శిశువుల తల్లులకు అందించాల్సిన ప్రసూతి ప్రయోజనాల విషయంలో దేశంలోని చట్టాలు ఎంతో ప్రగతిశీలకంగా ఉన్నాయి. కానీ చిన్న చిన్న సంస్థలు ఆ ప్రయోజనాలను కల్పించాల్సిన అవసరం లేదంటూ చట్టం మినహాయింపు ఇస్తోంది. అయితే మహిళల్లో అత్యధికులు అనధికారిక రంగంలోనే పని చేస్తున్నారు. దీని ఫలితంగా దేశంలోని మహిళా కార్మికుల్లో 93.5 శాతం మందికి ప్రసూతి ప్రయోజనాలు అందడం లేదని ప్రభుత్వ సమాచారాన్ని విశ్లేషించిన 'న్యూస్‌లాండ్రీ' పోర్టల్ తెలిపింది.

దేశంలో మహిళా కార్మికులు, ఉద్యోగుల సంఖ్యను పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇందులో భాగంగా శిశుసంరక్షణ కేంద్రాలు, మహిళా ఉద్యోగుల కోసం హాస్టళ్లు ఏర్పాటు చేస్తారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న ప్రభుత్వోద్యోగులకు ప్రసూతి సెలవులపై ఆంక్షలు విధిస్తూ రూపొందించిన విధానాన్ని పునఃపరిశీలించాలని గత నెల ఢిల్లీ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. మన దేశంలో పిల్లల కోసం 'సరోగసి' పద్ధతిని ఆచరించే ప్రభుత్వ మహిళా ఉద్యోగులు కూడా ప్రసూతి సెలవులకు అర్హులే. వీరికి 180 రోజుల ప్రసూతి సెలవు లభిస్తుంది.

చట్టం ఏం చెబుతోంది?

ప్రసూతి ప్రయోజనాల చట్టానికి 2017లో సవరణలు చేశారు. ఇద్దరు పిల్లల వరకూ 26 వారాల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇస్తారు. దత్తత తీసుకునే వారు, సరోగసి పద్ధతిని అనుసరించే వారికి 12 వారాల సెలవు లభిస్తుంది. యాజమాన్యం వారిని ఆ కాలంలో విధుల నుండి తొలగించకూడదు. గర్భిణి స్త్రీలు, చంటి పిల్లలు ఉన్న తల్లులు ఇంటి నుండే పని చేసేందుకు కంపెనీలు అనుమతించాల్సి ఉంటుంది. యాభై మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న కంపెనీలు తమ ప్రాంగణంలో విధిగా క్రచ్‌ని ఏర్పాటు చేయాలి. దానికయ్యే ఖర్చును యాజమాన్యమే భరించాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే మన దేశంలో గర్భిణులకు, చంటి పిల్లల తల్లులకు అందుతున్న ప్రయోజనాలు ఎక్కువేనని చెప్పాలి. అయితే ఈ ప్రయోజనాలు దేశంలోని అత్యధిక మహిళలకు అందడం లేదని 2022-23 సంవత్సరపు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తెలిపింది.

నిబంధనలే అడ్డంకులు

నిబంధనల అమలు విషయంలో కఠినంగా వ్యవహరించినప్పుడు, ఆ యంత్రాంగాన్ని సరిగా పర్యవేక్షించినప్పుడు మాత్రమే మహిళలకు ప్రసూతి ప్రయోజనాలు లభిస్తాయి. ఉదాహరణకు బహుళజాతి కంపెనీల్లో కేవలం కొన్ని మాత్రమే తమ ప్రాంగణాల్లో క్రచ్‌లు ఏర్పాటు చేశాయి. పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థల్లో మాత్రమే ప్రసూతి ప్రయోజనాలు చేకూరుతాయి. అయితే ఆ సంఖ్య కంటే తక్కువ ఉన్న సంస్థల్లోనే 85 శాతం మంది మహిళలు పని చేస్తున్నారు. డెలివరీ తేదీకి ముందు 12 నెలల కాలంలో 80 రోజుల కంటే ఎక్కువ రోజులు పని చేసిన మహిళలకే ప్రసూతి ప్రయోజనాలు లభిస్తాయి. ఇది గర్భిణులకు ప్రతిబంధకంగా ఉన్న ప్రధాన నిబంధన.

ఉద్యోగాలను ఎందుకు వీడుతున్నారు?

పిల్లల బాధ్యత కలిగిన వారు ఉద్యోగాలు మానేయడం మరో ప్రధాన అంశం. మూడు నుండి ఐదు సంవత్సరాల వయసున్న పిల్లలను కలిగిన మహిళలు ఎక్కువగా ఉద్యోగాలను వీడి వారి సంరక్షణ చూసుకుంటున్నారు. సంవత్సరం కంటే తక్కువ వయసున్న పిల్లలు ఉన్న వారిలో 65.5 శాతం మంది ఉద్యోగాలు వదిలేస్తున్నారు.

పిల్లలు పెరిగే కొద్దీ తిరిగి ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రసూతి సెలవు నుండి తిరిగి వచ్చిన నాలుగు నెలలకే 48 శాతం మంది మహిళలు పని వదిలేస్తున్నారు. తల్లులు ఉద్యోగాలకు రాజీనామా చేయడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఉద్యోగాల నుండి తొలగించడం, జీతం లేకుండా లే-ఆఫ్‌లు, కాంట్రాక్ట్ ముగియడం, కంపెనీ పని చేయకపోవడం, పని ప్రదేశంలో ఉద్యోగం లేకపోవడం, పదవీ విరమణ, పిల్లల సంరక్షణ, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య కారణాలు, ఆర్థిక అవసరం లేకపోవడం వంటి కారణాలతో తల్లులు ఉద్యోగాలను వీడుతున్నారు. ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు ఇంటి పనికే పరిమితమవుతున్నారు. లేదా స్వయం ఉపాధి చూసుకుంటున్నారు. దీనివల్ల పని గంటల్లో వెసులుబాటు ఉంటుంది. ఇంటి నుండే పని చేయడానికి అవకాశం లభిస్తుంది. అదే విధంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు దినసరి కార్మికులుగా పని చేస్తున్నారు. ఇష్టమున్నప్పుడు పనికి వెళ్లవచ్చు. లేకుంటే ఇంటిలోనే పిల్లల సంరక్షణ చూసుకోవచ్చు.

లభించని సామాజిక భద్రత

మహిళా ఉద్యోగుల్లో చాలా తక్కువ మందికే గ్రాట్యుటీ, పీఎఫ్, పెన్షన్లు, ప్రసూతి ప్రయోజనాలు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు లభిస్తున్నాయి. మహిళా ఉద్యోగినుల్లో 39.9 శాతం మందికి మాత్రమే సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుతున్నాయి. అలాగే నెలవారీ జీతాలు తీసుకుంటున్న మహిళల్లో 32.1 శాతం మందికే ప్రసూతి ప్రయోజనాలు పొందే అర్హత ఉంది. సంవత్సరం కంటే తక్కువ వయసున్న పిల్లలు ఉన్నప్పటికీ ప్రసూతి ప్రయోజ నాలు లభిస్తున్నాయన్న కారణంతో ఎక్కువ మంది మహిళలు ఉద్యోగాలు చేసేందుకు ఇష్టపడు తున్నారు. ఇక రోజువారీ వేతనాలు పొందే మహిళల్లో 0.1 శాతం మందికే ప్రసూతి ప్రయోజనాలు లభిస్తున్నాయి. మొత్తంగా చూస్తే మహిళా ఉద్యోగుల్లో 6.5 శాతం మంది ప్రసూతి ప్రయోజనాలకు అర్హులు. జీతాలు పొందే మహిళల్లో 32.3 శాతం మందికి ఈ అర్హత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా ఉండడం గమనార్హం. జీతాలు తీసుకునే మహిళల్లో సగం మందికి పైగా సామాజిక భద్రతా ప్రయోజనాలు పొందడం లేదు.

కంచు మోగింది

సంపాదకీయం

క్రీడాభిమానులను ఉత్కంఠతలూగించిన పారిస్ ఒలింపిక్స్ ఆదివారం ముగిశాయి. కనీసం పది మెడల్స్ సాధించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత సేన ఆరు పతకాలతోనే ఇంటిబాట పట్టాల్సి వచ్చింది. టోక్యోలో తుపాకీ మొరాయించి వేదనతో వెనుదిగిన మనుభాకర్ మొక్కవోని సంకల్పంతో పారిస్‌లో చిరస్మరణీయ ప్రదర్శనతో రెండు కాంస్య పతకాలను సాధించింది. రైతు బిడ్డ సరబ్‌జ్యోత్‌సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ విభాగంలో మరోసారి 'కంచు' మోగించింది. ఒలింపిక్ మెడల్ నెగ్గిన మొదటి భారతీయ మహిళా షూటర్‌గా, స్వాతంత్ర్యానంతరం ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు రాబట్టిన తొలి ఇండియన్ అథ్లెట్‌గా అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది మనుభాకర్. విశ్వక్రీడల్లో బరిలో నిలిచిన తొలిసారే 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో స్వప్నిల్ కంచుమోత మోగించాడు. టోక్యోలో జావెలిన్‌లో స్వర్ణం కొల్లగొట్టాడు నీరజ్ చోప్రా...పారిస్‌లో కాస్త తడబడి రజతంతో సరిపెట్టుకొన్నాడు. దేశీయంగా

> పారిస్ ఒలింపిక్స్ శిక్షణ కోసం వినేశ్ ఫోగట్ మీద డెబ్బయ్ లక్షలకుపైగా ఖర్చు చేశామని కేంద్ర క్రీడామంత్రి పార్లమెంటులో ప్రకటించడం అత్యంత హాస్యాస్పదం. గతంలో మోడీకి వ్యతిరేకంగా నిలబడి నినదించినా, ఆమెను ఒలింపిక్స్‌కు పంపి తమ పెద్దలు ఎంతో ఉన్నతంగా వ్యవహరించారన్నట్టుగా మరో నాయకురాలు వ్యాఖ్యానించారు. కానీ, సమస్త వ్యవస్థలు తనకు వ్యతిరేకంగా ఉన్నా తోటి మహిళా క్రీడాకారుల కోసం వినేశ్ ఫోగట్ పాలకులతో పోరాడారు, ఇప్పుడు బరిలో కడవరకూ నిలిచి పోరాడి దేశ కీర్తిని నిలిపారు.

హాకీ కథ ముగిసిందని భావిస్తున్న తరుణంలో వరుసగా రెండోసారి మన పురు షుల జట్టు కాంస్యంతో కొత్త ఆశలు రేపింది. ఈ హాకీ జట్టుకు ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పాన్సర్... మరి ప్రభుత్వం ఏం చేసినట్టు?



కచ్చితంగా గెలుపు మనదేననుకున్న క్రీడాంశాల్లో సైతం అంచనాలు తలకిందులయ్యాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆర్చర్లు పారిస్‌లో పూర్తిగా తేలిపోయారు. బాక్సింగ్‌లో మనవారి పంచ్‌లు పేలలేదు. రెజ్లింగ్ సైతం చేదు అనుభవాలనే మిగిల్చింది. షూటర్లు, హాకీ క్రీడాకారులే కాస్త పరువు నిలబెట్టారు. గత ఒలింపిక్స్‌తో పోలిస్తే ఒక్క స్వర్ణం కూడా లేకపోగా పతకాలు సైతం తగ్గడంతో పతకాల పట్టికలో మన స్థానం అత్యంత దిగువకు దిగజారిపోయింది. మనలో నాలుగోవంతు జనాభా లేని దేశాలూ ఒలింపిక్స్‌లో భారీగా పతకాలు గెలుచుకొంటున్నాయి. వాటికి దీటుగా మనం రాణించాలంటే... దేశవ్యాప్తంగా క్రీడాసౌకర్యాలను మెరుగుపరచి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి సానబట్టాలి. అందుకు తగ్గ కృషి ఎంత మేరకు జరుగుతోంది? మరీ ముఖ్యంగా రాజకీయ నేతల కబంధ హస్తాల నుంచి క్రీడా సంఘాలను విముక్తయ్యేలా చూడాలి. ఇవన్నీ సాకారమైతేనే ఒలింపిక్స్ పతకాల పట్టికలో ఇండియా పైమెట్టుకు చేరగలుగుతుంది!

అద్భుతమైన ఆటతీరుతో ఫైనల్‌కు చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వంద గ్రాముల బరువు ఎక్కువ ఉన్న కారణంతో అనర్హతకు గురికావడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతపరచింది. మరో రెజ్లర్ అమన్ సెహ్రావత్ 10గంటల్లో 4.6కేజీల బరువు తగ్గి ఇండియాకు కాంస్యం సాధించి పెట్టాడు. మరోవైపు, తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ బరువు తగ్గేక్రమంలో విజయానికి దూరమైంది. గత రెండు ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన పీవీ సింధు క్వార్టర్స్ కూడా చేరకుండానే ఇంటి ముఖం పట్టడం బాధాకరం. మన క్రీడాకారులు అంతర్జాతీయ టోర్నీల్లో బాగా రాణిస్తున్నారు కానీ, ఒలింపిక్స్‌లో మాత్రం తడబడుతున్నారు. ఒత్తిడికి తలొగ్గి చేతిదాకా వచ్చిన విజయాన్ని చేజార్చుకున్న షట్లర్ లక్ష్యసేన్ ఉదంతమే దీనికి ఉదాహరణ. బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకొనే ఉద్ఘాటించినట్టు.. 'మన ఆటగాళ్ల దృఢ చిత్తంతో ఈ బలహీనతను అధిగమించాలి. అందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ అందించాలి.' 'క్రికెట్ ఇచ్చే ప్రాధాన్యతలో పదిశాతం మిగతా క్రీడలకు ఇచ్చినా మన దేశానికి ఎన్నో పతకాలు వస్తాయి' అన్న సైనా నెహ్వాల్ మాటల్లో వాస్తవం లేకపోలేదు.

ఇలాంటి ఆలోచనలు చేయాల్సిన కేంద్ర పెద్దలు.. పారిస్ ఒలింపిక్స్ శిక్షణ కోసం వినేశ్ ఫోగట్ మీద డెబ్బయ్ లక్షలకుపైగా ఖర్చు చేశామని కేంద్ర క్రీడామంత్రి పార్లమెంటులో ప్రకటించడం అత్యంత హాస్యాస్పదం. గతంలో మోడీకి వ్యతిరేకంగా నిలబడి నినదించినా, ఆమెను ఒలింపిక్స్‌కు పంపి తమ పెద్దలు ఎంతో ఉన్నతంగా వ్యవహరించారన్నట్టుగా మరో నాయకురాలు వ్యాఖ్యానించారు. కానీ, సమస్త వ్యవస్థలు తనకు వ్యతిరేకంగా ఉన్నా తోటి మహిళా క్రీడాకారుల కోసం వినేశ్ ఫోగట్ పాలకులతో పోరాడారు, ఇప్పుడు బరిలో కడవరకూ నిలిచి పోరాడి దేశ కీర్తిని నిలిపారు.

పారిస్ వెళ్లిన భారత జట్టులో హర్యానా, పంజాబ్‌లకు చెందినవారే అత్యధికులు. దేశ జనాభాలో కేవలం నాలుగు శాతమే ఉన్న ఆ రెండు చిన్న రాష్ట్రాలూ 40శాతం ఒలింపియన్లను తయారు చేస్తే.. తమిళనాడు, కేరళ, యూపీ, మహారాష్ట్ర, మణిపూర్ సైతం తమవంతు భూమిక పోషించాయి. 140కోట్ల సువిశాల భారతావనిలో రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో క్రీడావికాస ప్రణాళికలు చురుగ్గా అమలు జరిగి ఉంటే ఏండ్లతరబడి పతకాల దుర్భిక్షం ఉండేది కాదు. ప్రతి పాఠశాలలో ఆటస్థలం, క్రీడాసామగ్రి విధిగా ఉండాల్సిందేనన్న విద్యాహక్కు చట్టం అమలుకానంత వరకూ ఇదే కొనసాగుతుంటది. వ్యాయామ విద్య, శారీరక శ్రమ అనేవి పిల్లల ఏకాగ్రతను, బుద్ధిని వికసింపజేస్తాయి. వారిలో కలివిడితత్వాన్ని పెంపొందించి, ఓటమి జీవితంలో భాగమేనన్న సత్యాన్ని బోధపరుస్తాయి. రేపటి పౌరుల భవిష్యత్తుకు దోహదపడేలా పటిష్ట క్రీడా సంస్కృతికి కేంద్రం, రాష్ట్రాలు కృషిచేయాలి. ఆ క్రమంలో సహజసిద్ధ ప్రతిభా సంపన్నులు వెలికివస్తే అంతర్జాతీయ వేదికలపై భారత్ తలెత్తుకుని నిలబడగల్గుతుంది!

ఎల్ఐసి బలోపేతమే...స్వాతంత్రోద్యమ స్ఫూర్తి



పి.సతీష్
9441797900

లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)లో ప్రభుత్వ వాటాల అమ్మకం మరోసారి జరగనుందనే వార్తలు గుప్పుమంటున్నాయి.ఇప్పటికే 2022లో 3.5శాతం వాటాలు అమ్మి, రూ 21వేల కోట్లు ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంది. 'సెబి' నియమావళి ప్రకారం, ఒకసారి స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ప్రభుత్వ రంగ సంస్థలు మూడేండ్లలో 25శాతం వాటాలు అమ్మాలి. అయితే,ఈ నిబంధనకు ఎల్ఐసికి మినహాయింపుతో మూడేండ్లు కాకుండా పదేండ్ల సమయ మిచ్చారు. దీనర్థం, 2032 మే లోపు, ఎల్ఐసి 25 శాతం వాటాలు విక్రయించాల్సి ఉంటుంది. మరి ఈలోగా ఐదు శాతం వాటాలు అమ్మాల్సిన అవసరం ఏమిటి? ఎల్ఐసి షేర్ విలువ భారీగా పెరిగిన దృష్ట్యా, ఒకవేళ ఐదు శాతం వాటాలు అమ్మితే, ప్రభుత్వానికి ఆర్థిక ప్రయోజనం కలిగిస్తుంది తప్ప, ఎల్ఐసికి ఒరిగేదేమీ లేదు.పైపెచ్చు, ప్రభుత్వ వాటాల అమ్మకం స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి విఘాతం.

స్వాతంత్రోద్యమ సమయంలో వెల్లివిరిసిన జాతీయ స్పృహలో అంతర్భాగమే బీమా జాతీయకరణ ఆలోచన.స్వాతంత్రోద్యమం కేవలం వలస పాలన నుండి విముక్తిని పొందడమే కాకుండా, స్వేచ్ఛాయుతమైన సమసమాజ స్థాపనను లక్ష్యంగా పెట్టుకుంది.దోపిడీని అంతమొందించాలంటే, రాజకీయ స్వేచ్ఛతో బాటు, ఆకలితో ఉన్న లక్షలాది మంది నిజమైన ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సదస్సు ప్రకటించింది. 1934లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్ట్ గ్రూప్ సమావేశంలో పొందుపరిచిన చార్టర్ ఆఫ్ ఫ్రీడంలో 'ప్రజల చిన్న మొత్తాల పొదుపులను జాతీయం చేయాల్సిన అవసరం ఉందనీ, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం వ్యూహాత్మక స్థానాన్ని కలిగిఉండాలని కాంగ్రెస్ గట్టిగా నమ్ముతుందని రాసుకున్నారు'. అందువల్ల, ప్రజల పొదుపుపై ప్రభుత్వం నియంత్రణ కలిగి ఉండాలని, వాటిని ప్రయివేటు సంస్థల పరం చేయకుండా జాతీయాభివృద్ధికి మాత్రమే ఉపయోగించు కోవాలనేదానిపై, స్వాతంత్రోద్యమం చాలా స్పష్టమైన అవగాహనతో ఉందని మనకు అర్థమౌతుంది.

జీవిత బీమా అనేది దీర్ఘకాల పెట్టుబడి అయిన కారణంగా , బీమా వ్యాపారం కేవలం నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. అందుచేతనే, బీమా రంగం ప్రభుత్వ అజమాయిషీలోనే ఉండాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన స్టేట్స్ అండ్ మైనారిటీస్ గ్రంథంలో పేర్కొన్నారు. బీమా వ్యాపార నిర్వహణ, యాజమాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వానికి బదిలీ చేసే చట్టాన్ని అమలు చేయడానికి వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని జనవరి 12, 1948న రాజ్యాంగ అసెంబ్లీ తీర్మానించింది. ఆనాడు బీమా రంగంలో ఘోరమయిన పరిస్థితులు నెలకొన్నాయి. జీవిత బీమా రంగంలో పట్టదారుల సొమ్ము భద్రత ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో మృగ్యం అని, పట్టదారుల సొమ్ముకు పూర్తి రక్షణ కావాలంటే జాతీయకరణ ఒక్కటే పరిష్కారమని జరిగిన ఉద్యమాల ఫలితంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)ని నెలకొల్పింది. బీమా జాతీయకరణను మన రాజ్యాంగ ఆదేశిక సూత్రాల అధికరణలు 38, 39లో పొందుపరచబడిన విధంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సాధంగా చూడవచ్చు.ఆనాడు విదేశీ కంపెనీలు దేశీయ పొదుపును చేజిక్కించుకున్న వైనాన్ని చూసి కలవరపడిన ఆనాటి ప్రధాని నెహ్రూ భారతీయ కంపెనీలను మాత్రమే సమర్థించమని పిలుపునిచ్చారు. అందువల్ల, స్వాతంత్రోద్యమ ప్రమాణాల్లో ఒకటైన జీవితబీమా రంగ జాతీయకరణ, ఆధునిక సమసమాజ దేశ నిర్మాణ దార్శనికతలో ముఖ్య భాగంగా మారింది.

ఈరోజు ఏడాదికి రూ.3.5 లక్షల కోట్ల నుండి 4 లక్షల కోట్లు దేశాభివృద్ధికి పెట్టుబడులిచ్చే పరిస్థితి, ఎల్ఐసి పనితీరుకు అద్దం పడుతుంది. 1956 నుండి ఇప్పటివరకు 53 లక్షల కోట్ల ఆస్తులు ఆర్జించి, దేశ ఆర్థిక వ్యవస్థలో 43 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి ,దాదాపు 27 కోట్ల పాలసీదారులకు ఎల్ఐసి విశేష సేవలందిస్తున్నది. ఇది ప్రపంచంలోనే అరుదైన ఘనత. ఎల్ఐసి దేశ సంక్షేమంతో పాటు దేశంలోని పెట్టుబడిదారీ వ్యవస్థకు సైతం ఊతం అందిస్తున్నది. ఎల్ఐసి ఈక్విటీ పెట్టుబడులు యాభై పైగా కంపెనీలలో ఉండటం దీనికి తార్కాణం.2020 లో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిలో వాటాలు అమ్మడానికి నాలుగు వాదనలు బడ్జెట్‌లో ముందుకు తెచ్చింది. అది లిస్టింగ్ వల్ల ఆర్థిక క్రమశిక్షణ వస్తుందని, కాపిటల్ మార్కెట్ నుండి నిధులు సమీకరించే వీలు ఉంటుందని , ఎల్ఐసి నిజ విలువ ఆవిష్కారం జరిగి, చిన్న మదుపుదారులకు ఉపయోగం అని, సంస్థ మరింత పారదర్శకంగా ఉంటుందని.

ఎల్ఐసి ఎంత పారదర్శకంగా పనిచేస్తోందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ఏడాది బడ్జెట్ ముందు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఎల్ ఐసిని మినహాయించి ప్రయివేటు బీమా కంపెనీలలో 2 లక్షల పైబడి ఫిర్యాదులు వచ్చాయని స్పష్టంగా పేర్కొన్నారు.ఎల్ఐసి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉంది కాబట్టి, పార్లమెంట్ కు పూర్తి జవాబుదారీగా ఉంటుంది.ఎల్ఐసిలో నిరర్థక ఆస్తుల విలువ కేవలం 0.33శాతం .260 లిస్టెడ్ కంపెనీలలో పెట్టు బడులు పెట్టడం ద్వారా ఎల్ఐసి ఆర్జించిన లాభాలు ఒక సంవత్సరంలో 2.3 లక్షల కోట్లు పెరిగాయి. (డిసెంబర్, 2022 నాటికి- : రూ. 9.61 లక్షల కోట్లు; డిసెంబర్, 2023 నాటికి :రూ 11.89 లక్షల కోట్లు.) దీనికి లిస్టింగ్‌కు ఎటువంటి సంబంధం లేదు.

పెట్టుబడుల ఉపసంహరణ వల్ల, రిటైల్ ఇన్వెస్టర్లు లాభపడతారు అనే వాదన అసంబద్ధం. ఎల్ఐసి 2023-24 నివేదిక ప్రకారం మొత్తం షేర్ హెూల్డర్స్ సంఖ్య 27.5 లక్షలు కాగా,వారి చేతుల్లో ఉన్న షేర్ల సంఖ్య 9 కోట్ల పద్నాలుగు లక్షలు.

> పెట్టుబడుల ఉపసంహరణ వల్ల, రిటైల్ ఇన్వెస్టర్లు లాభపడతారు అనే వాదన అసంబద్ధం. ఎల్ఐసి 2023-24 నివేదిక ప్రకారం మొత్తం షేర్ హెూల్డర్స్ సంఖ్య 27.5 లక్షలు కాగా,వారి చేతుల్లో ఉన్న షేర్ల సంఖ్య 9 కోట్ల పద్నాలుగు లక్షలు. అంటే సగటున ప్రతి రిటైల్ ఇన్వెస్టర్ చేతుల్లో 34 షేర్లు ఉన్నాయని అర్థం.అదే సమయంలో 849 మంది సంస్థాగత(విదేశీ మరియు స్వదేశీ) మదుపుదారుల చేతుల్లో సుమారు 9.14 కోట్ల షేర్లు ఉన్నాయి.అంటే సగటున వీరొక్కక్కరి చేతుల్లో దాదాపు ఒక లక్షా పద్నాలుగు వేల షేర్లు ఉన్నాయి.మరి ఏ విధంగా సామాన్య,రిటైల్ మదుపుదారులు లాభపడినట్లు?



> ఏడాదికి నాలుగు లక్షల కోట్ల రూపాయల మేరకు దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెడుతోంది. అయినప్పటికీ ఆర్థికమంత్రి ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశీయ బీమా రంగం ఊసే ఎత్తలేదు. కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీ తీసుకువచ్చి బీమా ప్రీమియమ్‌లపై 18శాతం పన్ను భారం మోపింది.అప్పటినుండి ఇప్పటివరకు ఈ భారం తొలగించాలని బీమా ఉద్యోగులు ఉద్యమిస్తూనే ఉన్నారు. తాజాగా మూడు వందలమందికి పైగా పార్లమెంట్ సభ్యులను కలిసి వినతిపత్రాలను అందజేసినా ఫలితం శూన్యం. జయంత్ సిన్హా నేతృత్వంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బీమా ప్రీమియంపై జీఎస్టీ భారం తగ్గించమని సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదు. బీమా ప్రీమియమ్‌లపై జీఎస్టీ భారాన్ని తగ్గిస్తే ఎల్ఐసి సంస్థ పాలసీదారులకి ఇంకా మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు అందించగలదు.

అంటే సగటున ప్రతి రిటైల్ ఇన్వెస్టర్ చేతుల్లో 34 షేర్లు ఉన్నాయని అర్థం.అదే సమయంలో 849 మంది సంస్థాగత(విదేశీ మరియు స్వదేశీ) మదుపుదారుల చేతుల్లో సుమారు 9.14 కోట్ల షేర్లు ఉన్నాయి.అంటే సగటున వీరొక్కక్కరి చేతుల్లో దాదాపు ఒక లక్షా పద్నాలుగు వేల షేర్లు ఉన్నాయి.మరి ఏ విధంగా సామాన్య,రిటైల్ మదుపుదారులు లాభపడినట్లు?

ఏ ప్రభుత్వ రంగ సంస్థలో వాటాలు అమ్మినా, ఇదే పరిస్థితి. రిటైల్ మదుపుదారులు అతి కొద్ది షేర్లు కలిగి ఉంటారు.అసలు హవా అంతా స్వదేశీ, విదేశీ మదుపుదారులదే !!ప్రభుత్వ రంగ సంస్థల లాభదాయకతకూ, వాటి షేర్ ధరలకు ఎటువంటి సంబంధం లేదు.ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థల షేర్ ధరలు పెరగకుండా,స్టాక్ మార్కెట్‌లోని 'తిమింగలాలు' కుయుక్తులు పన్నుతాయి. ఎస్‌బిఐ షేర్ ధరను,ఇతర ప్రయివేటు బ్యాంకుల ధరను పోలిస్తే ఇదే అర్థం అవుతుంది.ఏ లిస్టింగ్ కంపెనీలో అయినా షేర్‌ధర పెంచడానికంటూ కంపెనీని లాభాల వేటలో పరుగులు తీయించడం తప్ప , సామాజిక లక్ష్యాలకు ప్రాధాన్యత ఉంటుందా? అందుకే, ఇటువంటి వృథా ప్రయత్నాలు మానుకుని, ఎల్ఐసిని మరింత బలోపేతం చేసే పనులు వేగవంతం చేయాలి.ప్రజల నమ్మకమే ఆలంబనగా ఎల్ఐసి పనిచేస్తూ నేటికీ మార్కెట్ లీడర్‌గా, మార్కెట్ మేకర్‌గా దూసుకుపోతున్న ఎల్ఐసిలో మరొక దఫా పెట్టుబడులు ఉపసంహరణ చేయడానికి ఎలాంటి ప్రాతిపదిక, అవసరం లేదు.

తిరుగులేని నమ్మకమంటే ఏమిటో వివరిస్తూ ప్రఖ్యాత రచయిత రాబిన్‌శర్మ ఇలా రాస్తారు. 'ఒక విమానం గగనతలంలో ఎగు రుతూ తీవ్ర కుదుపులకు గురయ్యిందట. అందులో ప్రయాణించే ప్రయాణీకులు హాహాకారాలు చేస్తుంటే, ఒక చిన్నారి చాలా ధైర్యంగా కూర్చుంది.అది చూసి ఆశ్చర్యపోయి ఒక పెద్దాయన ఆ అమ్మాయిని ఎందుకంత ధైర్యంగా ఉండగలుగు తున్నావని ప్రశ్నిస్తాడు. దానికి ఆ చిన్నారి, ఈ విమానం నడిపే పైలట్ మా నాన్న. ఎలాంటి పరిస్థితుల్లో అయినా నన్ను సురక్షితంగా ఉంచుతాడన్న నమ్మకం నాకుంది' అందట!! తండ్రి పట్ల అటువంటి తిరుగులేని నమ్మకం కలిగి ఉన్నందుకు, ఆ పాపను అందరూ అభినందించారు.ఈ కథలో పాపలాగే కోట్లాది ప్రజానీకం ఎల్ఐసి పట్ల తిరుగులేని నమ్మకం కలిగిఉన్నారు. ఎలాంటి ఒడిదుడుకులు సంభవించినా ఎల్ఐసి తమ వెనుక ఉందనే భరోసా వారికి ఉండబట్టే, బీమా రంగంలో అప్రతిహతంగా ఎల్ఐసి ప్రస్థానం కొనసాగుతోంది.

బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్-2024 వారి తాజా నివేదిక ప్రకారం ఎల్ఐసి సంస్థ, బలమైన బ్రాండ్‌గా ప్రపంచంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది.ఫార్చ్యూన్ ప్రపంచ సూచీ 2023 లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియమ్ ఆదాయంలో ప్రపంచంలో10 వ అతిపెద్ద సంస్థగా నిలిచింది. ఇందులో పనిచేసే 14 లక్షల ఏజెంట్లలో 48 శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందు తున్నారు.నేడు దేశ బీమా రంగంలో ఉన్న 26 ప్రయివేటు బీమా కంపెనీలు అన్నిటినీ కలిపి, దేశంలో ఉన్న 79 శాతం జిల్లాల్లో బీమా కార్యాలయాలు కలిగి ఉంటే, ఒక్క ఎల్ఐసి సంస్థనే 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉంది.

దేశ అంతర్గత వనరుల సమీకరణలో ఎల్ఐసి వాటా 25 శాతం పై మాటే. 99 శాతం పైబడి క్లెయిమ్‌లను పరిష్కరించడం ద్వారా సంస్థ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి రెండు కోట్ల పైబడి క్లెయిమ్స్ చెల్లించి ప్రపంచంలోనే క్లెయిమ్ పరిష్కారంలో అత్యుత్తమ బీమా సంస్థగా పేరెన్నికగంది. ఏడాదికి నాలుగు లక్షల కోట్ల రూపాయల మేరకు దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెడుతోంది. అయినప్పటికీ ఆర్థికమంత్రి ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశీయ బీమా రంగం ఊసే ఎత్తలేదు. కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీ తీసుకువచ్చి బీమా ప్రీమియమ్‌లపై 18శాతం పన్నుభారం మోపింది. అప్పటినుండి ఇప్పటివరకు ఈ భారం తొలగించాలని బీమా ఉద్యోగులు ఉద్యమిస్తూనే ఉన్నారు. తాజాగా మూడు వందలమందికి పైగా పార్లమెంట్ సభ్యులను కలిసి వినతిపత్రాలను అందజేసినా ఫలితం శూన్యం. జయంత్ సిన్హా నేతృత్వంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బీమా ప్రీమియంపై జీఎస్టీ భారం తగ్గించమని సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదు. బీమా ప్రీమియమ్‌లపై జీఎస్టీ భారాన్ని తగ్గిస్తే ఎల్ఐసి పాలసీదారులకి ఇంకా మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు అందించగలదు. ఎల్ఐసిని ఆర్థికంగా బలోపేతం చేస్తే, అది జాతీయోద్యమ స్ఫూర్తికి బలం చేకూర్చి , అంతిమంగా దేశానికి పాలసీదారులకు ఎంతో ప్రయోజనకరం.

నిబద్ధవీరుడా..

బుద్ధదేవ్‌నకు లాల్ సలామ్ లాల్ సలామ్!
నిబద్ధ వీరునికి లాల్ సలామ్ లాల్ సలామ్!
మార్క్సిస్టు యోధవై ప్రజానేతవై
జన హృదయాల్లో నిలిచిన కామ్రేడ్ ॥

కార్మిక కర్షక కష్టజీవుల
బాధలు తొలగగ పోరాడి
కమ్యూనిస్టుగా జీవితాంతమూ
అంకితమైన ఆశయ పథికుడా... ॥



నిజాయితీకి నిలువెత్తు రూపమా
స్వార్థమెరుగని సమర గీతమా
నిరాడంబరత నీ ఆదర్శం
ప్రజాసేవకే నిత్యం అంకితం! ॥

బంగ జనుల రంగభూమిలో
విప్లవ వీరుడవై ఎదిగావు
ఆటుపోటులను ఎదుర్కొని
ఉద్యమాలలో మెరిసావు! ॥

అమరుడవై గుర్తుంటావు
ఆశయాలలో వెలుగుతుంటవూ
మీ త్యాగపు దారులలోనే
ఎర్రజెండ ఎగురుతుంటది! ॥

- కె.ఆనందాచారి

సింగరేణి పరిరక్షణ-మన బాధ్యత



పైళ్ల ఆశయ్య
9490098052

సింగరేణి కొన్ని వేల కుటుంబాలకు ఉపాధి చూపిన దారిదీపం.కోట్లాది మందికి విద్యుత్‌ను పంచుతున్న కాంతిరేఖ. పేరుకు నల్ల బంగారంగా పిలిచినా.. అది మన కొంగు బంగారం. సింగరేణిది దాదాపు 127 సంవత్సరాల చరిత్ర. ఎంతోమందికి అన్నం పెట్టిన తల్లి లాంటి సంస్థను కేంద్రంలోని మోడీ సర్కార్ నేడు వేలం వేస్తున్నది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే దేశాన్ని పాలిస్తున్నదని బీజేపీ మరోసారి నిరూపించుకుంది. మూడోసారి ఎన్నికల్లో ఓడిగెలిచినా ప్రయివేటీకరణను మాత్రం శరవేగంగా అమలు చేస్తున్నది. తెలంగాణలోనూ బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు నిర్ణయించింది. మోడీ అనుసరిస్తున్న విధానాల్ని నిరసిస్తూ తెలంగాణలో బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, గనుల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ కోల్‌బెల్ట్ ఏరియాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 'సింగరేణి పరిరక్షణ యాత్ర' చేపట్టింది. గతనెల జులై 29నుంచి ఈనెల 5వరకు ఎనిమిది రోజుల పాటు సాగింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మొదలైన ఈ యాత్ర మంద మర్రి, రామకృష్ణాపూర్ బి జోన్, శ్రీరాంపూర్ మీదుగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోకి ప్రవేశించింది. అక్కడి ఓపెన్‌కాస్ట్ మైన్స్, అండర్ గ్రౌండ్ బావుల్లో క్యాంపెయిన్ ముగించుకుని జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి, కోయగూడెం మీదుగా ప్రయాణిస్తూ 5న కొత్తగూడెంలో ముగింపుసభ నిర్వహించింది. ఈయాత్ర సాగిన ప్రాంతాల్లో బృందం సభ్యులు ఎస్.వీరయ్య, ఆశయ్య, భూపాల్ కార్మికులను, వారి కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. వారి ఇండ్లలోనే బసచేశారు. వారి కష్ట సుఖాలను పంచుకున్నారు.

ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం సింగరేణిని పరిరక్షణ. కొత్త బ్లాకులను సంస్థకే కేటాయించాలనే డిమాండ్లను కార్మికులతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లింది. కేంద్రంలో మూడోసారి గద్దెనెక్కిన మోడీ సర్కార్ వచ్చి రాగానే కోల్ ఇండియాతో సంబంధం లేకుండానే 61 కొత్త బ్లాకులను ప్రయివేటు సంస్థలు, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది. అందులో తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బ్లాకును వేలంపాటలో ఉంచింది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ. బ్రిటిష్ ప్రభుత్వ కాలం నుంచి దాదాపు 150 ఏండ్లుగా నిజాం సర్కారుతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఆ తరువాత నేటి ప్రత్యేక తెలంగాణ వరకు స్వతంత్ర సంస్థగా కొనసాగుతున్నది. సింగరేణి సంస్థ ద్వారానే బొగ్గు నిక్షేపాలను గుర్తించి ఆ సంస్థ ద్వారానే వెలికితీస్తూ ఉద్యోగ, ఉపాధి కల్పిస్తూ, ఉత్తర తెలంగాణలోని ఆరు జిల్లాల అభివృద్ధికి సింగరేణి చేదోడుగా ఉంటున్నది. సింగరేణి ఆధారంగానే ఈ ఆరు జిల్లాలలో నగరాలు, పట్టణాలు పెరగడంతో పాటు లక్షలాది మందికి ప్రత్యక్షంగా, అనేక లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ జీవనాధారమైంది.

అలాంటి సింగరేణి సంస్థ మనుగడను కాలరాయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సింగరేణి ప్రాంతంలోని పాతబావులలో బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతూ ఏడేండ్లలో పూర్తిగా అయిపోతాయి. ఆ తరువాత కొత్త బ్లాకులు రాక పూర్తిగా కార్మికులకు పనిలేకుండా పోతుంది. ఇప్పటికే కొత్త ఉద్యోగ నియమాకాలు నిలుపుదల చేశారు. కేవలం వారసత్వ ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నారు. చిట్టచివరికి సింగరేణి మూసివేసే కుట్రకు కేంద్రం పూనుకున్నది. దీనికితోడు గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి పక్షాన నిలబడకుండా కేంద్రానికి వంత పాడుతున్నాయి. వేలం పాటను వ్యతిరేకించాల్సిన మన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమా వేశంలో ఉప ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొని పరోక్షంగా మద్దతు తెలుపడం అనేక అనుమానాలను తావిస్తోంది.గనుక రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి పరిరక్షణ కోసం నిలబడాలని, కార్మికుల హక్కుల కోసం పాటుపడాల్సిన అవసరాన్ని ఈ యాత్ర నొక్కిచెప్పింది.

ప్రస్తుతం సుమారు 75 వేల మంది శాశ్వత, 20వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10,500లోపే వేతనాలిస్తున్నారు. 'చాలీచాలని జీతంతో పూటగడవడం చాలా కష్టంగా ఉందని' మేం బసచేసిన ఇండ్లలో కార్మికులు చెబుతుంటే మా కండ్లు చెమ్మగిల్లాయి. గోదావరిఖనిలో నివాసముండే రాకేశ్ కాంట్రాక్టు కార్మికుడు. ఆయనకు భార్యా, ఇద్దరు పిల్లలు. బ్లాస్టింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. బ్లాస్టింగ్ వర్క్‌లేని రోజుల్లో వేతనమివ్వరు. పిల్లల చదువులకు, తినడానికి సరిపోని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. భూపాలపల్లిలో సుధాకర్ అనే కార్మికుని ఇంట్లో బస చేశాము. అతనికి ఇద్దరు పిల్లలు. కూతురు డిగ్రీ పూర్తిచేసింది. కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. ఇతను మున్సిపల్ విభాగంలో పని చేస్తున్నాడు. ఇతనికొచ్చే జీతం ఇంటి అద్దె, కుటుంబ పోషణకు, భార్య వైద్యానికి సరిపోక దీనస్థితిలో జీవనం కొనసాగిస్తున్నాడు. కొత్తగూడెం సెంట్రల్ వర్క్ షాప్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బాలకృష్ణ ఇంటికి వెళ్లాము. అద్దె ఇంట్లో ఉంటూ నైట్ డ్యూటీలు చేస్తూ అనారోగ్యానికి గురైనా కూడా సెలవు లేకుండా డ్యూటీ చేయమంటున్నారని గోడు వెళ్లబోసుకున్నాడు. పండగలు, పబ్బాలకు కూడా కాంట్రాక్టు కార్మికులకు సెలవులుండవు. అనేకమంది వివిధ అధికారుల దగ్గర, గార్డెన్‌లో, రోడ్లపైన గడ్డి పిచ్చిమొక్కలు తీసే పనిలో అనేకమంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి రక్షణ లేదు. పని గ్యారంటీ లేదు. పని లేని రోజుల్లో జీతమివ్వరు. సెలవులు కూడా ఉండవు. ఎంత కష్టపడినా నెల తిరిగేసరికి రూ.7వేలు లేదా 8వేలకంటే ఎక్కువ ఇవ్వడం లేదు. వీరందరికీ గతంలో ఐపవర్ కమిటీ నిర్ణయించిన వేతనాలిస్తామని హామీనిచ్చారు పాలకులు. కానీ ఇంతవరకు అమలు కాలేదు. దీంతో కార్మికులు శ్రమదోపిడీకి గురవడం కలిచివేసే అంశం.

మన రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు. తెలంగాణకు ఏం ఒరగబెట్టారు? తెలంగాణ సహజవనరుల దోపిడీ జరుగుతుంటే అడ్డుకోనివారు ప్రజాప్రతినిధులు ఎలా అవుతారు? పదవిలో ఎలా కొనసాగుతారు? అందుకే సింగరేణి పరిరక్షణకు బీజేపీ ఎంపీలపై ప్రజలు ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నది. సింగరేణి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయమే కాదు, తక్కువ ధరకే విద్యుత్ సప్లయ్ జరుగుతోంది. రేపు కొత్త బ్లాకులు ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత విద్యుత్‌రంగం తీవ్ర ప్రమాదంలో పడనున్నది. దాంతో రాష్ట్రం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ప్రజల పైన తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. దీంతో అన్ని రకాలుగా రాష్ట్రం నష్టపోతుంది. అదేవిధంగా సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ కావడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ సాగుతున్నది. రేపు ఇది ప్రయివేట్ సెక్టార్ అయితే ఆ వర్గాలకు రిజర్వేషన్ లేకుండా పోతుంది. సింగరేణి సంస్థ ఇప్పటి వరకు వందేండ్ల కాలంలో కేవలం 25 శాతం బొగ్గు మాత్రమే వెలికితీసింది. ఇంకా 75శాతం బొగ్గు మన తెలంగాణ భూగర్భంలో దాగుంది. ఆ బొగ్గు అయిపోవాలంటే ఇంకా 200 సంవత్సరాలు పడుతుంది. ఇంత పెద్ద ఎత్తున మన భూమ్మీదున్న సహజ సంపదని కార్పొరేట్ గద్దలు తన్నుకుపోతుంటే అధికార పార్టీ చూస్తు ఊరుకోవడం ఎంతమాత్రం సమంజసం కాదు.

> మన రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు. తెలంగాణకు ఏం ఒరగబెట్టారు? తెలంగాణ సహజవనరుల దోపిడీ జరుగుతుంటే అడ్డుకోనివారు ప్రజాప్రతినిధులు ఎలా అవుతారు? పదవిలో ఎలా కొనసాగుతారు? అందుకే సింగరేణి పరిరక్షణకు బీజేపీ ఎంపీలపై ప్రజలు ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నది. సింగరేణి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయమే కాదు, తక్కువ ధరకే విద్యుత్ సప్లయ్ జరుగుతోంది. రేపు కొత్త బ్లాకులు ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత విద్యుత్‌రంగం తీవ్ర ప్రమాదంలో పడనున్నది. దాంతో రాష్ట్రం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ప్రజల పైన తీవ్ర ప్రభావం పడే అవకాశముంది.

నీళ్ల నిధులు, నియామకాలంటూ పోరాడిన టీ(బీ)ఆర్ఎస్ గడిచిన పదేండ్లకాలంలో అధికారంలో ఉండి కూడా కొత్తబ్లాకులను ప్రయివేటు సంస్థలకు ఇస్తూ ఒప్పందం చేసింది. ఓపెన్‌కాస్టు పేరుతో బొగ్గుగనుల్ని బొందల గడ్డగా మార్చింది. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ మన సింగరేణిని బొగ్గును ప్రయివేటు పెట్టుబడిదారులకు వేలం ద్వారా ప్రయోజనం చేకూర్చే కుట్రల్ని తెలంగాణలోని ప్రతి ఒక్కబిడ్డ తిప్పికొట్టాలి. సకల కార్మికులు, సబ్బండ వర్గాలు ఏకమై మరో సకల జనుల సమ్మె చేసైనా సరే సింగరేణిని కాపాడుకోవాలి. ఇది ఏ ఒక్కరిదో కాదు, మనందరి బాధ్యతగా గుర్తెరగాలి.



ఇజ్రాయిల్ మారణకాండ

- గాజా జనాభాలో 1.8శాతం మంది హత్య
- 75శాతం మంది 30ఏండ్లలోపు వారే
- గత 24గంటల్లో 25మంది మృతి

గాజా : గత 24గంటల్లో గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ సాగించిన దాడుల్లో 25మంది పాలస్తీనియన్లు మరణించారు. గతేడాది అక్టోబరు 7 నుండి మొదలైన ఈ దాడుల్లో ఇప్పటివరకు 1.8శాతం మంది గాజా జనాభా మరణించారని పాలస్తీనా సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ డేటా వెల్లడించింది. వీరిలో 75శాతం మంది 30ఏళ్ళ వయస్సు లోపువారే. మరోవైపు ఖాన్ యూనిస్ నగరంలో మళ్ళీ దాడులను ప్రారంభించిన ఇజ్రాయిల్ అక్కడి నుండి ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వేలాదిమంది సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ బయలుదేరారు. మార్గమధ్యంలో వీరు ఆహారం,నీరు లేకుండానే రోడ్ల పక్కనా, వీధుల్లో ఎక్కడబడితే అక్కడ పడుకుని వుండడం కనిపిస్తోంది. గాజాపై ఇప్పటికి 311 రోజులుగా విరామం లేకుండా దాడులు కొనసాగుతునే వున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు 16,456మంది పిల్లలు మరణించారని గాజా మీడియా కార్యాలయం తెలిపింది. గత పది మాసాల్లో ఇజ్రాయిల్ ఆర్మీ మొత్తంగా 3,486 సార్లు దాడులు చేయగా, ఈ దాడుల్లో ఇప్పటివరకు 39.897మంది మరణించగా, 92,152మంది గాయపడ్డారు.మరణించిన వారిలో 16,456మంది పిల్లలు కాగా, 11,088మంది మహిళలు వున్నారు. 885మంది వైద్య సిబ్బంది, 168మంది జర్నలిస్టులు, 79మంది పౌర రక్షణ బలగాలు మరణించిన వారిలో వున్నారు. కాల్పుల విరమణపై మరిన్ని రౌండ్ల చర్చలు జరుపుతూ, కొత్త ప్రతిపాదనలు చర్చించడానికి బదులుగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రతిపాదనను అమలు చేసే ప్రణాళికను అందచేయాల్సిందిగా హమాస్, అమెరికా, కతార్, ఈజిప్ట్‌లను కోరింది. గత వారంలో స్కూలుపై జరిగిన దాడిలో మరణించిన వారిలో 75మృత దేహాలను గుర్తించారు.. మిగిలినవి పూర్తిగా ఛిద్రమై పోవడంతో గుర్తు పట్టే వీల్లేకుండా పోయిందని గాజా పౌర రక్షణ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఉత్తర ఇజ్రాయిల్‌లోని అనేక



పట్టణాలను లక్ష్యంగా చేసుకుని హిజ్బుల్లా పలు రాకెట్లను ప్రయోగించడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రికత్తలు పెచ్చరిల్లాయి.

17మంది కుర్దిష్ తీవ్రవాదులు మృతి

ఉత్తర ఇరాక్‌లో టర్కీ మిలటరీ వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పికెకె) కి చెందిన 17మంది మరణించారని రక్షణ శాఖ వర్గాలు సోమవారం తెలిపాయి.

1984 నుండి టర్కీపై పోరాటం చేపట్టిన పికెకెను టర్కీ, అమెరికా, యురోపియన్ యూనియన్‌లు తీవ్రవాద సంస్థగా ప్రకటించాయి. పికెకెకి చెందిన విభాగంగానే పరిగణించే కుర్దిష్ వైపిజి మిలీషియాపై కూడా సిరియాలో టర్కీ దాడులు జరిపింది.

బడి కిచెన్ షెడ్డులో గొర్రెల మంద

- బిల్లులు చెల్లించడం లేదని మాజీ చైర్మెన్ నిరసన



నవతెలంగాణ-మల్లాపూర్

గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు చాలా కాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి బడిలో నిర్మించిన వంట షెడ్డులో గొర్రెలను తోలి నిరసన వ్యక్తం చేశారు. మన ఊరు-మనబడి మొదటి విడత పనుల్లో భాగంగా నిర్మించిన వంట గది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో సోమవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామంలో ఎస్ఎంసీ మాజీ చైర్మెన్ దండికే శంకరయ్య వంటశాలలో గొర్రెలను తోలి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగుంట గ్రామంలో మన ఊరు మనబడి మొదటి విడతలో పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. ఏడాది గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఇటీవల కిచెన్ షెడ్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఖాతాలో ఉన్న 2లక్షల 35 వేల రూపాయలు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం బడి పిల్లలు వచ్చే సమయానికి మేకలు, గొర్రెల మందను నూతనంగా నిర్మించిన కిషన్ గదిలోకి తోలి.. అధికారులకు విషయం చెప్పానని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు రావాల్సిన బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎంఈవో వాసం భీమయ్యని స్పందిస్తూ.. కిచెన్ షెడ్డుకు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమ అయినా.. వాటిని ఎలా డ్రా చేయాలనేది ప్రభుత్వం నుంచి ఎటువంటి విధివిధానాలూ రాలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వాటిని అందజేస్తామని చెప్పారు.

గురుకుల విద్యార్థుల మృతి ఆందోళనకరం

- ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- అనిరుధ్ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు మృతి చెందడం ఆందోళనకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థి అనిరుధ్ మృతి చెందిన విషయం విదితమే. అతని కుటుంబాన్ని సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో సోమవారం సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. పార్టీ నుంచి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొంతకాలంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆలనా పాలనలో నిర్లక్ష్యం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల కాలంలో 36 మంది విద్యార్థులు మృతి చెందారని చెప్పారు. ఆత్మహత్యలు, పాముకాటుకు గురై విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎనిమిది నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లలో కల్తీ, నాణ్యత లేని ఆహారం వల్ల 5వేల మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారని వాపోయారు. వివిధ కారణాలతో మృతి చెందిన 36మంది పేద విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా విద్యార్థులకు మంచి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. మిగతా విద్యార్థుల తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చొద్దని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ వేస్తున్నట్టు ప్రకటించారు. ఆ కమిటీ ద్వారా పాఠశాలల వసతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తున్న రైతులకు మద్దతు
- భూములు తీసుకోవద్దని ఆర్డీవోకు వినతి



నవతెలంగాణ-న్యాల్‌కల్

రైతుల భూముల జోలికొస్తే ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని.. కంపెనీల పేర అన్నదాతలకు అన్యాయం చేయొద్దని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసమంటూ ఇటీవల కలెక్టర్, రెవెన్యూ అధికారులు సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూర్, వడ్డీ, మల్గి గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టారు. కాగా, సాగు చేసుకునే భూములను ఏ కంపెనీలకూ ఇవ్వబోమంటూ రైతులు ఆనాడే అధికారులకు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల రైతులతో కలిసి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న రైతులకు నష్టం కలిగించే చర్యలు చేపట్టొదన్నారు. ఫార్మా కంపెనీల పేరు చెప్పి.. రైతుల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. రైతుల భూములు గుంజుకోవాలని చూస్తే ఉద్యమాలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. పచ్చటి పొలాల మధ్యకు కంపెనీలను తీసుకొచ్చి.. కాలుష్యం చేయొద్దన్నారు. మంత్రులు, జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. అనంతరం ఫార్మా కంపెనీల కోసమని రైతుల భూములు తీసుకోవద్దంటూ జహీరాబాద్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, నాయకులు నరసింహారెడ్డి, తట్టు నారాయణ, రవికుమార్, మారుతి, రైతులు కిరణ్ గౌడ్, శివరాజ్, రాజు పటేల్, రవి గౌడ్, సుభాష్ సెట్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం

- పెద్దకొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో ఘటన
- రూ.20 వేలు తీసుకున్నా పాస్‌పుస్తకం ఇవ్వడం లేదని ఆరోపణ



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పట్టాపాస్ పుస్తకం ఇవ్వడం లేదంటూ ఓ రైతు ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితుడి వివరాల ప్రకారం.. వడ్లం గ్రామానికి చెందిన రైతు అంజయ్య భూమి పట్టా పాస్‌పుస్తకం కోసం కొన్ని నెలల కిందట దరఖాస్తు చేసుకున్నాడు. కాగా, ఆర్ఐ పండరి రూ.20 వేల లంచం అడిగితే నగదు ఇచ్చాడు. అయినప్పటికీ ఆర్ఐ పండరి పాసుపుస్తకం ఇవ్వకుండా.. రేపు మాపంటూ కాలయాపన చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేశాడు. దాంతో మనస్తాపం చెందిన రైతు అంజయ్య తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణికి వచ్చి అక్కడే పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానికులు అతన్ని పెద్దకొడప్‌గల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తహసీల్దార్ దశరథ్ స్పందిస్తూ.. రైతు అంజయ్య భూమి పార్ట్-బిలో ఉందని, దానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఏమీ చేయలేమని తెలిపారు. ఆర్ఐ పండరి రైతు వద్ద రూ.20వేలు తీసుకున్నట్టు తమ దృష్టికి రాలేదని, దీనిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

తెలంగాణ ఉద్యోగ జేఏసీకి పూర్వవైభవం

- 53 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో ఏర్పాటు
- చైర్మెన్‌గా మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావు
- మమ్మల్ని పిలవండి.. సమస్యలను పరిష్కరించండి
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి
- పెండింగ్ డీఏలను ప్రకటించాలి
- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
- స్థానికత ఆధారంగా 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి
- 15 రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం : నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆవిర్భవించింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో కూడిన 53 సంఘాలతో ఏర్పాటైంది. సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ జేఏసీ ఎంత క్రియాశీలక పాత్ర పోషించిందో ఇప్పుడు ఆ బాధ్యతను ఈ జేఏసీ నెరవేర్చనుంది. పదేండ్ల తర్వాత తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఏర్పడి పూర్వవైభవానికి నాంది పలికింది. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం 15 మందితో స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్‌గా టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్‌గా టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉద్యమంలో పాల్గొన్న సంఘాలను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం : జగదీశ్వర్

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జగదీశ్వర్ అన్నారు. స్నేహపూర్వక ప్రభుత్వమంటూనే ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంలో ఉన్నపుడు చేసిన తప్పిదాల వల్లే ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్నామంటూ బీఆర్ఎస్ నాయకులే చెప్తున్నారని గుర్తు చేశారు. ఇష్టమొచ్చినట్టు జోనల్ విధానం తెచ్చారని విమర్శించారు. 317 జీవోను తెచ్చి ఇష్టమొచ్చినట్టు ఉద్యోగులను విభజించారని అన్నారు. అప్పుడు తమ సంఘం అధ్యక్షులు మాట్లాడే పరిస్థితి లేదనీ, చెప్పినా నాటి సీఎం వినలేదని చెప్పారు. స్థానికత ప్రకారం 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన జీతాలివ్వడం సంతోషమేనని అన్నారు. అయితే ఉద్యోగులందరికీ రావడం లేదనీ, అందరికీ 010 పద్దు కింద జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జీతమిస్తేనే పండుగ చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటున్నదనీ, దాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని మంజూరు చేయాలని కోరారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేశాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులపై కమిటీ ఏర్పాటు చేసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల చందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలను అమలు చేయాలని కోరారు. వీఆర్వో వ్యవస్థ లేదనీ, అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఉద్యోగులకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. తొమ్మిది నెలలైనా తమను పిలిచి మాట్లాడలేదని చెప్పారు. విదేశీ పర్యటన నుంచి వచ్చాక తమను పిలిచి మాట్లాడాలనీ, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. గచ్చిబౌలి, భాగ్యనగర్ హౌజింగ్ సొసైటీల భూముల కేటాయింపు జీవోలను సవరించాలని కోరారు. 15 రోజుల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. నల్లబ్యాడ్జీలు ధరిస్తామనీ, భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని అన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే అన్ని సంఘాలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం కొట్లాడతామని చెప్పారు.

ఆగస్టు 15 తర్వాత సమస్యలు పరిష్కారం : ఏలూరి

ఈనెల 15 తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం చెప్పిందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి తమను పిలిచి మాట్లాడతారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇన్ని రోజులు ఆగామన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటినందున ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ-కుబేర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు టోకెన్ సిస్టం ఉండొద్దని సూచించారు. 010 పద్దు కింద లేని ఉద్యోగులున్నారనీ, వారికి ఒకటో తేదీన జీతాలివ్వాలని చెప్పారు. ఆర్థిక భారం లేని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆ తర్వాత సీఎస్ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కాకుంటే కార్యాచరణ చేపడతామన్నారు.

పీఆర్సీ నివేదిక తెప్పించి అమలు చేయాలి : చావ రవి

పదేండ్ల తర్వాత ఉద్యోగ జేఏసీ ఏర్పాటు కావడం శుభపరిణామమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ఉద్యోగు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మధ్య రాబోయే రోజుల్లో ఐక్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక వాగ్దానాలను ఇచ్చిందనీ, వాటిని నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ నివేదికను తెప్పించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించాలి : శ్రీపాల్‌రెడ్డి

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందించి అమలు చేయాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణకు అవకాశం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యావ్యవస్థలో పర్యవేక్షణ వ్యవస్థ లేదన్నారు. డీఈవో పోస్టులను మంజూరు చేయలేదనీ, ఇన్‌చార్జీ డీఈవోలు కొనసాగుతున్నారని చెప్పారు. జేఎల్, బీఈడీ, డైట్ కాలేజీల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించాలని సూచించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని కోరారు. ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు తహసీల్దార్లను బదిలీ చేశారనీ, వారి సమస్యను పరిష్కరించాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ముజీబ్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్ (టీఎన్జీవో), సత్యనారాయణ (టీజీవో), పి మధుసూదన్‌రెడ్డి (జీజేఎల్ఏ), చంద్రశేఖర్‌గౌడ్ (గ్రూప్-1 అధికారుల సంఘం), గౌతంకుమార్ (ట్రెసా), ఎం పర్వత్‌రెడ్డి (ఎస్టీయూటీఎస్), అంజిరెడ్డి (టీఆర్టీఎఫ్), రాధాకృష్ణ (టీపీటీయూ), మణిపాల్‌రెడ్డి (టీటీయూ) తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' పూర్తి కాకుండానే ప్రారంభమా..?

- నీరు ఎలా విడుదల చేస్తారు?: రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని,టి.సాగర్



నవతెలంగాణ-సుజాతనగర్

"సీతారామ ప్రాజెక్టులో భాగంగా లిఫ్ట్ పనులు పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారు.. బహుళ ప్రయోజనాలతో రూ.3,500 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టును హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చింది..? ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారు..? గోదావరిపై సీతమ్మ సాగర్ డ్యామ్ పూర్తి కాకుండా నీరు ఎలా విడుదల చేస్తారు.." అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కేంద్రంలో ఎలమంచిలి వంశీకృష్ణ అధ్యక్షతన సోమవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవానికి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. రూ.18 వేల కోట్లతో చేపట్టిన ఈ లిఫ్ట్ నిర్మాణంలో ఇప్పటివరకు రూ.8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇంకా పదివేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండానే ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గోదావరిపై సీతమ్మ సాగర్ డ్యామ్ పూర్తి కాకుండానే సీతారామ ప్రాజెక్టుకు నీరు ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మూడున్నర లక్షల ఎకరాలకు నీరందించిన తర్వాత ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు ఈ నీటి కోసం ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారన్నారు. సీతమ్మ సాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు అని, 280 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 30 టీఎంసీల వాటర్ స్టోరేజ్, రహదారి, మిషన్ భగీరథ, హెవీ వాటర్ ప్లాంట్ వంటి బహుళ ప్రయోజనాలతో రూ.3,500 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పూర్తి కాకుండా నీళ్లు విడుదల చేయటం అసాధ్యమని అన్నారు. ఓ వైపు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తూ.. మరోవైపు 2028 ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి ప్రకటించటం విడ్డూరంగా ఉందని అన్నారు. అలాంటప్పుడు ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే ఎందుకు ప్రారంభిస్తున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, కున్సోత్ ధర్మ కొండబోయిన వెంకటేశ్వర్లు, రవికుమార్, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, కనక రత్నం, సత్యనారాయణ, నల్లగోపు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో పట్టపగలు భారీ చోరీ

- కారు అద్దం పగలగొట్టి రూ.10 లక్షల అపహరణ
- పనిచేయని సీసీ కెమెరాలు



నవతెలంగాణ-జోగిపేట

పట్టపగలు.. అది కూడా పోలీస్ స్టేషన్ పక్కనే.. ఆగి ఉన్న కారు అద్దం పగులకొట్టి రూ.10లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణ కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి విద్యుత్ శాఖ రిటైర్డ్ ఏడీఈ. సోమవారం ఆయన ఎస్‌బీఐ బ్యాంకులో తన కొడుకు ఖాతాలోంచి చెక్కు ద్వారా రూ.10 లక్షలు డ్రా చేశాడు. ఆ డబ్బులను తీసుకుని కారులో ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో డబ్బుల సంచిని తన పక్క సీటులో పెట్టి.. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన కారును నిలిపి రోడ్డుకు అవతల ఉన్న స్వీట్ హౌస్‌లో స్వీట్ కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. స్వీట్ కొనుక్కొని వచ్చేలోపు ఎడమ వైపు ముందు డోరు అద్దం పగిలిపోయి కనిపించింది. సంచిలోని రూ.10 లక్షలు కనిపించలేదు. వెంటనే పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడంతో.. ఎస్ఐ పాండు సిబ్బందితో కలిసి చుట్టుపక్కల సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. కానీ ఆ సీసీ కెమెరాలు ఏవీ పనిచేయట్లేదు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా పని చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సీఐ అనిల్ కుమార్ అక్కడికి వచ్చి విచారణ చేపట్టారు. బ్యాంకు మేనేజర్‌తో చర్చించి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు. పట్టణంలో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేసి ఉంటే దుండగులు వెంటనే దొరికేవారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో రైళ్ల బోగీలను పెంచాలి

- సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యుల నాగలక్ష్మి
- అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ వద్ద సంతకాల సేకరణ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హైదరాబాద్‌లో మెట్రో రైలులో బోగీలను మూడు నుంచి ఆరుకు పెంచాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ వద్ద సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెట్రో రైళ్లలో రద్దీ విపరీతంగా ఉంటోందని.. మెట్రో రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో కొందరు వారి స్టేషన్ దాటి పోయిన తర్వాత దిగిన సందర్భాలూ ఉన్నాయన్నారు. కావున మెట్రోకు మరో మూడు బోగీలు కలిపి ఆరు బోగీలు చేయాలని కోరారు. ఈ ఆరు కోచ్‌లకు సరిపోయేలా మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫారం సిద్ధంగా ఉందని.. అయినా బోగీలను పెంచకుండా ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న మెట్రో యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద ఆగస్టు 13, 14 తేదీల్లో సంతకాల సేకరణ చేపడతామని చెప్పారు. 17వ తేదీన బేగంపేట మెట్రో భవన్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు రాపర్తి అశోక్, నాయకులు టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, బి.సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీహెచ్ డాక్టర్ గడల శ్రీనివాసరావు వీఆర్ఎస్ కు ఆమోదం

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో

రాష్ట్ర ప్రజారోగ్య మాజీ సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు వీఆర్ఎస్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయన్ను ప్రభుత్వం గత నెల 27న మహబూబాబాద్ అడిషినల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా నియమించింది. కానీ, ఆయన లాంగ్ లీవ్‌లో ఉండటంతో జాయిన్ అవ్వలేదు. ఇన్‌చార్జ్ డీహెచ్ పోస్టు నుంచి తప్పుకున్నాక ఆయన లాంగ్ లీవ్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన రెండుసార్లు వీఆర్ఎస్‌కు అప్లై చేయగా, తాజాగా ఆమోదిస్తూ సర్కార్ ఉత్తర్వులిచ్చింది.

సీబీఐ దర్యాప్తు చేయాల్సిందే



(మొదటిపేజీ తరువాయి)

తనను బాగా అప్రతిష్టపాల్జేశారని వ్యాఖ్యానించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సంజయ్ వశిష్ట్‌ను ఆదివారం పదవి నుంచి తొలగించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులతోనూ మాట్లాడారు. కుటుంబ సభ్యులు కావాలని కోరుకుంటే కేంద్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించడానికి తనకెలాంటి ఇబ్బంది లేదని ఆమె తెలిపారు. ఇదిలావుండగా, ట్రెయినీ డాక్టర్‌కు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎఫ్ఓఆర్‌డీఏ) సోమవారం దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టింది. పలు ఆస్పత్రుల ఎదుట జూనియర్ డాక్టర్లు ఆందోళన నిర్వహించారు. ఢిల్లీలోని లోక్‌నాయక్ హాస్పిటల్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి ఇంకా ప లు ఆస్పత్రుల ఎదుట డాక్టర్లు ధర్నాలు చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఓఆర్‌డీఏ ప్రధాన కార్యదర్శి సర్వేష్ పాండే మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా డాక్టర్లు ఈ ఆందోళనతో చేతులు కలిపారని చెప్పారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు నిరవధికంగా ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. డిమాండ్లు నెరవేరుస్తామని రాత పూర్వక హామీ ఇవ్వాలని, అప్పటివరకు సమ్మె ఆపేది లేదని చెప్పారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. అన్ని ఆస్పత్రుల్లోనూ కేంద్ర రక్షణ చట్టాన్ని అమలు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఎఫ్ఓఆర్‌డీఏ భారత్ అధ్యక్షుడు డాక్టర్ అవిరల్ మాథుర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఈ సంఘటనను ఖండించాలన్నారు. రోగులను ఇబ్బంది పెట్టాలని తాము భావించడం లేదని, అయితే ముందుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అత్యవసర సేవలు కొనసాగుతాయని చెప్పారు. సంబంధిత అధికారులతో తాము మాట్లాడుతున్నామని, తమ డిమాండ్లు నెరవేరుతాయన్న నమ్మకం తమకు వుందని చెప్పారు. రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి వద్ద ఆందోళన జరుపుతున్న డాక్టర్లలో ఒకరు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న దర్యాప్తు పక్షపాత ధోరణితో కొనసాగుతోందని, అందువల్ల ఈ కేసులో సీబీఐ ఫాస్ట్ ట్రాక్ దర్యాప్తు చేపట్టాలని, తమ మూడు ప్రధాన డిమాండ్లలో ఇది మొదటిదని చెప్పారు. ఏ అమాయకుడినైనా పట్టుకొచ్చి, తమ నోరు మూయించవచ్చని, కానీ తాము అలా జరగబోనివ్వమని చెప్పారు. ఇది ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కలిసి పాల్పడిన ఘాతుకమని అన్నారు. 'డాక్టర్ల డ్యూటీ రూమ్‌లో ఇది జరిగినపుడు ఆ అమ్మాయి రాత్రి పూట ఒంటరిగా ఏం చేస్తోంది.' అంటూ వ్యాఖ్యలు చేసిన అధికారులను తక్షణమే తొలగించాలన్నది తమ రెండవ డిమాండ్ అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో కేంద్ర రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, ఇది తమ మూడవ డిమాండ్ అన్నారు. ఇదిలావుండగా, సంఘటన జరిగిన నాటి రాత్రి విధుల్లో వున్న ముగ్గురు జూనియర్ డాక్టర్లు, ఒక హౌస్ స్టాఫ్‌ను కోల్‌కతా పోలీసులు విచారణకు పిలిచారు. ఈ నెల 9న జరిగిన ఈ ఘటనపై తీవ్రంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

కమీషన్ల కోసమే 'మెఘా'కు కొమ్ము

- కాంగ్రెస్‌కు కామధేనువుగా ఆ సంస్థ దాన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలి : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమీషన్ల కోసమే మెఘా కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి కొమ్ము కాస్తున్నారని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, తదితర రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఫండింగ్ ఇచ్చేందుకు ఆ సంస్థతో ఒప్పందం జరిగిందనీ, ఆ పార్టీకి అది కామధేనువుగా మారిందని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో గల మీడియా హాల్‌లో ఆయన మాట్లాడారు. సుంకిశాల ఘటనకు మెఘా సంస్థదే బాధ్యత అని వాటర్‌బోర్డు చెబుతున్నప్పటికీ రాష్ట్ర సర్కారు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ కంపెనీపై ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మాజీ, తాజా సీఎంల మధ్యలో రాష్ట్రాన్ని ఆ సంస్థ దోపిడీ చేస్తున్నదని ఆరోపించారు. కొడంగల్ అభివృద్ధి పనుల కాంట్రాక్టులను ఆ సంస్థకే ఇవ్వడం వెనుకున్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మెఘా సంస్థ 56 కాంట్రాక్టులు పొందితే ఇప్పటి వరకూ ఏ ఒక్క పనిని కూడా పూర్తిచేయలేదని చెప్పారు. సుంకిశాల ప్రాజెక్టు పాక్షికంగా కూలడానికి కారణమైన ఆ కంపెనీని తక్షణమే బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. జరిగిన నష్టాన్ని పూర్తిగా ఆ కంపెనీతోనే భర్తీ చేయించాలనీ, ఆ మేరకు పెనాల్టీ విధించాలని సూచించారు.

ఆ కంపెనీ తప్పిదాలపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన, పోరాటం చేస్తామని ప్రకటించారు. తమ ఎమ్మెల్యేల బృందం మంగళవారం సుంకిశాల ప్రాజెక్టును సందర్శిస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం నిర్వీర్యం

- 15.30 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం నిర్వీర్యమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సాగు విస్తీర్ణం పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గడం తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలోనే దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం ఎందుకు ఏర్పడిందో చెప్పాలన్నారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని మండిపడ్డారు. "కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీళ్లు మళ్లించే ప్రణాళిక లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో.రైతు బతుకుకు భరోసానే లేదు" అని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ అని మభ్య పెట్టి, పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ ఏర్పడిందని ఆరోపించారు.



ఎరువులు-విత్తనాల కోసం రైతులు క్యూలైన్లో పాసుబుక్కులు, చెప్పులు పెట్టే ఆ నాటి పరిస్థితి మళ్లీ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్ద, పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సుంకిశాల ప్రమాదంపై చర్యలేవి? రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

సుంకిశాల ప్రాజెక్ట్ ప్రహరీ గోడ కూలిన ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సంఘటన జరిగిన వారం వరకు ఎందుకు దాచి పెట్టారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రమాదానికి కాంట్రాక్ట్ సంస్థ కారణమైతే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రుల్లో డాక్టర్లకే రక్షణ లేకుంటే ఆడపిల్లలకు ఇంకెక్కడ భద్రత?: కేటీఆర్

ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే డాక్టర్లు సురక్షితంగా లేకుంటే ఆడపిల్లలు ఇంకెక్కడ భద్రంగా ఉండగలుగుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి మర్డర్ చేసిన వారిని వదలొద్దంటూ ఆయన బెంగాల్ ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆ సంఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు.బాధితురాలి తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహి తులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బెంగాల్‌లోని మమతా సర్కార్ నేరస్తుల్ని పట్టుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తుందని నమ్ముతున్నట్టు కేటీఆర్ తెలిపారు. నిరసన తెలుపుతున్న డాక్టర్లకు సంఘీభావం తెలిపారు.

అధికారంలో ఉన్నప్పుడు కాల్‌సెంటర్లు గుర్తురాలేదా?

- బీఆర్ఎస్ హయాంలో ఒక్క కొత్త బస్సు కొనలేదు
- రుణమాఫీపై మొసలికన్నీరు వద్దు : బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై మంత్రి పొన్నం ఫైర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అధికారంలో ఉన్నప్పుడు రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాల్‌సెంటర్లు ఎందుకు గుర్తురాలేదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష రుణమాఫీ అని చెప్పి, మూడు లక్షల మంది అర్హులైన రైతులకు ఎగవేశారని గుర్తుచేశారు. వేలాదిమంది రైతుల్ని బ్లాక్‌లిస్టుల్లో పెట్టి, కొత్త రుణాలు పుట్టకుండా చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తున్నామనీ, సాంకేతిక కారణాలతో కొందరికి రుణం మాఫీ కాలేదనీ, వారికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటనలు చేసిందని చెప్పారు. హరీశ్‌రావు కాల్‌సెంటర్‌కు రుణమాఫీ కోసం వచ్చిన దరఖాస్తులన్నీ వారి హయాంలో చేస్తానన్నవేనని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క కొత్త బస్సు కూడా కొనలేదనీ, తాము కొత్త బస్సులు తెస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని చెప్పారు. వాళ్లు బస్సులు ఆర్డర్ చేస్తే, తామొచ్చి రిబ్బన్ కట్ చేస్తున్నామంటూ అసత్య ప్రచారానికి దిగడం సిగ్గుచేటన్నారు. నెల రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రేషన్‌కార్డు లేని వారికి, సాంకేతిక సమస్య ఉన్నవాళ్లకి రుణమాఫీ చేస్తామని చెప్పామనీ, దీనితో రైతులు నిశ్చింతగా ఉన్నారని చెప్పారు.

72వేల మంది రైతులకు రుణమాఫీ కాలే...

- మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైతు రుణమాఫీ 72వేల మందికి అందలేదని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు తెలిపారు. రుణమాఫీ అందని రైతుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో వాట్సాప్ హెల్ప్‌లైన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనికి వచ్చిన దరఖాస్తులను సోమవారంనాడాయన పార్టీ కార్యాలయంలో పరిశీలించారు. రుణమాఫీ కోసం ఏర్పాటు చేసిన 8374852619 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటి పరిశీలనా కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ శ్రీమతి సత్యవతి రాథోడ్, తెలంగాణ భవన్ ఇంచార్జ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వం మారడం వల్లే రిబ్బన్ కటింగ్ అవకాశం 'సీతారామ' క్రెడిట్ కోసం కాంగ్రెస్ తాపత్రయం మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం వల్లే సీతారామ ప్రాజెక్ట్ రిబ్బన్ కటింగ్ అవకాశం కాంగ్రెస్‌కు వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. ఆ ప్రాజెక్టుకు నామకరణం చేయడం నుంచి నిరంతరం పర్యవేక్షించి, దాదాపు పనులన్నీ పూర్తిచేసిన ఘనత మాజీ సీఎం కే చంద్రశేఖరరావుకే దక్కుతుందన్నారు.
సోమవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు ప్రారంభ సన్నాహక సమావేశాల్లో కాంగ్రెస్ మంత్రులు నెత్తి మీద నీళ్ళు చల్లుకుంటున్నారనీ, ఈ నెల 15 న సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆ క్రెడిట్ కొట్టేసేందుకు మరో ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోడానికి కాంగ్రెస్ కోర్టులో కేసులు వేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కష్టాలు అధిగమించి పట్టుదలతో పూర్తి చేసిందన్నారు. ఇతరుల ఘనతను తమ ఘనతగా చెప్పుకునేవాళ్లను పరాన్నజీవులు అంటారనీ, కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ తీరు అలాగే ఉందని విమర్శించారు. రూ.75 కోట్లకే లక్షన్నర ఎకరాలకు నీళ్లు ఇచ్చామంటే కాంగ్రెస్ సర్కారుకు నోబెల్ ప్రైజు ఇవ్వాలనీ, వారు ప్రారంభించిన మూడు పంపు హౌజ్ పనుల్లో పది పైసల పని కూడా వారు చేయలేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు దగ్గరికి రోజుకో మంత్రి వెళ్తున్నారనీ, ఇది చూసి జనం నవ్వుకుంటున్నారని అన్నారు. 30 వేల ఉద్యోగాల తీరులాగే, సీతారామ ప్రాజెక్టుపైన కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉన్నదని చెప్పారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం కోసమే మీ తాపత్రయమైతే, అదే మీ నైతిక పతకానికి సంకేతమవుతుందన్నారు. రాష్ట్రంలో పరిపాలన గాడితప్పిందనీ, గ్రామాల్లో పారిశుధ్యం లేక జనం రోగాల బారిన పడుతున్నారన్నారు. 8 నెలల బాబు డెంగీతో చనిపోయాడనీ, మరో మూడు వేల డెంగీ కేసులు నమోదయ్యాయనీ, పసికందులను కుక్కలు పీక్కుతింటున్నాయని చెప్పారు.

హాస్టళ్లలో కలుషిత ఆహారం, వైన్ షాపులకు టార్గెట్లు పెట్టడం వంటివి చూస్తుంటే ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై శ్రద్ధ లేదని తేలిపోతున్నదని అన్నారు.

నేటితరానికి అరిబండి జీవితం ఆదర్శం



- ఏఐకేఎస్ మాజీ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కుటుంబాన్ని, వ్యవసాయాన్ని పూర్తిగా వదిలేసి ఉద్యమ బాట పట్టిన వ్యక్తి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ అని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) మాజీ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయలో అరిబండి లక్ష్మీనారాయణ 26వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఆయన పూరి గుడిసెలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను నిర్వహించారని చెప్పారు. నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. 1978, 1985లో రెండుసార్లు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా గెలిచారని వివరించారు. ఆయన్ను కమ్యూనిస్టు గాంధీగా పిలిచే వారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు రాహుల్, కౌసల్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- హైదరాబాద్, సిద్దిపేటలో ఘటనలు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట/ రాయపోల్



హైదరాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఐదుగురు యువకులు మృతిచెందారు. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతిచెందగా.. సిద్దిపేటలో బైక్‌ను, లారీని డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణం కోల్పోయారు. హైదరాబాద్ ఘటనకు సంబంధించి బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..

సైదాబాద్ శంకేశ్వర్ బజార్‌కు చెందిన బ్యాగరీ శ్రీహరి(28), అదే ప్రాంతానికి చెందిన సందీప్(20), అభిలాష్(20) స్నేహితులు. సైదాబాద్‌లో ఆదివారం బోనాల పండుగకు వెళ్లి సోమవారం ఉదయం మైలార్దేవులపల్లికి బైక్‌పై ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట మీదుగా ఆశమాబాద్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో ముగ్గురు 20 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలపాలైన సందీప్, అభిలాష అక్కడికక్కడే మృతిచెందారు. రక్తపు మడుగులో ఉన్న శ్రీహరిని స్థానికులు సమీప ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుల సెల్‌ఫోన్‌ల ఆధారంగా వారి పేర్లు, బంధువులను కనుక్కొని విషయాన్ని తెలిపారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పజెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

ద్విచక్ర వాహనం, లారీని ఢీకొట్టిన డీసీఎం

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామం గుర్రాల సోఫా సమీపంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తొగుట సీఐ షేక్ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మొక్కజొన్న కంకులను నింపుకొని చేగుంట వైపు వెళుతున్న డీసీఎం వడ్డేపల్లి గుర్రాల సోఫా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ తర్వాత గజ్వేల్ వైపు వస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీని ఢీకొట్టి డీసీఎం బోల్తా పడింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై గజ్వేల్ వైపు వెళ్తున్న దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన మామిండ్ల నవీన్(20), మామిండ్ల వంశీ(19) అక్కడికక్కడే మృతిచెందారు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ చాకలి రాకేష్ తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని డీసీఎం డ్రైవర్ రాకేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. నవీన్, వంశీ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షేక్ లతీఫ్ తెలిపారు.



రాడార్ ప్రాజెక్టుకు రిజర్వ్ ఫారెస్ట్ భూమి కేటాయింపు సరికాదు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- దామగుండం అడవిని రక్షించండి : ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాడార్ ప్రాజెక్టు కోసం వికారాబాద్‌లోని రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కేటాయించడం సరికాదని స్వచ్ఛంద సేవా సంస్థ ట్రూ హెల్పింగ్ హాండ్స్ అభిప్రాయపడింది. అక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ ప్రతినిధులు కార్తీక్ యాదవ్, వై.గీత, శ్రీశైలం యాదవ్, రాజు యాదవ్, రాంచంద్రయాదవ్, ఆదిత్య, లోకేష్ తదితరులు మాట్లాడారు. భారత నౌకాదళానికి వెరిలో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్‌ను అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూముల్లో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 18 నగరాల్లో ప్రదర్శనలు జరిగాయని తెలిపారు. అటవీ పరిరక్షణ జేఏసీ, పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు వద్దని సూచిస్తున్న కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం 2,900 ఎకరాల్లో 12 లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 20 గ్రామాల్లోని 60 వేల మంది ప్రజల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నుంచి వచ్చే రేడియేషన్, అటవీ నిర్మూలన ఫలితంగా పెరిగిన పుప్పొడి సాంద్రతలతో ముడిపడి ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి నిపుణులు హెచ్చరిస్తున్నారని గుర్తుచేశారు. ఇది హైదరాబాద్‌తో సహా నివాసితులలో శ్వాసకోశ రుగ్మతలకు దారితీయవచ్చని తెలిపారు.

ప్రపంచ పటంలో తెలంగాణ పర్యాటకం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. నెలకు ఒకసారి మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయా జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల్లో కుటుంబాలతో కలిసి బస చేయాలనే మంత్రి సూచన అభినందనీయమన్నారు. కిన్నెరసాని నుంచి భద్రాచలం వరకు అడవులు ఎకో టూరిజానికి అనువుగా ఉన్నాయని తెలిపారు. నేలకొండపల్లిలోని బౌద్ధ స్థూపం మొదలు భద్రాచలం సీతారాముల ఆలయం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖిల్లాకు రోప్‌వే కావాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. అందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు అనుమతులు ఇస్తూ వెంటనే సంతకాలు చేశారని, త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు నేలకొండపల్లి బౌద్ధారామాల వద్దకు జపాన్ లాంటి దేశాల నుంచి బుద్ధిష్టులను ఆహ్వానించాలన్నారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు రావడంతో స్థానికంగా ఆదాయంతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్‌కు కేంద్రమని, ఆ ఉద్యోగులు సెలవుల్లో ప్రశాంతంగా గడిపేందుకు అడవుల్లో ట్రెక్కింగ్, వాకింగ్ ట్రాక్, రిసార్ట్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు.

ఖిల్లాపై కిలోమీటర్ రోప్ వే: మంత్రి జూపల్లి

ఖిల్లాపై కిలోమీటర్ మేర రూ.30 కోట్లతో రోప్ వే నిర్మాణానికి చర్యలు చేపడుతామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. రాష్ట్రంలో టూరిజం కొత్తపుంతలు తొక్కనుందని తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రపంచంలో తక్కువ జనాభా, వనరులు లేకున్నా ఎన్నో దేశాలు టూరిజంలో పేరుగాంచాయన్నారు. మన రాష్ట్రంలో అన్ని వనరులూ ఉన్నాయన్నారు. వీలైనంత త్వరలో రోప్‌వే నిర్మాణం చేపడుతామన్నారు. జిల్లాలో 2200 సంవత్సరాల పూర్వం నాటి ఆసియా ఖండంలోనే అతిపెద్ద బౌద్ధస్థూపం, భక్త రామదాసు ధ్యానమందిరం, పాలేరు, వైరా రిజర్వాయర్లు వంటి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. పర్యాటక ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వివిధ మార్గాలుగా ప్రచారం కల్పించాలని అన్నారు.

ఖిల్లాకు వెయ్యి ఏండ్ల చరిత్ర : మంత్రి తుమ్మల

ఖమ్మం ఖిల్లాకు వెయ్యి ఏండ్ల చరిత్ర ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేలకొండపల్లి భక్తరామదాసు, బౌద్ధస్థూపాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశానన్నారు. రోప్‌వే వేస్తే తప్ప ఖిల్లాలో విహారానికి అవకాశం లేదన్నారు. భద్రాద్రికి రైల్వే లైన్ కనెక్టివిటి వస్తున్నట్టు, నేషనల్ హైవే, విమాన సేవలు రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం రాకుండా ఓఆర్‌ఆర్ ద్వారా నేరుగా భద్రాచలం వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. గోదావరిలో పాపికొండలు తదితర విహార యాత్రలకు ప్యాకేజీలు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, టూరిజం అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్ రెడ్డి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా తదితరులు పాల్గొన్నారు.

'జీఎన్ఎమ్' పేరుతో మోసం

- అడ్మిషన్లు తప్ప క్లాసుల్లేవు
- మూడేండ్లుగా మెడికల్ కాలేజీల్లో వెట్టిచాకిరీ
- మోసపోయిన విద్యార్థినులు
- పోలీసులను ఆశ్రయించినా ఫలితం శూన్యం
- సర్టిఫికెట్లు అడిగితే నైటింగెల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం బెదిరింపు



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి, కేశంపేట కస్తూర్బా గాంధీ జూనియర్ కాలేజీలో 2020-21 విద్యా సంవత్సరం బైపీసీ పూర్తి చేసుకున్న విద్యార్థినులు మోసానికి గురయ్యారు. పదేండ్లుగా భాస్కర్ మెడికల్ కాలేజీలో సీనియర్ నర్సుగా పనిచేస్తున్న వ్యక్తి మెడికల్ కోర్సు చేయిస్తానని చెప్పి.. తొందరగా ఉద్యోగం సంపాదించొచ్చని ఆశ చూపి వారిని నిండా ముంచింది. కేశంపేట నుంచి 25 మంది, శంకర్‌పల్లి నుంచి 30 మంది విద్యార్థినులను భాస్కర్ మెడికల్ కాలేజీలో ఏఎన్ఎమ్ హోదాలో ట్రెనింగ్ ఇప్పించి, నర్సులుగా ఉద్యోగం చేయించింది. ఇదే క్రమంలో నైటింగెల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో జీఎన్ఎమ్ కోర్సు అడ్మిషన్స్ ఇప్పించింది. అయితే, అక్కడ అడ్మిషన్స్ తప్ప విద్యార్థినులను ఒక్కరోజు కూడా క్లాస్‌లకు తీసుకెళ్లింది లేదు. కనీసం కాలేజీ ఎక్కడ ఉందో కూడా చూపించలేదు. 2022లో 36 మంది విద్యార్థినులతో డైరెక్ట్‌గా పరీక్షలు రాయించారు. నలుగురు తప్ప అందరూ ఫెయిల్ అయ్యారు.

అయితే, వీరు సప్లమెంటరీ పరీక్షలు రాస్తామంటే.. అధిక మొత్తం ఫీజులు చెల్లించాలని నైటింగల్ కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో కొంత మంది అర్ధాంతరంగా చదువు మానేశారు. మిగతా విద్యార్థినులతో ఆ నర్సు వివిధ ఆస్పత్రుల్లో పని చేయించింది. వారికి ఆస్పత్రుల్లో వచ్చే వేతనాన్ని ఫీజుల్లో జమ చేసుకుంటామని చెప్పి.. ఆ డబ్బులు కూడా నర్సే కాజేసింది. ఈ తతంగం అంతా మూడేండ్లుగా కొనసాగుతోంది. ఒకవైపు చదువు లేకపోవడం, మరోవైపు పని చేసినా డబ్బులు రాకపోవడంతో విద్యార్థినులు ఇటీవల ఆ నర్సును నిలదీశారు. తమ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. దాంతో అసలు విషయం వెలుగులోకి రావడంతో సంబంధిత నర్సు పరారీలో ఉంది. అయితే, ఆ నర్సు భాస్కర మెడికల్ ఆస్పత్రిలో పదేండ్లుగా పనిచేస్తోంది. ఆ అనుభవంతోనే విద్యార్థినులను ఆ ఆస్పత్రిలో ఉద్యోగానికి చేర్పించింది. నర్సును తిరిగి రప్పించాలని భాస్కర్ మెడికల్ కాలేజీ యాజమాన్యాన్ని కోరగా.. తమకేమీ సంబంధం లేదని చేతులెత్తేసింది. విద్యార్థినుల సర్టిఫికెట్లు తమ వద్ద లేవని, కేవలం ఉద్యోగులుగా మాత్రమే తీసుకున్నామని, అందుకు వేతనాలు చెల్లించామని చెబుతోంది. దాంతో విద్యార్థినులు తాము మూడేండ్ల జీవితాన్ని కోల్పోయామని కన్నీటిపర్యంతమవుతున్నారు.

'వైద్య వృత్తిలో తొందరగా ఉద్యోగాలు వస్తాయంటే నమ్మి ఓ నర్సు చేతిలో మోసపోయాం. మా పేదరికాన్ని ఆసరాగా చేసుకుని మా బతుకులను బజారుకీడ్చారు. జీఎన్ఎమ్ కోర్సు పేరుతో మూడేండ్లు మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో వెట్టిచాకిరీ చేయించారు. ఒక్క రోజు కూడా క్లాసులు నిర్వహించలేదు. ఫీజులు వసూళ్లు చేయడంతో పాటు ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో చేసిన పనికి వచ్చిన డబ్బులు కూడా తీసుకున్నారు. కోర్సు పూర్తి చేయించకపోగా.. ఇంటర్ సర్టిఫికెట్లు అడిగితే మాకు సంబంధం లేదంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. మూడేండ్ల కష్టం వృథా అయింది. చదువు ఆగం అయింది. ఇంటర్ సర్టిఫికెట్లు మా చేతిలో లేవు.. ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు ఏం చెప్పాలో దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. నైటింగల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఉన్న మా సర్టిఫికెట్లు ఇప్పించాలి' ఇదీ ఓ నర్సు చేతిలో మోసపోయిన విద్యార్థినుల ఆవేదన.

మా సర్టిఫికెట్లు ఇప్పించండి : విద్యార్థినులు

మమ్మల్ని మోసం చేసిన సీనియర్ నర్సుపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భాస్కర్ మెడికల్ కాలేజీ పేరు చెప్పి మమల్ని కస్తూర్బా కాలేజీ నుంచి తీసుకొచ్చారని చెప్పారు. పదేండ్లుగా భాస్కర్ మెడికల్ కాలేజీలో పనిచేసిన సీనియర్ నర్సు వసంతను.. తమ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తే రాత్రికి రాత్రే వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సు వసంతను భాస్కర్ మెడికల్ కాలేజీ యాజమాన్యమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయ చేయాలని, కనీసం సర్టిఫికెట్లు అయినా ఇప్పించాలని కోరుతున్నారు.

వికలాంగుల హక్కులను కాపాడాలి



- సంక్షేమం, సమగ్రాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి
- వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఓ చైతన్య దీపిక : పత్రిక వార్షికోత్సవ సభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలనీ, వారి సంక్షేమం, సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వెలువడుతున్న వికలాంగుల వాయిస్ మాస పత్రిక పదో వార్షికోత్సవ సభను సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఓ చైతన్య దీపిక అనీ, అది వారి చేతిలో ఆయుధం కావాలని వక్తలు ఆకాంక్షించారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల అధినేత పి ఉమర్ ఖాన్, జావాబ్ టీవీ సంపాదకులు నల్గొండ శ్రీనివాసులు, వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఎడిటర్ ఎం అడివయ్య, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ కుమార్ లోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ తదితరులు మాట్లాడారు. వికలాంగుల పట్ల సమాజం చిన్న చిన్నచూపు చూస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు శ్రద్ధ పెట్టటం లేదని ప్రశ్నించారు. పాలకుల విధానాలే వికలాంగుల పాలిట శాపంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 21 రకాల వైకల్యాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించినా సర్టిఫికెట్లు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం దేశంలో 15 శాతం మంది వికలాంగులున్నారనీ, వారి జనాభా లెక్కలను ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలకు నిధుల కోత విధిస్తున్నదని వివరించారు. ఆ పేదల మీద భారాలు వేసి సంపన్నులకు పన్ను రాయితీలిస్తుందని విమర్శించారు. మోడీ పాలన పేదల కోసమా? లేక సంపన్నుల కోసమా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాటాను రూ. ఐదు వేలకు పెంచాలనీ, దానికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ వాటా రూ. ఐదువేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మానసిక వైకల్యాలు కలిగిన వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారిని నియమించాలని డిమాండ్ చేశారు. స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్ గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేయాలని సూచించారు. వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్యా విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, హిమోఫీలియా, సికిల్ సెల్, తలసేమియా, కండరాల క్షీణత వంటి తీవ్ర వైకల్యాలు కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని హితవు పలికారు. సకలాంగుల కోసం స్త్రీ శక్తి లాంటి పథకాలు ప్రవేశ పెడుతున్న ప్రభుత్వం వికలాంగుల కోసం ఎందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం లేదని ప్రశ్నించారు. మీ సేవ సెంటర్స్ కేటాయింపులో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, జె రాజు, సాయమ్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి స్వామి, అరిఫా, కాశప్ప, సహాయ కార్యదర్శులు వి ఉపేందర్, జె దశరథ్, పి బలీశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, భుజంగారెడ్డి, లింగన్న, షాయినా బేగం, వెంకన్న, శ్రీనివాస్, లలిత, రాములు, యేశాల గంగాధర్, బాలయ్య,, నాయకులు సుల్తాన్ రమేష్, సంతోష చంద్రమోహన్, శ్రీనివాస్, బాలు వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త కార్డు

- ఏటీఎం కార్డులా కొత్త రేషన్ కార్డు
- హర్యానా తరహాలో డిజిటల్ రేషన్ కార్డు విధానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ కార్డుల రూపురేఖలు మారనున్నాయి. ఉన్నతస్థాయిలో ఈ మేరకు చర్చిస్తున్నట్టు సమాచారం. రేషన్ కార్డుల స్థానంలో స్వైప్ కార్డులను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఏటీఎం కార్డులా కొత్త రేషన్ కార్డులు రూపురేఖలు మారనున్నాయి. ఏటీఎం కార్డు పెట్టి డబ్బులు తీసుకున్నంత ఈజీగా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ఇప్పటికే ఈ విధానం హర్యానా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న తీరును రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. హర్యానలో ఏటీఎం కార్డు తరహాలో డిజిటల్ రేషన్ కార్డు విధానం విజయవంతగా అమలవుతోంది. ఉత్తర ప్రదేశ్‌లో బార్ కోడ్ తరహాలో రేషన్ కార్డుల విధానం నడుస్తున్నది. ఒడిశా రాష్ట్రంలో కూడా ఏటీఎం తరహాలో రేషన్ కార్డులను తీసుకురాబోతుంది. గ్రెయిన్ ఏటీఎంల పేరుతో ఒడిశాలో ఈ తరహా కొత్త రేషన్ కార్డులను లబ్దిదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాదిమంది లబ్దిదారులు ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో రేషన్ కార్డు, హెల్త్ కార్డుల జారీ కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల క్యాబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో స్వైప్ కార్డుల తరహాలో రేషన్ కార్డు రూపకల్పనకు, చిప్‌తో అనుసంధానించే ప్రక్రియకు సంబంధించి నిపుణులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే చర్చించింది. అలాగే స్వైప్ కార్డుల విధానం అమలపై సాధ్యాసాధ్యాలపై చర్చించింది. కొత్త రేషన్ కార్డును స్వైప్ చేయడానికి చిప్ యాక్టివేట్ అయ్యేలా కార్డును డిజైన్ చేయానున్నారు. చిప్ యాక్టివేట్ అయిన క్షణాల్లోనే రేషన్ కార్డు లబ్దిదారుడి వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు.. పూర్తి సమాచారం మానిటర్‌లో డిస్‌ప్లే అవుతుంది. ఈ విధానం అమల్లోకి వస్తే రేషన్ వ్యవస్థలో మోసాలను అరికట్టవచ్చని ప్రభుత్వం ఆశిస్తున్నది.

'సెస్'పై బకాయిల గుదిబండ

- పంచాయతీల విద్యుత్ బాకీలు రూ.324 కోట్లు
- ఆర్థిక సంఘం నిధుల నుంచి కొద్దిపాటి చెల్లింపులు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం

సెస్ (సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ) పరిధిలో విద్యుత్ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. గ్రామపంచాయతీల బకాయి బిల్లులు గుదిబండగా మారాయి. పంచాయతీలు పట్టించుకోకపోవడం, ఆయా మండలాల్లోని సెస్ అధికారులు బకాయిలపై దృష్టి సారించకపోవడంతో బిల్లులు రూ.324 కోట్లకు పేరుకుపోయాయి. ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి బకాయిల్లో కొద్ది మొత్తమే చెల్లిస్తుండటంతో ఎప్పటిలాగే ఉండిపోతున్నాయి.



నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి, వేములవాడ, వేములవాడ గ్రామీణం, తంగళ్లపల్లి, గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, కొనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో సెస్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. ఆయా మండలాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాలు.. వీధి దీపాలు, ప్రజలకు మంచినీటి సరఫరా కోసం వినియోగిస్తున్న బావులు, బోర్లకు సెస్ నుంచి విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నాయి. అయితే, నిధుల కొరత వల్ల ప్రతినెలా గ్రామపంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. ప్రజల అవసరాలకు విద్యుత్ సరఫరా ముడిపడి ఉండటంతో అధికారులు కనెక్షన్ల తొలగింపు, బిల్లుల వసూళ్లపై ఎక్కువ దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామపంచాయతీలకు వస్తున్న ఆర్థిక సంఘం నిధుల్లో నుంచే విద్యుత్ బకాయిలు చెల్లించుకోవాలన్న నిబంధన ఉండటంతో పలు పంచాయతీలు కొంత మొత్తాన్ని చెల్లిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రూ.318 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయి ఉండగా.. 2022జులై నుంచి ఏడాదిపాటు మధ్యలో విద్యుత్ బిల్లులు చెల్లించింది. మళ్లీ గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు మరో రూ.6కోట్ల బకాయి గ్రామపంచాయతీలకు సంబంధించి చెల్లించలేదు. దీంతో మొత్తం రూ.324కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు తక్కువగా ఉండటం, విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో ఉండటంతో పెరిగిపోతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

గ్రామాల్లో వీధి దీపాలు, మంచినీటిపై గ్రామపంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ కొరవడటం వల్ల బిల్లులు అధికంగా వస్తున్నాయి. గతంలో నెలవారీగా బిల్లులు వసూలు చేసేవారు. ప్రస్తుతం గ్రామాల్లో విద్యుత్ మీటర్లు బిగించి బిల్లులు వసూలు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో ఉదయం సమయంలో వీధిదీపాలు వెలుగుతుండటం, నీటి ఎద్దడి నివారణకు వేసిన బోర్లకు 1హెచ్పీ మోటర్లు బిగించిన ప్రాంతాల్లో నీరు వృథాగా పోతుండటంతో బిల్లులు అధికంగా వస్తున్నాయి. వీటి నియంత్రణకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యుత్ బకాయిలు పెరిగిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. విద్యుత్ బిల్లు బకాయిలపై సెస్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చెరువుల కబ్జాపై ఎవరినీ వదలం

- బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు
- త్వరలో హైడ్రా పరిధిలో పోలీస్‌స్టేషన్
- రంగంలోకి మరో 72 బృందాలు
- కొన్ని లేక్స్ 80శాతం, మరికొన్ని 100శాతం కబ్జా
- ట్రై సిటీలో చెరువులను పునరుద్ధరించడానికి చర్యలు : హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ట్రై సిటీలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. ట్రై సిటీలో చెరువులను పునరుద్ధరించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు. కొందరు రియల్టర్లు, బిల్డర్లు ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ లేకుండానే నిర్మాణాలు చేపడుతుంటే.. మరికొందరు నోటరీ భూములు విక్రయిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా పనితీరు, తీసుకుంటున్న చర్యలపై కమిషనర్ వివరించారు.

ట్రై సిటీలో దాదాపు 400కు పైగా లేక్స్ ఉండేవని, ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నివేదిక మేరకు 1979-2023 (మధ్య కాలంలో) నగరంలో దాదాపు 61శాతం చెరువుల విస్తీర్ణం తగ్గిందని, కొన్ని చెరువులు 80శాతం, మరికొన్ని 100శాతం కనిపించకుండా పోయాయని తెలిపారు. నగరంలో చెరువులు, పార్కులు, నాలాలను పరిరక్షించడంతోపాటు ఆక్రమణలు, భూ కాబ్జలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హైడ్రా మూడు ఫేజ్‌లలో ముందుకెళ్తోందన్నారు. మొదటి ఫేజ్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నామని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు. రెండో ఫేజ్‌లో అక్రమ వెంచర్లు, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ల, పార్కుల స్థలాల్లో నిర్మాణాలను గుర్తిస్తామని తెలిపారు. మూడో ఫేజ్‌లో ఒక కార్యాచరణ ప్రకారం అక్రమ నిర్మాణాలను గుర్తిస్తామని, చెరువులు, కుంటల్లో పూడికలను తీస్తామన్నారు. ఓఆర్ఆర్ వరకు హైడ్రా విస్తరణ ఉందని, ప్రభుత్వం హైడ్రాను మరింత బలోపేతం చేయబోతుందని చెప్పారు.

హైడ్రా పరిధిలో త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని, ఏసీపీ స్థాయి అధికారితోపాటు ఇన్‌స్పెక్టర్ పనిచేస్తారన్నారు. హైడ్రాకు దాదాపు 400 మంది సిబ్బంది అవసరముందని, 72 బృందాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. చెరువులను కబ్జా చేసి అపార్టుమెంట్స్ నిర్మిస్తే వర్షం వచ్చిన సమయంలో ఆ నీరు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. కబ్జాల మూలంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతోపాటు వర్షం నీరు ఇండ్లలోకి చేరుతోందని, కాలనీలు ముంపునకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చందానగర్, బంజారాహిల్స్, నందీహిల్స్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో నాలాలు, చెరువులను కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టినందుకే వాటిని కూల్చేశామని చెప్పారు. నగరంలో స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించాలని, ముఖ్యంగా నాలాలు, చెరువులు, బఫర్‌జోన్ పరిసరాల్లో ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్స్, వ్యక్తిగత ఇండ్లు కొనుగోలు చేయొద్దని సూచించారు. రాజకీయాలకతీతంగా ట్రై సిటీలో ఎక్కడ అక్రమ నిర్మాణాలను గుర్తించినా, ఫిర్యాదులు వచ్చినా క్షేత్రస్థాయిలో పరిశీలించి కూల్చేస్తామన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుప్రీంకోర్టు తీర్పు ఏ కులానికి వ్యతిరేకం కాదు

- మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకుందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఏ కులానికి వ్యతిరేకం కాదని మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం అభిప్రాయపడింది. ఈ మేరకు సోమవారం ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీల్లో ఇప్పటి వరకు అవకాశం రాని వారికి అవకాశం వచ్చేలా ప్రణాళిక రూపొందించుకుని, ఎస్సీల 15 శాతం రిజర్వేషన్‌ను 20 శాతం పెంచుకునేందుకు ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు భారత రాజ్యాంగ విజయంగా, సామాజిక న్యాయం విజయంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. వర్గీకరణ ద్వారానే ఎస్సీల్లోని అన్ని కులాల ఐక్యత సాధ్యమని స్పష్టం చేశారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత వసతి ,భోజనం

- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు 2024 కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ కమిషనర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్టీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో మెయిన్స్‌కు సన్నద్ధమయ్యేందుకు మెంటార్ గైడెన్స్‌తో పాటు, ఒక ట్యాబ్, ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్టు తెలిపారు. అర్హులైన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వారు యూపీఎస్సీ - సీఎస్సీ - ప్రిలిమినరీ పరీక్ష 2024 నందు ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382620487, 7093466985 సంప్రదించాలని సూచించారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు మండలం బైరాగూడలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ మాతృమూర్తి అందుగుల పోచమ్మ అనారోగ్యం తో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించి భాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-చంపాపేట్

చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం చంపాపేట్ డివిజన్ పరిధిలో నిర్మల్ నగర్ కాలనీలో ప్రతిష్టాత్మకంగా 50 లక్షల వ్యయంతో కూడిన సి.సి రోడ్డు పనులను కాలనీ సంక్షేమ సభ్యులు, అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జగన్ గుప్తా, మాధవ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి

- ఏసీపీ కృష్ణయ్య



నవతెలంగాణ-హాయత్‌నగర్

ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో మెలిగితే ఉన్నత స్థాయి కి చేరుకుంటారని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య విద్యార్థులకు హితువు పలికారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో కొత్త అకడమిక్, లీడర్ షిప్ అధ్యయనానికి నాంది పలికే ఈవెంట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ పిల్లలకు బాధ్యతలను అప్పగించడం, అధికారం ఇవ్వడం చాలా ముఖ్యమైన పని అని ఎందుకంటే అది వారి శక్తి వంతమైన, శ్రద్ధ వహించే జీవితకాల నైపుణ్యాలను నేర్పుతుందన్నారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కని వాటిని సాకారం చేసుకో వాలని సూచించారు. లీడర్ షిప్ లో ఎన్నికైన విద్యార్థుల కు బ్యాడ్జిలు, ఫ్లాగ్‌లు అందించారు. కాకతీయ స్కూల్ జోనల్ ఇన్‌చార్జి రమేష్ చంద్ర,బ్రాంచ్ డైరెక్టర్ రవి ప్రకాష్, రాధ లు కలిసి విద్యార్థులకు బ్యాడ్జిలు పెట్టి వారి బాధ్యతను గుర్తు చేసి అభినందించారు. ప్రిన్సిపాల్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో గిరిజన హక్కులను కాపాడుకుందాం

- తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎం. గోపినాయక్



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఐక్య ఉద్యమాల ద్వారా గిరిజన హక్కులను కాపాడుకుందామని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎం. గోపినాయక్ పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లో ప్రపంచ గిరిజన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉచిత బస్సు అమలు చేయడంతో ఆటో డ్రైవర్లు పని లేక పస్తులు ఉంటున్నారన్నారు. కిరాయి దొరకక ఇంటి అద్దె, స్కూల్, కాలేజీ ఫీజులు కట్టలేకపోతున్నారని, రేషన్ సరుకులు కొనలేని పరిస్థితి ఉందన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ12 వేలు ఇచ్చి ఆదుకుంటామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు లంబాడి గిరిజనులకు గిరిజన శాఖ మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. లంబాడి ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ఐక్యంగా కాపాడుకోవాలని ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ గిరిజన సంఘం నాయకులు అంగోత్ శ్రీను, రామావత్ రాములు నాయక్, పాండు నాయక్, జపాల్ నాయక్, మంగ్య ,శంకరయ్య, అనిల్, హన్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో కేరళ వయనాడ్ బాధితుల కోసం సీఐటీయూ హయత్ నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ మేరకు గాలి పంపు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రజలు, శ్రేయోభిలాషులు రూ. 11,150/- హుండీలలో వేశారు. ఈ డబ్బులను సీఐటీయూ రాష్ట్ర కమిటీ ద్వారా కేరళ ప్రజలకు అందచేస్తామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు లింగం యాదవులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెట్టు నరసింహ, సింగం లింగస్వామి, మెట్టు రాఘవేందర్, మెట్టు కష్ణ, వెంకటమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు ప్రతిష్టాత్మకం



- అందెల శ్రీరాములు యాదవ్
- అల్మాస్ గుడలో ఘనంగా శ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఉత్సవాలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్రంలో పూర్వ కాలం నుంచి బోనాల ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకోవడం జరుగుతుందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్మాస్ గూడలోని 4వ డివిజన్ పరిదిలో ఉన్న సౌభాగ్య లక్ష్మీనగర్ కాలనీలో శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని బంగారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ వారు శ్రీరాములు యాదవ్‌కు పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రాధా న్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ళగూడెం రామకష్ణ రెడ్డి,నాయకులు సతీష్, నంద, సురేష్, నగేష్ గౌడ్,తిరుపతి రెడ్డి, వీరేష్, ఎస్. మహేందర్, ప్రవీణ్ గౌడ్, ఎం.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నాటుదాం.. ప్రకృతిని కాపాడుదాం

- ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్.

చెట్లను నాటుదాం - ప్రకృతిని కాపాడుదామని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ గ్రామ పరిధిలోని మేడ్చల్ జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు పాండు గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు తెలంగాణ టెంబర్ డిపో అసోసియేషన్ చకిలం రమణయ్య, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు అయిత రాములు పాల్గొన్నారు. ఈ వన మహోత్సవ కార్యక్రమంలో దాదాపు 100 మంది 100 చెట్లను నాటారు.

ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను పెంచే బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చెట్ల పెంపకం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గత 11 సంవత్సరాల ఐవీఎఫ్ ఆధ్వర్యంలో చెట్లు నాటడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సింగిరికొండ నర్సింహులు గుప్త, నాగరాజు గుప్త ,నరేష్ గుప్త, శ్రీధర్ గుప్త, ఎల్ఐసీ ఆనంద్ గుప్త, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐవీఎఫ్ నాయకులు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అంతరిక్ష శాస్త్రం సాంకేతికతలు

విద్యార్థులకు ఉపయోగపడతాయి

- డాక్టర్ పి.వి .రాధాదేవి
- భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ కార్యాలయంలో కార్యశాల



నవతెలంగాణ-నాగోల్

భూ విజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష శాస్త్రం సాంకేతికలు.. దాని ఉపయోగాలు నేటి విద్యార్థులకు యువతకు ఎంతో ఉపయోగపడతాయని అడ్వాన్స్‌డ్ డేటా ప్రాసెసింగ్ రీసర్చ్ యూనిస్టిట్యూట్ ,డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ డైరెక్టర్ డాక్టర్ పి వి రాధాదేవి అన్నారు. నేషనల్ స్పేస్ డే-2024 (23 ఆగస్టు 2023) స్మారకోత్సవం పురస్కరించుకొని భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ 105 జయంతి సందర్భంగా నాగోల్ డివిజన్ బండ్లగూడలో గల భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ కార్యాలయంలో సోమవారం భూవిజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత ఉపయోగాలు అనే అంశంపై కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా. ముఖ్య అతిథిగా హాజరైన వారు కార్యశాలను ప్రారంభించారు. అనంతరం వారు ప్రసంగిస్తూ భూవిజ్ఞాన శాస్త్రంలో స్పేస్ టెక్నాలజీ అవశ్యకత, దాని ఉపయోగాల గురించి నొక్కి చెప్పారు. కార్యశాలలో డాక్టర్. బాలకష్ణన్, ఐఎన్ఓఐఎస్ డాక్టర్. ఈశ్వర్ చంద్ర దాస్, ఐఎస్ఆర్ఓ డాక్టర్ సెంథిల్ కుమార్, ఎన్‌జీఆర్ఐ తదితరులు విశిష్ట అతిథులుగా హాజరై వివిధ అంశాలపై ప్రసంగించారు. ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, స్పేస్ అప్లికేషన్స్ పరిణామం, భూవిజ్ఞాన శాస్త్రం లో అంతరిక్ష సాంకేతికత, సముద్రంలో అంతరిక్ష సాంకేతికత, చంద్రయాన్-3 ల్యాండింగ్ సైట్ జియాలజీ, అంతరిక్ష సాంకేతికత వినియోగం కోసం జి ఎస్ ఐ. శిక్షణా ప్రయత్నం వంటి అంశాలపై ఉపన్యాసాల ద్వారా వివరించారు.ఈ కార్యశాల యొక్క ఫలితం 2024 ఆగస్టు 22, 23 తేదీలలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే నేషనల్ స్పేస్ డే-2024 వేడుకలో ప్రదర్శితమవుతుందన్నారు. ఈ కార్యాశాలలో ఓయూ జియాలజీ విద్యార్థులు, నల్ల మల్లారెడ్డి కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విద్యార్థులు, ఇందూ ఇంటర్నేషనల్ స్కూల్, భాష్యం స్కూల్, తెలంగాణ మైనారిటీ స్కూల్, సంస్కృత స్కూల్ విద్యార్థులు పాటు జీఎస్ఐ శిక్షణ సంస్థ అధ్యాపకులు, అధికారులు, సిబ్బందితో సాహ మొత్తము 250 సభ్యులు పాల్గొన్నట్టు జీఎస్ఐ శిక్షణ సంస్థ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్. మల్లేష్ గంజి తెలియజేశారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో జరుగుతున్న వరద నీటి కాలువ పైప్‌లైన్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న వరద నీటి కాలువలో శిల్ట్ వీలైనంత త్వరగా శుభ్రపరచాలని, వర్షాలు పెరిగితే నీటి ప్రవాహం పెరిగి మాన్ హోల్స్ పొంగే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, ఆర్ఎస్ఎస్ సతీష్, నాయకులు ఆకుల అరుణ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్..

- జెండా ఊపి ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నాగోల్

హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓమ్ని హాస్పటల్ నుంచి మన్సూరబాద్ సహారా వరకు బీజేపీ మహిళ మోర్చా బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ చింతల్ అరుణ సురేందర్ నాథ్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి ఐక్యత, సమగ్రత పట్ల నిబద్ధతతో గత కొన్ని సంవత్సరాలుగా దేశ ప్రజలందరితో పాటు బీజేపీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా 'హర్ ఘర్ తిరంగ - తిరంగ యాత్ర'నులి ఉత్సాహంగా జరుపుకుంటున్నారని తెలిపారు. త్రివర్ణ పతాకం గొప్పతనాన్ని ఇనుమడింప చేయడానికి 'హర్ ఘర్ తిరంగ అభియన్' అనేది ప్రత్యేకమైన వేడుకగా మారిందన్నారు.ఒక మంచి కార్యక్రమం నిర్వహించినందుకు సంతోషకరంగా ఉందని, హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ 'బడంగ్ పేట్' మహిళా అధ్యక్షురాలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బీఎస్పీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు అనిత సోమవారం గుడ్ల శ్రీనివాస్ మహరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు కేఎల్ఆర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కే.ఎల్.ఆర్. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ఎంతో కషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలను ఆర్థికాభివద్ధి సాధించాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. విద్య,వైద్య రంగాలతో పాటు పేదలకు అభివద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం కషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, పుట్టగాళ్ల జగన్,అనిత తదితరులు పాల్గొన్నారు

దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్



- పబ్బతి లక్ష్మణ్

నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట్

భారత భూమి విముక్తి కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర పోరాటంలో పోరాడిన మొట్ట మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని సీపీఐ మాజీ కౌన్సిలర్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు పబ్బతి లక్ష్మణ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ప్రధాన కార్యదర్శి చింత వెంకటేష్. ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్నో మహానగరంలో 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. బానిస సంకెళ్ళ నుంచి భరతమాత విముక్తి కావాలని ఎందరో విద్యార్థులు బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశంలోనే ఏకైక సంఘం ఏ.ఐ.ఎస్.ఎఫ్ అన్నారు. స్వాతంత్రానంతరం ప్రభుత్వ విద్య, అందరికీ విద్య అనే నినాదం తో విద్యా పరిరక్షణకు, శాస్త్రీయ విద్యా విధానం వర్ధిల్లాలి అని పోరాడుతున్నట్టు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఎన్నో పోరాటాలు చేసి విజయాలను సాధించిందని గుర్తు చేశారు. ఈ మండలంలో ఏఐఎస్ఎఫ్ బలమైన సంఘంగా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 5.7 శాతం మాత్రమే కేటాయించడం విబేధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా వినోద్,మండల నాయకులు వట్టికార్తీక్ రెడ్డి, గర్ల్స్ కన్వీనర్ చెంచేటి జోష్న, భాను, భాను ప్రకాష్, నరేష్, నవీన్, జాహ్నవి జ్యోతి సిపిఐ మండల కార్యవర్గ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-చంపాపేట్

రంగారెడ్డి జిల్లా ఖో -ఖో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఉప్పల్ సాగర్ గ్రామర్ స్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. జిల్లా అధ్యక్షురాలుగా కోట్ల మంజుల, ప్రధాన కార్యదర్శిగా తోట జయప్రకాష్, ఉపాధ్యక్షుడిగా గుర్రం సత్తిరెడ్డి, దువ్వల రవి, అవినాష్, కార్యదర్శిగా నూనె శివరాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా తెలంగాణ ఖో ఖో అసోసియేషన్ నుంచి పోచప్ప. తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ నుండి పరిశీలకుడిగా మనోజ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి న్యాయవాది సురేష్ పాల్గొన్నారు.

నేడు మాదిగల విజయ దండోరాను విజయవంతం చేయాలి

- దర్శనం జంగయ్య



నవతెలంగాణ -అబ్దుల్లాపూర్ మెట్

ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి మొదటిసారిగా హైదరాబాద్ అడుగుపెడుతున్న సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ కు స్వాగతం పలికేందుకు 13న హైదరాబాద్‌లో నిర్వహించే విజయ దండోరాను విజయవంతం చేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శనం జంగయ్య అన్నారు. సోమవారం దర్శనం జంగయ్య అబ్దుల్లాపూర్‌మెట్‌లో మీడియాతో మాట్లాడుతూ 30 ఏండ్లుగా దండోరా ఉద్యమం నిర్వహించి మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను మందకృష్ణ మాదిగ సాధించారన్నారు. ఇది యావత్ మాదిగ జాతి సాధించిన విజయమని కొనియాడారు. ఇలాంటి ఉద్యమ విజయ కేరిటం హైదరాబాద్ పురవిధుల్లో సగ ర్వంగా ఎగరాలని పిలునిచ్చారు. మందకృష్ణ మాదిగకు వచ్చే పదేండ్లలో ఎవ్వరికీ జరగిని విధంగా లక్షలాది మాదిగ బిడ్డలు స్వాగతం పలకాలని కోరారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న మాదిగలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర రాజధానికి తరలివచ్చి మాదిగల ఐక్యతను చాటాలన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును వెంటనే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసేలా మాదిగల భారీ ప్రదర్శన చేపట్టాలని పిలునిచ్చారు.

మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ -నాగోల్

మానసిక పరిస్థితి బాగోలేక ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ సీఐ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ పరిధిలోని బికే రెడ్డి నగర్ కాలనీ మమత నగర్ కాలనీ రోడ్ నెంబర్ వన్ లో ఉన్న రేషన్ ప్రైడ్ అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న బచ్చు భాగ్యలక్ష్మి(41) ఆరేండ్లుగా అనారోగ్యానికి గురై మానసికంగా బాధపడుతున్నది. దాంతో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆమె తన భర్త ఇంట్లో లేని సమయంలో తన బెడ్రూంలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు చున్నీతో ఉరేసుకుని చనిపోయింది. మృతురాలి సోదరుడు సిరిమల్ల వెంకటరమణ.. తమ సోదరి మృతి పై ఎలాంటి అనుమానాలు లేవని, అనారోగ్య కారణాలవల్లే మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

నవతెలంగాణ

10

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

మంగళవారం ఆగస్టు 13, 2024 www.navatelangana.com

పల్లె దవాఖానాను సందర్శించిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్‌లో ఉన్న పల్లె దవాఖానాను డీఎంహెచ్‌వో రఘునాథ్ స్వామితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆశావర్కర్లు తమ సమస్యలను తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ రాణి, డాక్టర్ రమాదేవి, ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, కాప్రా డివిజన్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, బేతాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ అవుట్ లేట్ కోసం డిపో యాజమాన్యాన్ని ఒప్పించండి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల నుండి దిగువ భాగానికి వేళ్లే డ్రయినేజీ అవుట్ లేట్ కోసం చెంగిచెర్ల ఆర్టీసీ డిపో యాజమాన్యాన్ని ఒప్పించాలని సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. చెంగిచెర్ల నుండి దిగువ భాగానికి డ్రయినేజీ అవుట్ టేట్ పోవాలంటే చెంగిచెర్ల ఆర్టీసీ డిపో నుంచి పోవాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే దానికి డిపో యాజమాన్యం సిద్ధంగా లేకపోవడంతో సంబంధిత మంత్రికి సమస్యను విన్నవించామని తెలిపారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు డిపో యాజమాన్యంతో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చినట్టు మేయర్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో విక్రమ్ సారాభాయ్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

అంతరిక్ష ప్రయోగాలకు పితామహుడు విక్రమ్ సారాభాయ్ 105వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో సోమవారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విజ్ఞానవేత్త జయప్రకాష్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బాధ్యులు వెంకటేశ్వరరావులు విక్రమ్ సారాభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత పి.బి చారి మాట్లాడుతూ.. విక్రమ్ సారాభాయ్ 1919 ఆగస్టు 12వ తేదీన జన్మించారని తెలిపారు. ఆయన అణురంగంలో హెూమీజే బాబా నాయకత్వంలో పనిచేసి కాస్మిక్ కిరణాల ప్రయోగాలలో ముందున్నారని పేర్కొన్నారు. అంతరిక్ష యానంలో కొత్త పుంతలు తొక్కించి అనేక ప్రయోగాలు చేశారని గుర్తు చేశారు. దానిలో భాగంగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు, పద్మభూషణ్, మరణానంతరం పద్మ విభూషణ్ అవార్డులు పొందారని చెప్పారు. జాతీయ అంతర్జాతీయ రంగాలలో ఆయనకు అనేక పేరు ప్రఖ్యాతలు కలిగి ఉన్నారని తెలిపారు. ఈసీఐఎల్ పరిశ్రమకు డాక్టర్ ఏఎస్‌రావు ఎండీగా ఉన్నప్పుడు మొట్టమొదటి చైర్మెన్ గా పనిచేశారని చెప్పారు. వారి సేవల ఫలితంగానే నేడు అంతరిక్ష రంగంలో మన దేశం ప్రత్యేకమైన స్థానం కలిగి ఉన్నదని చెప్పారు. అనంతరం సభికులందరూ విక్రమ్ సారాభాయ్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, జయప్రకాష్, శోభ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ పన్నాల



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్‌లో శాంతి యూత్ క్లబ్ సభ్యులు ఎస్వీ శశిధర్ ఆధ్వర్యంలో మల్లికార్జున్ నగర్ కాలనీలో, మహంకాళి యూత్ సభ్యులు పరమేష్ రెడ్డి ఆధ్వర్యంలో చాణక్యపురి కాలనీ, ఓల్డ్ మల్లాపూర్‌లో నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపులో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ శివకుమార్, ప్రవీణ్, దయాకర్ రెడ్డి, శ్రీనివాసరావు, సంతోష్ యాదవ్, వెంకట్, ఎస్వీ శ్రీనివాస్ రఘు, మెహ్రజ్, ప్రేమ్ తదితరులతో పాటు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



గంగా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అధ్యక్షులు బీరు బాల మల్లయ్య

నవతెలంగాణ-నేరేడ్ మెట్

అన్ని దానాలలో కెల్లా అన్న దానం చాలా గొప్పదని శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అధ్యక్షులు బీరు బాల మల్లయ్య అన్నారు. నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని రేణుకా నగర్ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బీరు బాల మల్లయ్య ఆధ్వర్యంలో ఐదు వందల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి మనకు తోసిన సహాయం చేసి, వారి కడుపు నింపటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఎల్ నారాయణ రెడ్డి, సంఘ సేవకులు సేర్ల అనిల్, ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా హెచ్‌ఆర్డీఏఐ సభ్యులు, గంగా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పరిధిలోని నాగార్జున నగర్‌లోని సన్‌సీడ్ హాస్పిటల్లో కాప్రా, ఏ ఎస్‌రావు నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో పేదలకు ఆరోగ్యసేవలందించటమే తమ లక్ష్యమన్నారు. ఈ క్యాంపులో సన్‌సీడ్ హాస్పిటల్ డాక్టర్లు జనరల్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ టెస్టులు చేశారు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం కళ్లపరీక్షలు, దమ్మాయిగూడ పద్మసాయి డెంటల్ క్లినిక్ డాక్టర్లు దంతాల పరీక్షలు చేశారు. సియాన్ కాన్సర్ స్క్రినింగ్ డాక్టర్లు 39 మంది స్త్రీలకు కాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కాంపులో 152 మందికి అన్ని రకాల వైద్యపరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకున్నారు. 16 మందికి కంటికి కాటరాక్ట్ ఆపరేషన్లకు ప్లాన్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చనమోలు వరప్రసాద్ , సభ్యులు, డాక్టర్ దినేష్, చందన్ రాజు, సునీల్, మురళీచారి,డాక్టరు శ్రావణ్ ,డాక్టర్ శంకర్ రావు, ఈసీఐఎల్ మాజీ ఉద్యోగులు నరసింహ, మోషే తదితరులున్నారు.

మార్షల్ ఆర్ట్సలో డీఏవీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఆగస్ట్ 11వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్‌లో డీఏవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీలంక, భూటాన్, నేపాల్ దేశ విద్యార్థులు పాల్గొనగా అందులో డీఏవీ స్కూల్ విద్యార్థులు కీర్తనకు కుమితీ, కటా విభాగంలో బంగారు పతకం వరించింది. తనయ్ కటా విభాగంలో బంగారు పతకం, కుమితీ విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు కరాటే మాస్టర్ కుమారస్వామి తెలిపారు. వారిని డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్, యాజమాన్యం అభినందించారు.

హషిష్ అయిల్ సరఫరా చేస్తున్న
నిందితుల అరెస్టు



- రూ.1కోటి, 8లక్షల విలువగల
- 13.5 కిలోల హషిష్ అయిల్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హషిష్ అయిల్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,08,00,000 విలుగల 13.5కిలోల హషిష్ అయిల్‌తోపాటు రెండులేల నగదు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీ.కండబాబు,వీ.బాల కృష్ణలు సులువుగా డబ్బులు సంపాదించాలని హషిష్ అయిల్‌ను సరఫరా చేస్తున్నారు. ఆంధ్రప్రదేవ్, ఒడిస్సాలో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న నిందితులు వ్యాపారం ముసుగులో రోడ్డు మార్గాన నగరానికి తీసుకొస్తున్నారు. గతంలో కూడా నిందితులపై డ్రగ్స్, గంజాయి సరఫరా చేసిన కేసులున్నాయని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు ప్రవీణ్‌కుమార్, మురళీధర్‌తోపాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజావాణికి 73 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు వచ్చినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జేఎల్‌బీ హరిప్రియకి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతుల పట్ల సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్థలాలు హాం ఫట్'



- బోడుప్పల్‌లో కబ్జాకు గురవుతున్న సర్కారు స్థలాలు

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు పదే పదే చెప్తున్నా అది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. సర్కారు భూముల పరిరక్షణకు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్న కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేసే వాళ్ళ నుండి కాపాడలేక పోతున్నారంటే ఇందులో రెవెన్యూ అధికారుల అలసత్వం ఉందా లేక కబ్జాదారులు తెలివి మిరిపోయారా అనేది అర్థం కానీ ప్రశ్నగా మిగిలింది. వివరాల్లోకి వెళితే సర్వే నెంబరు 63/1లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు కబ్జాదారులు రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణాలు చేపట్టి పేదలకు అంటగట్టి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అయితే దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు చర్యలు తీసుకోవడం తప్ప రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లోపంగా మారిందనేది తెలుస్తుంది.

కబ్జాదారులకు ఆదాయ మార్గంగా ప్రభుత్వ భూమి

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో సర్వే నెంబరు 63/1 లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా దారులకు వరంగా మారింది. గతంలో బలహీన వర్గాలకు ఇచ్చిన పట్టాల మాదిరిగానే మరో దొంగ పట్టాలు సృష్టించి వాటికి బై నెంబర్లు వేయడం వేరే వ్యక్తుల పేరుతో పట్టాలు తయారు చేసి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి సర్కారు భూములను కబ్జా చేయడం పరిపాటిగా మారింది. కేవలం ప్రభుత్వ భూములను కబ్జా చేసి లక్షల రూపాయల సొమ్ము చేసుకునే గ్యాంగులు ఇక్కడ అదే ఆదాయ వనరుగా పెట్టుకుని జీవనం సాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా చూడాలి.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక కావాలి

- బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లో ప్రజా సమస్యల పరిష్కారినికి ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి వేదిక కావాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్, కమిషనర్ జీ.రామలింగం, కార్పొరేటర్లు తదితరులున్నారు.

అంబేద్కర్ నగర్ ఫేజ్-3 నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బోడుప్పల్

కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు ముఖ్య భూమిక పోషిస్తాయని బోడుప్పల్ 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ అన్నారు. సోమవారం 12వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ ఫేజ్-3 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని కమిటీ సభ్యులను సన్మానించారు. అధ్యక్షులు జీ.యాదగిరి, సలహాదారులుగా వెంకటాద్రి, యాకుబ్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఐ.సత్యం, కోశాధికారిగా బీ.మురళి, ఎండీ.పాషా, ఉపాధ్యక్షులుగా కనకయ్య, చంద్రపాల్, సత్యనారాయణ, రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా నరసింహ, లక్ష్మణ్, రాహుల్, రాజు, భీం కుమార్ లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని యూనివర్సల్ 369 విద్యార్థులు నగరంలోని గచ్చిబౌలిలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటారు. కాగా ఈ పోటీల్లో 47 మంది విద్యార్థులు పాల్గొనగా 36మందికి గోల్డ్ మెడల్స్, ముగ్గురు సిల్వర్ మెడల్స్, మరో ముగ్గురు బ్రాజ్ మెడల్స్ సాధించారు. వీరందరికి టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఉదయ్ కుమార్, మాస్టర్ గడ్డం సాయికుమార్ చేతుల మీదుగా ఛాంపియన్షిప్ కప్ అందజేశారు. అండర్ 14 ఇయర్స్ క్యాటగిరిలో ఓపెన్ కుమ్మితే గ్రాండ్ ఛాంపియన్షిప్ వీరభద్ర అనే విద్యార్థి సాధించారు. వీరందరిని నవంబర్‌లో జరగబోయే సౌత్ ఏషియన్ పోటీలకు పంపేందుకు మాస్టర్లు అక్షయ, మున్నాకుమార్, వరుణ్ తేజ్‌లు కఠినమైన శిక్షణ ఇస్తారని తెలిపారు. తద్వారా దేశానికి, రాష్ట్రానికి, మేడ్చల్‌కు మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు.

డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి : మేయర్



నవతెలంగాణ - జవహర్ నగర్

డివిజన్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, 25వ డివిజన్ కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్ కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.5 లక్షల నిధులతో భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులను అతి త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు ముదిరాజ్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మేకల లలిత యాదవ్, డివిజన్ అధ్యక్షులు నాయకులు రాజు, శ్రీనివాస్, కృష్ణ, మల్లయ్య, వెంకటేష్, హనుమంతు, కాలనీ మహిళలు జ్యోతి, చంద్రకళ, సుభద్ర, సుమిత్ర పాల్గొన్నారు.

నవతెలంగాణ విలేకరి యాదగిరికి పితృవియోగం

- నివాళులర్పించిన నవతెలంగాణ జీఎం, సిబ్బంది



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా కీసర మండలం నవతెలంగాణ విలేఖరి బందెల యాదగిరి తండ్రి బందెల ఎల్లయ్య ఆదివారం కీసర మండలంలోని రాంపల్లిలో కన్నుమూశారు. విష యం తెలుసుకున్న నవతెలంగాణ జనరల్ మేనేజర్ లింగారెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నవతెలంగాణ సమన్వ య కమిటీ సభ్యుడు ఎండీ జహంగీర్, విలేకరులు, సిబ్బంది ఎల్లయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. సోమవారం స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలలో నవతెలంగాణ విలేకరులు సత్యనారాయణ, కల్కురి ఎల్లయ్య సుధాకర్, సిబ్బంది కృష్ణ, రవి, గిరిలతో పాటు మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే-ఐజేయూ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాల్ రాజు గౌడ్, డి.వెంకట్ రాంరెడ్డి, మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండలానికి చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం కోసం సాధన చేయాలి

- రోఫ్ స్కిప్పింగ్ అసోసియేషన్
- రాష్ట్ర అధ్యక్షుడు జక్కా వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి సాధన చేయాలని రోఫ్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో ఘట్కేసర్ మండలం చౌదరిగూడలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడో రాష్ట్ర స్థాయి రోఫ్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ దేవేంద్ర విద్యాలయ, మెరిడియన్, పాఠశాల, కే.వి. ఉప్పల్ కే.వి. ఖమ్మం, కే.వి. బోయిన్ పల్లి నుండి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక మంచి ఆశయం కోసం సాధన చేసి తమ లక్ష్యాన్ని చేరుకోవాలనే సంకల్పంతో రోఫ్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. భవిష్యత్తులో దేశానికి మంచి పేరు తెచ్చేలా ఎదగాలన్నారు. ఈ పోటీలలో దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు ప్రథమ స్థానం లో నిలువగా, రోటర్ డ్యాం ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో, కె.వి ఉప్పల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు జక్కా వెంక రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెల్ ఇన్‌చార్జి సూర్య ప్రకాశ్ , రోఫ్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్ రాజు , కే.వి ఉప్పల్ పీఈటీ కరుణాకర్ రెడ్డి , అడ్వకేట్ . బాలరాజు రోటర్ డ్యామ్ ఇంటర్ నేషనల్ స్కూల్ డైరెక్టర్ శ్వేతా రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్‌లో గల అర్చన కాలనీలో రూ.18 లక్షల ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్) నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, స్థానిక కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అర్చన కాలనీలో పెండింగ్‌లో ఉన్న డ్రయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, అర్చన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, కాలనీ వాసులు రెడ్డెంగారి నర్సింహారెడ్డి, హన్మంత్ రెడ్డి, సత్యనారాయణ, కమలాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్ గౌడ్, గంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-బోడుప్పల్

సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కార్పొరేటర్ కె.సుభాష్ నాయక్ అన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ కార్పొరేషన్ అధికారులతో కలిసి 2వ డివిజన్‌లో వర్షం కారణంగా నీరు నిండిన కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ట్రాన్సుఫార్మర్లు, కరెంటు స్తంభాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని కార్పొరేషన్ సిబ్బందితో తొలగింపజేశారు.

మరిపెల్లిగూడలో ఘనంగా బీరప్ప బోనాలు



నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

మండలంలోని మరిపెల్లిగూడ కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బీరప్ప బోనాలు ఘనంగా నిర్వహించారు .కురుమల కుల దైవమైన శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వీరప్ప స్వామి దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్దకర్మ మేకల మైసయ్య బోనం చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించారు. ఒగ్గు కళాకారులు డోలు వాయిద్యాల మధ్య శివసత్తుల విన్యాసాల అందరిని అలరించాయి. యువకులు, కేరింత చేస్తూ నృత్యాలు చేశారు. మావిలాలు బీరప్ప స్వామికి బోనాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు స్వామి వివేకనంద, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | ఆగస్టు 13, 2024 | www.navatelangana.com


నల్లకుంటలోని మూన్ కేఫ్ వద్ద కూలిన చెట్టు

రక్షా బంధన్ వేడుకలకు డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ బ్రహ్మ కుమారిలు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి దంపతులను కలిసి తమ ఆశ్రమానికి విచ్చేసి పవిత్ర రక్షాబంధన్ పండుగలో భాగం కావాలని కోరారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం 1936లో స్థాపించబడిన ఒక సామాజిక సేవా ఆధారిత సంస్థ. ఆవిర్భవించినప్పటి నుండి ఇప్పటి వరకు, ఈ సంస్థ తప్పిపోయిన లేదా క్షీణిస్తున్న మానవ విలువలను మానవులతో నింపడం, స్థాపన అనే ఏకైక నినాదంతో నిస్వార్థ సేవ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత సమాజం. ఇది అన్ని వర్గాల ప్రజలకు పురాతన రాజయోగ ధ్యానాన్ని ఉచితంగా బోధిస్తుంది.



పెండింగ్ పనులను పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

నవతెలంగాణ-బేగంపేట్

పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సోమవారం రాంగోపాల్ పేట డివిజన్ కళాసిగూడలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాసిగూడ నాలా వెంట సీవరేజ్ పైప్ లైన్ పనులు పూర్తి చేసి రోడ్డు నిర్మించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందే రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపునీరు ఎక్కడా నిలవకుండా సీవరేజ్ లైన్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. కళాసిగూడలో పర్యటిస్తున్న సందర్భంలో పలు చోట్ల వ్యర్థాలు, చెత్త కనిపించడంతో వెంటనే వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాకాలం కావడం వల్ల ప్రజలు రోగాల భారిన పడకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా తమకు నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం అవుతున్నాయని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా, వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం ఆశిష్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్ కుమార్, ఆంజనేయులు, విజయ్, కోటేశ్వర్ గౌడ్, బస్తీవాసులు దేవేందర్ చారి, చందు చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం వద్దు

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై జాప్యం వద్దని, సకాలంలో పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కమిషనర్ ఆమ్రపాలి కాటతో కలిసి ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జాప్యం ఏకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్టయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 36, హౌసింగ్ 7, రెవెన్యూ 5, సి.ఎం.ఓ.హెచ్ 4, లేక్స్ 2, యు.బి.డి 2, ఎల్.ఏ.ఓ ఒకటి చొప్పున విన్నపాలు వచ్చాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, సీఎం అండ్ హెచ్.ఓ డా.పద్మజ, డిప్యూటీ సీ.ఇ కె.ఎస్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఇ శంకర్ రావు, వాల్యూయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.





వాటర్ సప్లయ్ బోర్డులోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- ప్రొ.కోదండరాం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ బోర్డులో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం కోరారు. సోమవారం ఖైరతాబాద్ లోని వాటర్ సప్లయ్ బోర్డు కార్యాలయంలో బోర్డు ఎం.డీ అశోక్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. మీటర్ రీడర్స్‌ని కేటగిరి 1 నుండి కేటగిరీ 2 కి మార్చాలని, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలు ఇవ్వాలని, అలాగే కార్మికులకు ఇఎస్ఐ, పీఫ్‌లు సమయానికి కట్టేలా చూడాలని కోరారు. 677 మంది బిల్లు కలెక్టర్స్‌కు (మీటర్ రీడర్స్) 10 ఏజెన్సీలు ఉన్నాయని, ఏజెన్సీలు ఒక కార్మికుని పైన రూ. 3000 రూపాయలు కమీషన్ తీసుకుంటున్నా సమయానికి జీతాలు ఇవ్వడం లేదని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ బోర్డు ద్వారా నేరుగా వేతనాలివ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ త్వరలోనే సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. టీజేఎస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సలీమ్ పాష, వర్కర్స్ యూనియన్ నాయకులు ఆకుల శ్రీనివాస్, మందాల బాలక్రిష్ణ రెడ్డి తదితరులున్నారు.



ఓయూ కామర్స్ విభాగం హెడ్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొ. గంగాధర్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎమ్ గంగాధర్ సోమవారంకామర్స్ విభాగాధిపతిగా (హెడ్) ప్రస్తుత విభాగాధిపతి సీనియర్ ప్రొ. డి చెన్నప్ప నుండి బాధ్యతలు స్వీకరించారు. ఓయూ కామర్స్ విభాగం 1945లో ఏర్పడగా ఈ 8 దశాబ్దాల్లో ఎంతో మందికి విద్యాబుద్ధుల్ని నేర్పింది.షెడ్యూల్డ్ జాతుల(ఎరుకల) నుంచి మొదటిసారిగా ఈ విభాగానికి నేతత్వం వహిస్తున్నారు ప్రొ. గంగాధర్. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1997లో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. బాధ్యతల విరమణ చేసిన ప్రొ. చెన్నప్ప కృషిని, ఆయన నైపుణ్యాలను అధ్యాపక బృందం మెచ్చుకుంది. అలాగే ప్రొ. గంగాధర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రొ. కె కష్ణ చైతన్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షులు, ప్రొ. ఐ శేఖర్, ప్రొ. జి నరేశ్ రెడ్డి, ప్రొ. ఏ ప్యాట్రిక్,, ప్రొ. సీ వీ రంజనీ, ప్రొ. కవిత దేవి, డాక్టర్ బీ సంధ్య, డాక్టర్ ఎమ్ శ్రీనివాస్, డాక్టర్ కె శ్రీనివాస్, అనుబంధ కాళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలి

- ఓయూ విద్యార్థి నేతలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించాలి
- పీడీఎస్‌యూ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం ఓయు ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో ఓయూ అధ్యక్షులు ఎన్. సుమంత్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్ర కుమార్, విశిష్ట అతిథులుగా ప్రొ. కొండా నాగేశ్వర్, ప్రొ. ఆమంచి నాగేశ్వర రావు, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర రావు, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ విద్యా రంగం పదేండ్లలో సంక్షోభంలో మునిగిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధి కి ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని తాజా బడ్జెట్ కేటాయింపులు తెలుపుతున్నాయన్నారు. స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదన బాగుంది కానీ ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీ విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కోసం నిధులు పెంచాల్సిన బాధ్యత ముఖ్యమంత్రికి లేదా అని ప్రశ్నించారు. ఓయూ మొదలు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో నడుస్తున్నాయని తక్షణమే టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సి.ఎం.ఫెలోషిప్ స్కీమ్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రినే విద్యాశాఖ నిర్వహించాలనుకుంటే వారంలో కనీసం రెండు రోజులు విద్యార్థులు వారి సమస్యలు చెప్పుకునేందుకు సి.ఎంను కలవడానికి అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థి నేతలు కోట శ్రీనివాస్, కంచర్ల బద్రి, ఆంజనే యులు, ఉదయ్ కుమార్, రెడ్డి శ్రీనివాస్ , వలిగొండ నరసిం హ, శరత్ నాయక్ (గిరిజన శక్తి), మెడ శ్రీను ,తాళ్ళ అజయ్, జంగిలి దర్శన్, నామ సైదులు ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తా

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

శ్రీ రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ అభివద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం బేగంపేటలోని శ్రీ రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్ ను ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా స్కూల్ ఆవరణలోని మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిల్డ్రన్స్ పార్క్ ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరి అభివృద్ధికి విద్య ఎంతో ప్రధానమైనదన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఎంతోమందికి శ్రీ రామానంద తీర్థ మెమోరియల్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యావంతులుగా తీర్చిది ద్దారని వివరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ మెమోరియల్ ను నిర్వహిస్తూ అభివద్ధిలోకి తీసుకొచ్చిన మెమోరియల్ ట్రస్టు చైర్మెన్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవిని ఎమ్మెల్యే అభినందించారు. దేశ అభివద్ధికి, సంక్షోభంలో ఉన్న ఆర్థిక రంగాన్ని నూతన సంస్కరణలు తీసుకురావడం ద్వారా పీవీ అధిగమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్న ప్రకటించడం ఆయన కు లభించిన నిజమైన గౌరవం అన్నారు. స్కూల్ ఆవరణలో ఒక పార్క్‌ను అభివద్ధి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సురభి వాణిదేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధి విషయంలో కానీ, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో కానీ తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు .కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మెమోరియల్ సభ్యులు చంద్రశేఖర్, శేఖర్ మారంరాజు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్యాం తదితరులు పాల్గొన్నారు.



సబి మండి హెూటల్‌ను ప్రారంభించిన బాబా ఫసివుద్దీన్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ మెయిన్ రోడ్డు సైట్ వన్ కాలనీ వద్ద 'సబి మండి రెస్టారెంట్‌ను కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ చేతుల మీదుగా సోమవారం ఘనంగా ప్రారంభించారు. నేడు ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల దష్ట్యా నాణ్యత గల ఆహారాన్ని అందించాలని తెలుపుతూ పలు రెస్టారెంట్లలో తనిఖీలు కూడా చేపడుతోందన్నారు. నాణ్యత గల ఆహారాన్ని ప్రజలకు అందించాలని హెూటల్ యాజమాన్యానికి కార్పొరేటర్ సూచించారు.

గుర్రపు డెక్కను తొలగించే పనులు ప్రారంభం

నవతెలంగాణ-కంటోన్మెంట్



ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్‌లోని బోయిని చెరువులో గుర్రపు డెక్క తొలగించే పనులకు సోమవారం కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, అధికారులతో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే శ్రీ మాధవరం కృష్ణారావు టెంకాయ కొట్టి ప్రారంభిం చారు. అంతకుముందు ఎమ్మెల్యేతో కలిసి కార్పొరేటర్ చెరువు సుందరీ కరణ విషయాలను పరిశీలించారు పలు విషయాలను జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ ఈ గోవర్ధన్ గౌడ్, డీఈ బాలకష్ణ, ఏఈ అరవింద్ రావు, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు షంషేర్ తేజ లక్ష్మీనారాయణ, టౌన్ ప్లానింగ్ సోమేష్, ఎమ్మార్వో శ్రీనివాస్. సిబ్బంది శ్రీదేవి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఓయూ ఈఎంఆర్‌సీ లఘు చిత్రం

- చిత్ర రూపకర్త రఘుపతికి ప్రశంసలు



నవతెలంగాణ-ఓయూ

యూజీసీ-సీఈసీ 16వ, అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం జరిగిన లఘుచిత్ర పోటీల్లో ఓయూ ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ ఈఎంఆర్‌సీ సత్తా చాటింది. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లోని విద్యార్థుల స్థితిగతులపై ఈఎమ్మార్సీ డైరెక్టర్ పి. రఘుపతి రూపొందించిన లఘుచిత్రం "రీచింగ్ ది అన్‌రీచడ్" అభివద్ధి విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మానవహక్కుల విభాగంలోనూ సైటేషన్‌కు ఎంపికైంది. యూజీసీ, సీఈసీ ఏటా పర్యావరణం, అభివద్ధి, మానవహక్కులు, స్వచ్ఛ భారత్ విభాగాల్లో లఘుచిత్ర పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన చిత్రాలను ఏటా నిర్వహించే ప్రకతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తారు. విజేతలకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేస్తారు. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉద్దేశంతో ఓయూ జర్నలిజం విద్యార్థులు సంతోష్ , ఇస్రం , తన మిత్ర బందంతో కలిసి ఏర్పాటు చేసిన ఏకోపాధ్యాయ భీం చిల్డ్రన్ హ్యాపినెస్ కేంద్రాలపై రఘుపతి లఘుచిత్రం రూపొందించటం అభినందనీయమని ఓయూ రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ అవార్డు దక్కటం ఓయూకు గర్వకారణమని, ఈఎమ్మార్సీకి మరింత ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు.

ప్రతి రోజూ ఐదు నుంచి ఏడు కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో ప్రయాణించి చిన్నారులకు విద్యతో పాటు బయటి సమాజాన్ని పరిచయం చేసేందుకు వాలంటీర్లు చేస్తున్న కషిని ఈఎమ్మార్సీ డాక్యుమెంటరీగా మలచింది. ప్రకతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో మొదటి సారి ఓయూ ఈఎమ్మార్సీకి అవార్డు దక్కటం గర్వకారణం. త్వరలో జరిగే అంతర్జాతయ ఫిల్మ్ ఫెస్టివల్ లో రఘుపతి ఈ అవార్డును అందుకో నున్నారు. ఈ సందర్భంగా రఘుపతిని ఓయూ ఇన్‌చార్జి ఉపకులపతి దానకిశోర్,ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, యూజీసీ డీన్ ప్రొ. జి. మల్లేశం అభినందించారు. ఇలాంటి లఘుచిత్రాలు మరిన్ని రూపొందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీ రూపకల్పనలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవం



నవతెలంగాణ-ఓయూ

ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ నేత,ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ జెండాను ఆవిష్కరించి విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా చేసిన పోరాటాలలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం శాస్త్రయ విద్యా విధానం ప్రభుత్వ విద్యకు అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వ విద్య పరిరక్షణకు అనేక పోరాటాల నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శి ఆరెకంటి భగత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాధాకష్ణ, అశ్విన్, మధు, శివ, రాఘవేందర్, బాలాజీ, వివేక్, శ్రీనాథ్, బాబూ రాజు, లింగస్వామి,వెంకటేష్, అనిల్, రాహుల్ ,పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా.. బైక్ ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ

బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులురాలు అనిత ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా యాత్ర బైక్ రాలీని తార్నాక లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి , పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం పాటుపడాలని మన దేశాన్ని మనమే రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్‌లు సుప్రియ గౌడ్, సూచిత్ర, దీపికా, కంటెస్టెంట్ కార్పొరేటర్‌లు మేకల కీర్తి హర్ష కిరణ్, శారదా మల్లేష్, మాజీ కార్పొరేటర్ మేకల సుజాత, అనూష, సరోజ, అనూష, లక్ష్మీ దిలారి, యాదమ్మ, దీపికా ముదిరాజ్, రాజు, రాముకర్మ వెంకటేష్ గౌడ్, పొచ్చాయ యాదవ్, ప్రకాష్ గౌడ్, ప్రభుగుప్త, మహేష్, హనుమంత ముదిరాజ్, పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ 16వ వార్షికోత్సవం

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డు ఆరో వార్డు మహాత్మనగర్ లోని శ్రీ మహంకాళి ఆలయ 16 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో జరిగిన పలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాల్యాద్రి, ప్రేమ్ ముదిరాజ్, పోచయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత బలి కావద్దు



- పట్నం సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

డ్రగ్స్ మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బలి కావద్దని పట్నం సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ పదార్థాలను నిర్మూలించడం యువత ధ్యేయంగా ఉండాలని పిలుపునిచ్చారు "డ్రగ్స్ ను నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే అంశంపై ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సీతాఫల్మండి ప్రభుత్వ హైస్కూల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పనకు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను స్కూల్ హెచ్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. స్వతంత్ర పోరాటంలో ఎంతోమంది యువతి యువకులు పాల్గొని బ్రిటిషులను తరిమి కొట్టారని.. దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన యువత ఇప్పుడు డ్రగ్స్, మత్తు పదార్థాల మత్తులో ఊగిసలాడుతూ జీవితాన్ని నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. చదువులు, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తూ ప్రమాదకర జీవితంలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసై బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. మత్తు పదార్థాలు అమ్మకం లేదా వినియోగించడం నేరం ఇట్లాంటివి జరిగితే జైలు జీవితంతో పాటు జరిమానా కూడా విధిస్తారని తెలిపారు. సీతాఫల్మండి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సబిత మాట్లాడుతూ డ్రగ్స్ భూతాన్ని మన దరిచేరకుండా తరిమికొట్టాలని అన్నారు. డ్రగ్స్ మాఫియా ఈ భూతాన్ని చిన్నపిల్లలకు కూడా చాక్లెట్ల రూపంలో అంటిస్తూ వ్యాపారానికి కొనసాగిస్తున్నారని.. ఇలాంటి వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల పవర్తన మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజానాట్యమండలి నగర ఉపాధ్యక్షులు టి రఘు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న ,స్కూల్ టీచర్లు సీతాఫల్మండి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ నర్సింహులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీ పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులు , ఎంబీఏ డీన్ ,కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.డి.శ్రీరాములు ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటే అనేక అంశాలపై పట్టు సాధించేందుకు అవకాశాలు ఉన్నాయి అని ప్రిన్సిపాల్ ప్రో.శ్రీరాములు చెప్పారు.కార్యక్రమంలో ప్రో.వెంకటయ్య ,ప్రో.స్మిత సాంబ్రాణి ,బిఓఎస్ ప్రో.వై.జహంగీర్ ,డా.వి.సమున్నత 60 ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | ఆగస్టు 13, 2024 | www.navatelangana.com

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి



నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చెప్పట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజవాణిలో అక్రమ నిర్మాణానికి సంబంధించిన ఒక్క ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో జోనల్ వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోన్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ఎ. యం సీ రాజారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ జడ్జి బండ శ్రీహరి మరణం తీరని లోటు

- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్



నవ తెలంగాణ - ముషీరాబాద్

మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ తండ్రి రిటైర్డ్ జడ్జి బండ శ్రీహరి (92) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాగ్ లింగం పల్లి లోనీ బిఎస్ ప్రసాద్ నివాసంలో బండ శ్రీహరి భౌతికయానికి బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ నివాళు లర్పించారు

ఎల్పీజీ రంగంలో యువతకు శిక్షణ



- ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు
- సెట్విన్ ఆధ్వర్యంలో ప్రారంభం

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ నూతనంగా ఎల్పీజి రంగంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి ముందుకు రావడం శుభపరిణామం అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. సోమవారం నగరంలోని ఇండియన్ ఆయిల్ భవన్ లో తెలంగాణ ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ ప్రోగ్రాం కింద్ ఎల్పీజి మెకానిక్స్, డెలివరీ బాయ్స్ కు మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించి ప్రసంగించారు. సెట్విన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి నాంది పలకడం గొప్ప నిర్ణయమన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశ పెట్టడం వల్ల నిరుద్యోగ యువతకు జీవితంలో స్థిరపడడానికి అవకాశాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. సెట్విన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే తమ సంస్థలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, మొబైల్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని, నూతనంగా ఎల్పీజి రంగంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడం తో వారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు మన దేశంతో పాటు విదేశాలలో కూడా ఉపాధి పొందే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. స్వయం ఉపాధితో పాటు నైపుణ్యాభివృద్ధి కోసం వివిధ కోర్సులలో సెట్విన్ శిక్షణ అందిస్తోందన్నారు. ఆయా కోర్సులలో చేరే నిరుద్యోగ యువతి యువకులకు వృత్తి నైపుణ్యంతో పాటు ఉపాధికి అవకాశాలు ఉంటాయని అన్నారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు, ముఖ్యంగా వారిలో ఆత్మ విశ్వాసం నింపేందుకు సెట్విన్ ఆధ్వర్యంలో ఎల్పీజి కోర్సులను ప్రవేశ పెట్టడం మూలంగా నిరుద్యోగ యువతకు మరింత ఉజ్వల భవితకు బాట వేసినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ లెవెల్ కోఆర్డినేటర్, డిజిఎం రవీంద్ర కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ డివిషనల్ ఎల్పీజి సేల్స్ హెడ్ సతీష్ కిషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ మనోజ్ గోయల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఎల్పీజి) టెర్రిటరీ మేనేజర్ రమణ కుమార్, తెలంగాణ ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్మోహన్ రెడ్డి, జువ్వాడి శ్రీచరణ్, కోశాధికారి ఐలి రెడ్డి, సెట్విన్ ట్రైనింగ్ ఇంచార్జి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలి



తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వాయ కమిటీ

నవతెలంగాణ - ముషీరాబాద్

బహుజన విప్లవ వీరుడు, స్వయం పరిపాలకుడు సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి వేడుకలను చిక్కడపల్లిలో ఉన్న కల్లుకంపౌండ్ వద్ద నిర్వహించనున్నట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వాయ కమిటి చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్ లు తెలిపారు. బహుజనులంతా జయంతి వేడుకలను విజయ వంతం చేయడానికి పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. సోమవారం చిక్కడపల్లిలోని సమన్వాయ కమిటి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ఈ జయంతి వేడుకల్లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ఎంపీలు ఈటల రాజేందర్, మల్లు రవి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ వైస్ చైర్మన్ కె. స్వామిగౌడ్, వి.హన్మంతరావు, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మధుయాష్కీ, గౌడ్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ లు హజరుకానున్నట్లు తెలిపారు. భారత తొలి తెలుగు బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌనీ వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు పోతగాని అయిలన్ గౌడ్, సారంగ శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

అర్హత లేని రేడియోగ్రాఫర్స్‌ను తొలగించాలి



నవతెలంగాణ - ముషీరాబాద్

అర్హత లేకుండా రేడియో గ్రాఫర్స్ గా సేవలందిస్తోన్న వారిని గుర్తించి సత్వరమే తొలగించాలని పలువురు రేడియోగ్రాఫర్స్ వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో పలు ప్రముఖ ఆసుపత్రుల్లో పని చేస్తోన్న రేడియోగ్రాఫర్స్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేడియో గ్రాఫర్ సురేష్ మాట్లాడుతూ. పారా మెడికల్ బోర్డు గుర్తింపు లేకుండా డిప్లమో ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ (డీఎంఐటీ) అర్హత లేని రేడియోగ్రాఫర్స్ కొందరు పలు ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారని ఆవేదన చెందారు. తాము కష్టపడి చదివి పట్టా పొందినా తమకు అన్యాయం జరుగుతోందన్నారు. ఫలితంగా రోగులకు సైతం సరైన వైద్య సేవలు అందడంలేదన్నారు. పదేళ్ల నుంచి సేవ చేస్తోన్న తమకు కొత్తగా విధుల్లో చేరిన వారికి వేతనాల్లో వ్యత్యాసం లేదన్నారు. గుత్తేదారులు నియమించిన అనర్హత కలిగిన రేడియోగ్రాఫర్స్ ను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గుర్తించి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పి.విష్ణు, ఇందుశేఖర్, నవీన్ కుమార్, తనీష్ అమర్ పాల్గొన్నారు.

బండ శ్రీహరి భౌతికయానికి కేటీఆర్ నివాళి



నవ తెలంగాణ - ముషీరాబాద్

మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ తండ్రి రిటైర్డ్ జడ్జి బండ శ్రీహరి (92) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాగ్ లింగంపల్లిలోని బిఎస్ ప్రసాద్ నివాసంలో బండ శ్రీహరి భౌతికయానికి మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పూలమాలవేసి నివాళులర్పించారు, కేటీఆర్ తో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు ముఠా జయసింహ, మీడియా ఇంచార్జి మచ్చుకుర్తి ప్రభాకర్, పెద్ద ఎత్తున బిఆర్ఎస్ కార్యకర్తలు, అడ్వకేట్లు, పాల్గొన్నారు

జీవితంలో పుస్తక పఠన శక్తి పెంపొందించుకోవాలి

- రవాణా, బీసీ సంక్షేమశాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రతి ఒక్కరూ జీవితంలో పుస్తక పఠన శక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పౌర గ్రంథాలయ శాఖ పద్మశ్రీ డాక్టర్ ఎస్ అర్ రంగనాథన్ 133వ జయంతి, జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అఫ్జల్ గంజ్ లోని రాష్ట్ర ,కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పద్మశ్రీ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిజాం ఎంతో దూర దృష్టితో విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధిస్తూ వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. సెంట్రల్ లైబ్రరీ ప్రపంచంలోని గుర్తింపు పొందిందని దేశానికి మార్గదర్శకంగా ఉందన్నారు. ఈ గ్రంథాలయం ఎంతో మందికి ఉపయోగపడిందన్నారు. గూగుల్లో ఇంకా సాంకేతిక టెక్నాలజీ వచ్చినప్పటికీ పుస్తక పఠనం చేయాల్సిందేనని సూచించారు. నూతన ఉద్యోగ నియామకాల గ్రంథాలయ ఉద్యోగుల జీతాలు, నూతన గ్రంథాలయాల ఏర్పాటు అన్ని అన్ని రకాలుగా మద్దతుగా ఉంటానన్నారు. గ్రంథాలయ పోస్టుల ఖాళీలపై లెటర్ ఇవ్వండి ఏ పోస్టులు క్యాడర్ లలో ఖాళీలు ఎన్ని ఉన్నాయో టిజిపిఎస్సి ద్వారా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి జాబ్ క్యాలెండర్‌లో పెట్టించి పోస్టులు భర్తీ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాలు నేటి తరానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు రంగనాథన్ స్ఫూర్తితో ప్రతి మండలం, మున్సిపాలిటీ విద్యా కేంద్రాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యా, వైద్యం ,వ్యవసాయం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు జీరో వన్ జీరో ట్రెజరీ ద్వారా జీతాలు అందేలా చూస్తానన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ నాయకత్వం లో గ్రంథాలయాలు కేరళ రాష్ట్రానికి మించేలా తెలంగాణ లో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. గ్రంథాలయాలకు రావలసిన నిధులు జిహెచ్ఎంసి తో మాట్లాడి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాల ని రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలు గ్రంథాలయాల ఉద్యోగులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏవిఎన్ రాజు, గెజిటెడ్ గ్రంథ పాలకులు పి జీ వీ రాణి ,33 జిల్లాల నుంచి వచ్చిన గ్రంథ పాలకులు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం

- డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులను అరికట్టాలి'
- ప్రతి ఏరియాలో ఫాగింగ్ చేయాలి
- ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ విజయలక్ష్మికి వినతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుధ్య లోపం కారణంగా సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వైరల్ ఫీవర్ తో ప్రజలు అల్లాడిపోతున్నారని, అయినా జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆరోపించింది. కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధులను అరికట్టాలని, వీధి కుక్కల బెడదను వెంటనే నివారించాలని డిమాండ్ చేస్తూ 'ఛలో జీహెచ్ఎంసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ నాయకులు, కార్యకర్తలు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టిన అధికారులు స్పందించకపోవడంతో కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. గేట్లు ఎక్కి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తాయని, మరీ ముఖ్యంగా డెంగ్యూ జ్వరం విజృంభిస్తుం దని తెలిసిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించిందని ఆరోపించారు.దోమల నివారణకు జీహెచ్ఎంసీ పరిధిలో 2,500 మంది ఎంటమాలజీ సిబ్బంది, రూ.15 కోట్ల నిధులు కేటాయించిన వీధుల్లో మొక్కుబడిగా పాగింగ్ జరుగుతుందన్నారు.డెంగ్యూ దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్ సరిగ్గా చేయకపోవడంతో నేడు హైదరాబాద్ నగరంలో డెంగ్యూ కేసులు అత్యధికం అవుతున్నాయని విమర్శించారు.పారిశుధ్య పనులు సరిగ్గా లేవని, స్వయంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడిన మాటలే తార్కాణం అన్నారు. డెంగ్యూ జ్వరాలతో చిన్న పిల్లలే ప్రధానంగా బలవుతు న్నారని, దీనికి తోడు వీధి కుక్కల దాడి విపరీతంగా పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వీటన్నింటిని అరికట్టే దిశలో జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.పివైఎల్ నాయకత్వం 20 బస్తీలలో సర్వే చేయగా ఫాగింగ్ సరిగ్గా చేయడం లేదని, ప్రజలు వారి అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు.ఈ విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి సీజనల్ వ్యాధులను, వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని యెడల తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఈ సమస్యలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.రవి కుమార్, కార్యదర్శి బి.ఎస్.కృష్ణ, ఉపాధ్యక్షులు కిరణ్, బంగారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మల్లేష్, యల్లప్ప, కోశాధికారి కొల్లూర్ భీమేష్, నాయకులు బాలు, రాజు, అజ్మీరా విజయ్, మనోహర్, రాకేష్, మహేష్, రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పునరుద్ధరణకు పోరాటాలు చేయాలి'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం లేకుండా సెక్యులరిజం ఉనికిలో ఉండదని, దేశంలో రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాటాలను తీవ్రతరం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా నిర్మాణ మహాసభలు జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీపీఐ నాయకురాలు ఆరుట్ల సుశీల దేవి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో ఈ.టి.నరసింహ మాట్లాడారు. మోడీ నియంతృత్వ సర్కార్‌లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యంతో పాటు మానవ హక్కులు, జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడ్డాయని, దేశంలో ప్రజలు ఎవరూ సురక్షితంగా లేరని పేర్కొన్నారు. దీంతో పాటు దేశ వ్యాప్తంగా ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుందని, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు కూరగాయలతో సహా నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరగడం వల్ల సమాజం లోని దాదాపు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రధాని మోడీ తన కార్పొరేట్ మిత్రుల కోసం పాలనా కొనసాగిస్తున్నారని విమర్శించారు. ద్రవ్యోల్బణం అదుపు చేయడంలో ఉద్యోగాలు సృష్టించడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జీఎస్టీ పేరుతో సామాన్య ప్రజల సొమ్మును మోడీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. ప్రధాని మోడీ చేసిన తప్పుడు వాగ్దానాలు, అబద్దాలతో ప్రజలు విసిగిపోయార ని, బీజేపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇది త్వరలోనే ప్రతిబింబిస్తుందని తెలిపారు. 100 సంవత్సరాలుగా దోపిడీ, వివక్ష, మతోన్మాదానికి వ్యతిరేకంగా, హక్కులు నిజమైన ప్రజాస్వామ్య సమాజం కోసం పోరాడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి అద్భుతమైన పోరాటాలు, గణనీయమైన విజయాల చరిత్ర ఉందని, విప్లవ వారసత్వం కలిగిన సీపీఐ పార్టీని పునరుజ్జీవింపజేయడంతో పాటు బలమైన ప్రజా ఉద్యమాల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని, ఆహారం, ఉద్యోగం, ఆరోగ్య సంరక్షణ, గృహ సదుపాయం, సురక్షితమైన తాగునీరు, సార్వత్రిక విద్య మొదలైన ప్రజల జ్వలించే సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఈ.టి.నరసింహ కోరారు. ఈ మహా సభలో సీపీఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు పడాల నళిని, నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, షంషుద్దీన్, సలీం ఖాన్, ఎండి.సలీం, నగర నేతలు షేక్ హసీనా, ఆరుట్ల రాజ్ కుమార్, మామిడిచెట్ల వెంకట్ స్వామి, చెట్టుకింది శ్రీనివాస్, బొడ్డుపల్లి కిషన్, నరేష్, చైతన్య, ఒమర్ ఖాన్, శక్రిభాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యురాలిని హతమార్చిన ఘటన సిగ్గుచేటు

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష నాయుడు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కలకత్తాలోని ఆర్.జీ.కర్ మెడికల్ కాలేజీలో మహిళా వైద్యురాలిని కిరాతకంగా హతమార్చిన నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ లక్ష నాయుడు సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా వైద్యురాలిని డ్యూటీలో ఉండగానే కిరాతకంగా హతమార్చిన ఘటన మానవ సమాజానికి సిగ్గుచేటు అన్నారు. ఇంతటి ఘోరమైన నేరానికి పాల్పడిన నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఆగస్టు 9వ తేదీన, ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ, కలకత్తాలోని ఛాతీ వైద్య విభాగం, సెమినార్ రూమ్‌లో జరిగిందని గుర్తు చేశారు. పని ప్రదేశాల్లో పటిష్టమైన భద్రత లేకపోవడమే ఇందుకు కారణమా లేక సరైన విద్య లేకపోవడం వల్ల పిల్లల మనస్తత్వం సరికాని అభివృద్ధి లేదా సహచరుడు మానవుడి పట్ల సానుభూతి లేకపోవడమా, లేదా విస్తారమైన సామాజిక ప్రతికూల ఆలోచనా ప్రభావమా అని ఆమె ప్రశ్నించారు. ఇక్కడ ఎవరిని నిందించాలో అర్థం కానీ ప్రశ్నగా మిగులుతుంద న్నారు. న్యాయం కోసం గొంతులు వినిపిం చాలని, నేరస్తులకు కఠిన శిక్షలు విధించాలని కోరారు.మహిళా డాక్టర్ పోస్ట్ మార్టం 2-3 మహిళా సర్జన్లు, ఇతర సంబంధిత అధికార బృందాల సమక్షంలో అవసరమైన అన్ని పరీక్షలు, విధానాలు, సాక్ష్యాలతో న్యాయ బృందం సరైన ప్రోటోకాల్ అనుసరించి కేసు వీలైనంత త్వరగా పరిష్కరించబడాల ని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా అన్ని చట్టాలను పూర్తి చేసి మహిళా వైద్యురాలికి న్యాయం చేసి ఆమె కుటుంబా నికి పరిహారం అందించాలని, ప్రాణాలు కాపాడే డాక్టర్లకే భద్రత లేకపోతే మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకమని, ఇది మొత్తం మహిళల భద్రతకు సంబంధించినదని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుని మహిళాలకు భద్రత కల్పించాలన్నారు.

అలగు వర్షినిని బాధ్యతల నుంచి తొలగించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధు,పొడపంగి నాగరాజు



నవ తెలంగాణ - ముషీరాబాద్

సోషల్ వెల్ఫేర్ గురుకులాల కార్యదర్శి అలగు వర్షినిని బాధ్యతల నుండి తొలగించాలి అని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు,పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు,పొడపంగి నాగరాజు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ గురుకులాలలో సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. గురుకులాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్స్ లేరని పేర్కొన్నారు. ఆగస్టు 9న జగిత్యాల జిల్లా,మెట్టుపల్లి మండలం, పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థకు గురై ఒక విద్యార్థి మరణించడం దారుణం అన్నారు. ములుగు ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల మూడవ అంతస్తు నుంచి బాలిక దూకడంతో కాళ్ల చేతులు విరగడంతో ఎంజి హాస్పిటల్ వరంగల్ లో చికిత్స పొందుతుందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల గురుకులాల్లో విద్యార్థి ఫోన్ మాట్లాడినందుకు ప్రిన్సిపాల్ చితక బాధడంతో హాస్పటల్ పాలయ్యారు. అలగు వర్షినిని సోషల్ వెల్ఫేర్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక ఏ ఒక్క జిల్లాలో పర్యటన చేయలేదన్నారు. విద్యార్థులను కలవడానికి ఇష్టపడని కార్యదర్శి విద్యార్థులకు ఎలా న్యాయం చేస్తుందన్నారు. తక్షణమే సోషల్ వెల్ఫేర్ కార్యదర్శిని పదవి నుండి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ప్రణయ్,మంద నవీన్, రాష్ట్ర నాయకులు మాదారపు నాగరాజు, తీగల శ్యామ్, మామిడాల ప్రవీణ్, కె.ఝాన్సీ, యశ్వంత్ పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు



- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న

నవతెలంగాణ - ధూల్ పేట్

వీధి కుక్కల బెడద, నివారణపై పలు విభాగాలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీ హెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు వీధి కుక్కల నివారణ పై చాంద్రాయణగుట్ట నర్కీపూర్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఆయన వెటర్నరీ, శానిటేషన్, యూసీడీ, యూబీడీ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కుక్క కాటు నివారణ చర్యలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీధి కుక్కల నివారణ చర్యలపై వెటర్నరీ ఎంటమాలజీ, శానిటేషన్, యూసీడీ, టౌన్ ప్లానింగ్, యూబీడీ, విభాగాల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలేరియా విభాగంతో ఇళ్లలో కుక్కల పెంపకం వివరాలు శానిటేషన్ విభాగంతో చికెన్ , మాంసం విక్రయ కేంద్రాలు, హోటల్స్, రెస్టారెంట్స్ , ఫక్షన్ హల్స్, ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను రోడ్లపై వేయకుండా సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. యూసీడీ విభాగంచే కుక్క కాటు నివారణ చర్యలపై కాలనీ, బస్తీ, రెసిడెన్షియల్, సంక్షేమ సంఘాలతో అవగాహన కార్యక్రమాలు.. టౌన్ ప్లానింగ్, యూ బీ డీ విభాగల చే నూతన ఇళ్ళ నిర్మాణాలు, ఖాళీ స్థలలు, ప్లే గ్రౌండ్స్, పార్కులలో కుక్కల అవసాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో నివారణ చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈ సమావేశంలో మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, ఫలక్ నూ మా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ జయంత్, సురేందర్ సరిత, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్, ఏయం హెచ్ వో లు డాక్టర్ ఇ ర్షద్ ఇక్బాల్, డాక్టర్ జ్యోతి, మలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, యు సి డి డిపిఓ లు రత్నమ్మ, యాదగిరి, రాధా రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్య ద్వారా దేశ సమగ్ర అభివృద్ధి : ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

విద్య ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధి జరుగుతుందని విద్యార్థులు హక్కుల సాధనకై ఉద్యమ బాట పట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్ లో విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. విద్య కార్పోరేట్‌మయం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక చొరవ చూపాలని ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రత్యేకమైన నైపుణ్యం కలిగిన కోర్సులు, ఆధునిక టెక్నాలజీ, ఇంటర్నేషనల్ సిలబస్ ప్రభుత్వ రంగ సంస్థలలో విద్యార్థులకు అందివ్వాలి అని అన్నారు. రాష్ట్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల, మోడల్ స్కూల్స్, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులకు , అడిషనల్ సెక్షన్లు కేటాయించి సీట్లు ఇవ్వాలి అన్నారు.ఈ సందర్భంగా వివేకానంద డిగ్రీ కాలేజీ పూర్వక ప్రిన్సిపల్ సుఖన్య ను నూతన ప్రిన్సిపల్ ప్రభు ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, సతీష్, రాందేవ్, బలరామ్, కోటేశ్వరి, శివ, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు.సోమవారం హిమాయత్ నగర్‌లోని అమృత ఎస్టేట్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ శ్వేతాఅరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం 1936 ఆగస్టు12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ 88 వసంతాలు పూర్తి చేసుకుందని, ఆనాడు బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసి దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఏఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, అనిల్ కుమార్, ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, నాయకులు చైతన్య యాదవ్, అన్వర్, వంశీ, హరీష్, అరుణ్, వినోద్, అనిల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

18 వరకు హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2024



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఈ నెల 12-18వ తేదీ వరకు కొనసాగనున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో-2024ను సోమవారం టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ అశ్విని శ్రీ, నిర్వాహకులు సోమనాథ్ బౌమిక్, అభిజీత్ షాలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ భారతదేశపు విభిన్నమైన చేనేత సంప్రదాయాల గొప్ప వేడుకైన ఈ ఎక్స్‌పో ఇక్కడకు రావడం ఎంతో ఆనందం, గౌరవం అన్నారు. ఈ కార్యక్రమం కేవలం వస్త్రాల ప్రదర్శన మాత్రమే కాదనీ, తమ నైపుణ్యం ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచిన కళాకారులకు నివాళి అన్నారు. ఈ ఎక్స్‌పో వారి ప్రతిభకు తార్కాణమే కాకుండా నేరుగా నేత కార్మికులతో అనుసంధానం చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించే వేదిక అన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపర్చిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అని తెలిపారు. నిర్వాహకులు సోమనాథ్, అభిజీత్ మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించే వస్త్రాలు సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి నైపుణ్యం గల నేత కార్మికులు రూపొందించారని తెలిపారు. ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించ డానికి, వారికి మద్దతునివ్వడానికి ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అవయవదానం పట్ల అవగాహన రావాలి

- రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

లక్షల మంది అవయవాల కోసం ఎదురు చూస్తున్నారనీ, అవయవదానం విషయంలో చాలా అవగాహన రావాలని అదనపు డీజీపీ, తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. మన దేశంలో ఎవరైనా మరణించిన తర్వాత వారి దేహాలను ఖననం లేదా దహనం చేస్తుంటారనీ, అలా చేసేముందు వారి శరీరంలో ముఖ్యమైన అవయవాలు దానం చేస్తే మరో 8 ప్రాణాలు బతుకుతాయని తెలిపారు. మరణానంతరం తన అవయవాలను దానం చేస్తున్నట్టు ప్రతిజ్ఞ చేస్తున్నాననీ, ప్రజలందరూ ఈ విషయంలో ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో అవవయదాన అవగాహనా ప్రచారం ప్రారంభ కార్యక్రమంలో సజ్జనార్ ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ప్రజలందరూ ముందడుగు వేసి, అవయవదాతలుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సమాచారం ప్రకారం గతేడాది దేశంలో 18,378 డొనేషన్లు అయితే, వాటిలో లైవ్ డొనేషన్లు 15,436, కెడావర్ డొనేషన్లు 2,942 చొప్పున ఉన్నాయని తెలిపారు. లైవ్ డొనేషన్లలో కూడా అత్యధికం అంటే దాదాపు 10వేలకు పైగా మహిళలే చేశారనీ, మూడోవంతు మాత్రమే పురుషులు ఉన్నారని తెలిపారు. దేశంలో ఓ ట్రాన్స్‌జెండర్ కూడా అవయవదానం చేయడం విశేషం అన్నారు. అవయవ దానంలో మాతృప్రేమ స్పష్టంగా తెలుస్తోందన్నారు. పదేండ్ల క్రితం 4,490 మంది మాత్రమే మొత్తం అవయవదానాలు చేశారనీ, ఇప్పుడు ఇంత పెరగడానికి వివిధ హాస్పిటల్స్, ప్రభుత్వాలు చేస్తున్న అవగాహనా కార్యక్రమాలే కారణం అన్నారు. డాక్టర్ స్వర్ణలత లాంటివాళ్లు జీవన్‌దాన్ ద్వారా ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆస్పత్రుల సీఓఓ గాయత్రీ కామినేని, తదితరులు పాల్గొన్నారు.





సౌత్ జోన్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్నేహ మెహ్రా తో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ..
నవతెలంగాణ - ధూల్ పేట్

జూ పార్క్‌లో ప్రపంచ ఏనుగుల దినోత్సవం..





- జంబో ఫీస్ట్‌తో సంబురాలు

నవతెలంగాణ - ధూల్ పేట్

భారి కాయము గల జంతువు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఏనుగు.. మానవులతొ మమేకమై ఎంతటి బరువునైన సులువుగా తరలించే జంతువు ఏనుగు...

ప్రపంచ ఏనుగుల దినోత్సవము సందర్భముగా నగరంలోని నేహ్రు జులాజికల్ పార్కులొ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎఫ్ఎస్ఓ భూషణ్ మంజుల, ఏనుగుల సంరక్షకులు కె. రాజ కుమార్, వెంకట్ రావు, ఫయాజ్, షఫీ, అబ్దుల్లా, ఉదయ్‌లు ఈ కార్యక్రమానికి అద్భుతమైన ఏర్పాట్లను చేశారు. ప్రత్యేకంగా గ్రీన్ సలాడ్, బెల్లం, చెరుకులతో కలిపిన పండ్లు, కొబ్బరికాయలతో జంబో విందును అన్ని ఏనుగులకు వడ్డించారు. ఈ సందర్భంగా జూ డైరెక్టర్ (ఎఫ్ఎసి), క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్ మాట్లాడుతూ.. ఏనుగుల ప్రాముఖ్యతను పెంపొందించడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని జరుపుకుం టున్నామని తెలిపారు. ఏనుగుల సంరక్షణ, రక్షణ కోసం ఈ అంతర్జాతీయ ఈవెంట్‌ను నిర్వహించడంలో ముందంజలో ఉందన్నారు. జంబో విందు సందర్భంగా స్విమ్మింగ్ పూల్, మడ్ బాత్, షవర్ బాత్ సౌకర్యం మొదలైన అన్ని సౌకర్యాలతో పచ్చని పెద్ద ఎన్‌క్లోజర్‌లో (సుమారు 10 ఎకరాలు) ఏనుగులను ఉంచడం మా జూ గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతము జూపార్కులొ వనజా, ఆషా, సీత, విజయ్ నాలుగు ఆసియా ఏనుగులు ఉన్నాయన్నారు వాటి వాటి ఎన్‌క్లోజర్‌లోని అన్ని ఏనుగులకు ప్రత్యేక ఫలహార భొజనము ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నపై అవగాహన



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

ఘట్కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామంలో మొక్కజొన్న సాగుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ గౌడ్, చీఫ్ జనరల్ మేనేజర్ కేకే కిషోర్, జనరల్ మేనేజర్ బీఎస్ గోపాలకష్ణ, డీజీఎం బీవీ సూర్య లింగం పాల్గొని మొక్కజొన్న పంటను సాగు చేసే విధానం, వచ్చే ఆదాయం, మొక్కజొన్న నుంచి ఉత్పత్తి చేసే ఇథనాల్, పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

డ్రయినేజీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొని ఉన్న డ్రయినేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తక్షణమే పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధి షిరిడి హిల్స్ ప్రాంతంలో డ్రయినేజీ సమస్యను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహాయ సహకారాలతోనే సమస్యలు డివిజన్‌లో పలు ప్రాంతాలలో ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

సర్పంచుల్లేరు..
ప్రత్యేకాధికారులు రారు..!

- పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన
- జీపీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- ఆరు నెలలుగా అవస్థలు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. పాలకవర్గాల గడువు ముగియడంతో.. జిల్లా, మండల, డివిజనల్ స్థాయి అధికారులకు ప్రత్యేకాధికారుల బాధ్యతలను అప్పగించారు. ఒక్కో అధికారికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలను కట్టబెట్టారు. దీంతో వారు చుట్టపు చూపుగా గ్రామాలకు వస్తుండటంతో పంచాయతీల పాలన అస్తవ్యస్థంగా మారి పోయింది. అసలే ఉన్న సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలకు ప్రత్యేకాధికారుల బాధ్యతల నిర్వాహణా లోపం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. రోజురోజుకూ పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి.

ఆరు నెలలుగా అవస్థలు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ జీపీల్లో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల పాలనా వ్యవహారాలను చూసేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఇప్పటికి ప్రత్యేకాధికారుల పాలన మొదలై దాదాపు 6 నెలలు అవుతోంది. నిధుల లేమికి తోడు తమకున్న శాఖాపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేకాధికారుల అదనపు బాధ్యతలు అప్పగించడంతో సదరు అధికారులు పల్లెలను పెద్దగా పట్టించుకోవడం లేదు. నామమాత్రంగానైనా పల్లెల ముఖం చూడకపోవ డంతో పంచాయతీల్లో పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులపైనే మొత్తం భారం పడుతున్నది. అభివద్ధి పనులు పడకేశాయి. మరమ్మతులు అటకెక్కాయి. ప్రత్యేకాధికారుల పాలనకు ముందు పంచాయతీ ఖాతాల్లోని నిధులను సర్పంచులు వాడేసుకున్నారు. ఇప్పుడు పంచాయతీల ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పంచాయతీల పాలన మొక్కుబడిగా సాగుతోంది. పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. గతంలో చేపట్టిన పలు పనులకే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో పారి శుధ్యం తాండవిస్తోంది. పారిశుధ్య చర్యలు చేపట్టకపోతే పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాతశాఖకే పరిమితం..

ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. జిల్లా, మండల, డివిజన్ స్థాయిలోని గెజిటెడ్ ఉద్యోగులకు ఒకటి, రెండు పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. వారికి ఇప్పటికే పనిభారం అధికంగా ఉండటంతో పంచాయతీల బాధ్యతలను చూడటంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. కొందరు ప్రత్యేకాధికారులు తమ మాతశాఖలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. సొంతశాఖ విధులతోపాటు ఉన్నతాధికారులు సమీక్షలు, సమావేశాలకు హాజరు కావడం వంటి బాధ్యతలు కూడా ఉంటాయి. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు కూడా జరిగాయి. ఈ విధుల భారం కూడా వారిపైనే పడింది. ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలైనా గ్రామాలకు రావడం లేదనీ స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా స్థానిక పంచాయతీ కార్యదర్శులపైనే అదనపు భారం పడుతున్నది. తమ శాఖలోనే తీరిక లేకుండా పనులు ఉండటంతో కొందరు జిల్లా స్థాయి అధికారులు రెండు, మూడు వారాలకోసారి కూడా గ్రామాలను సందర్శించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు..

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోతున్నాయి. ఎక్కువగా చెత్త పేరుకుపోవడం, పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని చోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకై నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కొన్ని గ్రామాల్లో స్ట్రీట్ లైట్లు పాడై పోయినా పట్టించుకోవడం లేదనీ, కనీసం వాటిని బాగు చేయించే నాథుడే లేకుండా పోయారని గ్రామీణులు చెబుతున్నారు.



మరికొన్ని ఏరియాల్లో ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో మురుగు కాల్వల్లో పేరుకుపోయిన మట్టి వల్ల డ్రయినేజీ నీరంతా రోడ్లపైకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యలకు తోడు ఆయా గ్రామాల్లో అక్రమ కట్టడాలు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. అనుమతుల్లేకుండా గ్రామాల్లో గహ, వాణిజ్య నిర్మాణాలతోపాటు డూప్లెక్స్‌లు సైతం పుట్టుకొస్తున్నాయి. కొందరు ఫామ్ హౌస్‌ల పేరిట బహుళ అంతస్తులను అనుమతుల్లేకుండానే నిర్మించేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అక్రమ షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు, విధుల భారంతో వారానికోసారి కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పంచాయతీల్లోని ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిధులకు కటకట..

గ్రామ పంచాయతీలు నిధుల కటకటను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఖాతాల్లో డబ్బుల్లేక, అత్యవసర పనులకు ఖర్చు చేయలేక సతమతమవుతున్నాయి. పారిశుధ్య కార్మికుల వేతనాలు, పైపుల లీ కేజీ మరమ్మతులు, గ్రామాల్లో విద్యుత్ దీపాలు, నెలనెలా విద్యుత్ బకాయిలు.. ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. పాలకవర్గం ఉన్న సమయంలో అప్పోసప్పో చేసి గ్రామాల అభివద్ధికి సర్పంచులు పూనుకునే వారు. బిల్లులు మంజూరైనప్పుడు తీసుకునేవారు. కానీ ఇప్పుడు ఈ బరువు బాధ్యతల పట్ల ప్రత్యేకాధికారులు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు చేపట్టిన రాధికా గుప్తా 'పల్లెల్లో పడకేసిన పాలన'ను గాడిన పెడుతారో..? లేదో..? చూడాలి మరి..!

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కె.పి.హెచ్.బి. కాలనిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద నీటి వల్ల, డ్రయినేజీ వల్ల, వన్ సీటీ, లోధ, మలేషియన్ టౌన్ షిప్ ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కే.పి.హెచ్.బి కాలనీలోని ఒకటవ రోడ్డు, మూడవ రోడ్డు, ఏడవ రోడ్డులోని దోభీ ఘాట్‌లను, మోడల్ దోభీ ఘాట్‌లుగా ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు దోభీ ఘాట్ వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు.

కూకట్‌పల్లి డిపో నుంచి నూతనంగా మెట్రో డీలక్స్ బస్సులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి డిపోకు సంబంధించి నూతనంగా రెండు కొత్త మెట్రో డిలక్స్ బస్సులు వచ్చాయి. ఈ నూతన బస్సులను జగద్గిరిగుట్ట నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి గంటకు ఒకటి నడుపుతామని... కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన డిపో మేనేజర్ హరి తెలిపారు. అనంతరం బస్సులు తిరిగే సమయాలను వివరించారు. ప్రతి రోజూ ఉదయం జగద్గిరిగుట్ట నుంచి మొదటి బస్సు వాద్యం 7:00 గం॥ చివరి బస్సు రాత్రి 7:00 గం॥ వరకు సికింద్రాబాద్ నుంచి రాత్రి 08 :10కి చివరి బస్సు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి గంటకు ఒక బస్సు నడపబడుతుందని కూకట్‌పల్లి డిపో డి.ఎం.డి.హరి పేర్కొన్నారు.

స్పీకర్‌ను ఎమ్మెల్యే కలవడం రాజకీయ జిమ్మిక్కు

- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతోనే..ఎమ్మెల్యే కృష్ణారావు ఇలాంటి చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ.. ఎమ్మెల్యే కృష్ణారావు స్పీకర్‌ను కలవడం రాజకీయ జిమ్మిక్కు అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహార శైలి అధికారులను బెదిరించే ధోరణిలో ఉందన్నారు. ప్రోటోకాల్ అంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతోనే ఇలాంటి డ్రామాలకు తెరలేపాడన్నారు. 10 సంవత్సరాలు అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న అతను ఎన్నికల ముందు నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తయ్యాయి అని పేర్కొన్న కృష్ణారావు ఇప్పుడు మాత్రం అధికారులు పనిచేయడం లేదంటూ.. విమర్శలకు దిగడంయవిడ్డూరంగా ఉందన్నారు. ప్రోటోకాల్ అంటూయాగిచేసే కృష్ణారావు మూసాపేట్‌లో గెలిచిన కార్పొరేట ర్‌ను పక్కనపెట్టి.. ఓడిన కార్పొరేటర్‌ని వెంటేసుకొని తిరగడం ఏ ప్రోటోకాల్ కిందకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే ఇలా అధికారులను బెదిరించే ధోరణికి దిగుతున్నారన్నారు. అధికారులు ఇలాంటి బెదిరింపులకు భయపడే అవసరం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా పనిచేసే అధికారులకు ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. రేవం త్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించగా.. ఆ పనులు ప్రారంభమయ్యాయని కొనసాగుతున్నాయ న్నారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి పచ్చదనం పెంపు కోసం ఇటీవల మరో రూ. 10 కోట్ల కేటాయించడం జరిగిందని, త్వరలోనే ఆయా పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరు అక్రమ వసూళ్లకు పాల్పడినా వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

టీవీఆర్ హై స్కూల్‌లో 'ఇన్వెస్టీచర్ సెరేమోనీ' వేడుక



- క్రమశిక్షణతోనే విద్యార్థి భవిష్యత్తు
- టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్ ఆపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హై స్కూల్‌లో సోమవారం 'ఇన్వెస్టీచర్ సెరేమోనీ' ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో.. స్కూల్ క్యాబినెట్ (విద్యార్థుల క్రమశిక్షణ మండలి) ఏర్పాటు చేశారు. స్కూల్ 'హెడ్ బాయ్ హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బై హెడ్, స్పోర్ట్స్ కెప్టెన్ బాయ్ అండ్ గర్ల్, సీసీఐ బాయ్ అండ్ గర్ల్ , డీసిప్లిన్ కెప్టెన్స్‌లను ఏర్పాటు చేసి, వారికి 'బడ్జెస్', 'శ్లాసెస్ సెస్' ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.రత్నాకర్ రెడ్డి (ఎం.పి.ఈడి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్.రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను ఏర్పరచుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, కావున విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి, ఇష్టంతో చదువుకొని ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని అన్నారు. బాల్యంలో 'శిక్షణ', వయసులో 'క్రమశిక్షణ', వృద్ధాప్యంలో 'రక్షణ' ఇది జీవిత గమనానికి ప్రాధాన్యం అన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ వంశీ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసించి, పాఠశాల, తల్లిదండ్రులు గర్వపడేలా భవిష్యత్తులో మంచి స్థానంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం, కూకట్‌పల్లి డివిజన్, ప్రకాష్ నగర్‌కి చెందిన మున్ని కృష్ణ నాయుడు, బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతూ... సిటీ న్యూరో హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందడం జరిగింది. అనంతరం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావుని సంప్రదించగా.. ఆయన ముఖ్యమంత్రి సహాయానిధికి దరఖాస్తు చేయించడంతో... లబ్ధిదారులకు రూ. 60 వేలు మంజూరు కావడం జరిగింది. ఆ చెక్కును కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ చేతులమీదుగా, మున్ని కృష్ణ నాయుడు భార్య లలిత, కుమార్తె జయలకు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి.. బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావులకు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్స్ డే



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ లైబ్రరియన్స్ డేను పురస్కరించుకొని సోమవారం రిసోర్సెస్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రతిష్ అయ్యర్, ట్రెనింగ్ మేనేజర్, జె గేట్ ఇన్ఫర్మాటిక్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాటాడుతు జర్నల్స్ (పత్రికలని) వెబ్ సైట్‌లో చూడచవచ్చునని వాటిలోని మంచిని మనకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకోవచ్చు అనే విషయాన్ని క్షుణ్ణంగా వివారించారు. పత్రికలలో వివిధ రకాల కేటగిల్లా గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. శ్రీలత మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో కూడిన డిజిటల్ లైబ్రరీ మన కాలేజీలో అందుబాటులో ఉందని దాన్ని చక్కగా వినియోగించుకొని పరిశోధనాత్మక పత్రాలను సమర్పించుకోవడానికి చాలా అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అందుకు జె గేట్ లాంటి వనరులును ఉపయోగించుకోవాలని సూచించారు. లైబ్రరియన్ డా.ఎస్.రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీ ఎస్సార్ రంగనాథన్ లైబ్రరీ డిపార్ట్‌మెంట్‌కు చేసిన ఎనలేని సేవలు కొనియాడారు. అందుకుగాను ఆయన పుట్టినరోజును నేషనల్ లైబ్రేరియన్స్ డే గా జరుపుకుంటున్నామని సూచించారు. ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, లైబ్రరియన్.డా.ఎస్. రవిశంకర్ రెడ్డి, పిఆర్వో రవి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాఖ్య లీడర్లను కార్మికులుగా గుర్తించి వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజవర్గ నియోజకవర్గ స్థాయిలోని సమాఖ్య లీడర్లు సోమవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాఖ్య లీడర్లను కార్మికులుగా గుర్తించి, గౌరవ వేతనం ఇవ్వాలని అదనపు కలెక్టర్ డి. విజేందర్ రెడ్డిని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ వీటిపై చర్చించి, మీకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 25సం॥ సమాఖ్య లీడర్ల సేవలను గుర్తించి, గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.గణిత, కె.సరస్వతి, టి.అనంత లక్ష్మీ ఎల్.లలిత కుమారి, ఎం.లత, బి.అనురాధ, శోభ రాణి తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరా రం మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జై భవాని టిఫిన్ సెంటర్ ప్రారంభో త్సవానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి టిఫిన్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెూటల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అందుబాటు ధరల్లో, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెూటల్ నిర్వాహకులు రామ్, వారి కుటుంబ సభ్యులు, రిపోర్టర్ రాజు, నాయకులు బుచ్చిరెడ్డి, నేమూరి రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలారాజ్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మద్రి, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌లతో కలిసి సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగోను టీ-హబ్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కళారాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయివేటు లిమిటెడ్ వినూత్న విధానం, శ్రేష్ఠత పట్ల నిబద్ధతకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. నెట్‌వర్కింగ్, సహకారం కోసం శక్తివంతమైన, డైనమిక్ వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోషల్ మీడియా ప్రభావశీలు లందరూ ఎస్ఎంఎస్ఎఫ్-2024లో భాగమయ్యే ఈ అవకాశాన్ని కోల్పోవద్దని సూచించారు. ప్రతిభ, సజనాత్మకత, ఆవిష్కరణల కలయికకు ఈ కార్యక్రమం సాక్షి అనీ, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ భవిష్యత్‌ను తీర్చిదిద్దే మరపురాని అనుభవం కోసం తమతో చేరాలని పిలుపునిచ్చారు. ఎస్ఎంఎస్ ఎఫ్-2024 డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ల్యాండ్‌స్కేప్‌లో ల్యాండ్‌మార్క్ ఈవెంట్‌గా ఉంటుందని తెలిపారు. సజనాత్మక మనస్సులను కనెక్ట్ చేయడానికి, సహకరించడానికి, ప్రేరేపించడానికి ఒక ప్రత్యేకమైన ప్లాట్‌ఫారమ్‌ను అందిస్తోందనీ, ఈ ఉత్సవం బీటుబీ సమావేశాలు, నెట్‌వర్కింగ్ సెషన్‌లను కలిగి ఉంటుందని తెలిపారు. హాజరైన వారికి కొత్త భాగస్వామ్యాలను రూపొందించడానికి, వినూత్న ఆలోచనలను అన్వేషించడానికి అవకాశాలను అందిస్తుందని చెప్పారు.

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో మిగిలిన రోడ్ల కొరకు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్‌కు సోమవారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో గౌతమ్ నగర్ సమీపంలో స్మశానవాటికలో పెండింగ్‌లో ఉన్న పనుల కొరకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాల్సింది గా వినతిపత్రం అందజేశారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలలోని రోడ్ల నిర్మాణానికి భరత్ నగర్ కాలనీ ఎల్ఐజీ, దీన్ దయాల్ నగర్ జవహర్ నగర్ కాలనీ, గౌతమ్ నగర్ ఎయిర్ ఫోర్స్ అనుకుని ఉన్న రోడ్డు, స్మశాన వాటికలో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సతీష్ గౌడ్ కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, నశుఖాన్, భాగ్య, డేవిడ్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా, అల్విన్ కాలనీ డివిజన్‌లో యాత్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శైలేష్ ఆధ్వర్యంలో.. జాతీయ జెండాలను పట్టుకుని తిరంగ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటి మీద మువ్వన్నెల త్రివర్ణ పతాకం ఎగురవేసి, ఈ స్వాతంత్ర వేడుకల సంబరాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, కార్యవర్గ సభ్యులు లంగటి నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, జిల్లా కార్యదర్శి స్రవంతి, సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్, నరసింహ, చారి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఏ ఉప్పు మంచిది..?

ఇప్పుడు మార్కెట్లో రకరకాల ఉప్పులు అందుబాట్లో ఉన్నాయి. ఆహార పదార్థాల రుచికి ఉప్పు ఎంతో ఉపకరిస్తుంది. మరి ఏ ఉప్పు మంచిదో? ఎందులో ఏయే పోషకాలు ఉన్నాయో ఎంతమందికి తెలుసు? వంటల్లో నిత్యం వాడే సాల్ట్‌ను జాగ్రత్తగా ఎంపిక చేసుకుని పరిమిత మోతాదులో తీసుకుంటే వాటిలోని పోషకాలు ప్రయోజనకరంగా అందుకోవచ్చు.



ఉప్పు కేవలం రుచి కోసమే కాదు. అది మన ఆరోగ్యానికి అత్యవసరమే కాక ఎన్నో శారీరక విధులను నిర్వర్తించేందుకు దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

సెల్టిక్ సాల్ట్ : సెల్టిక్ సాల్ట్‌లో రెగ్యులర్ సాల్ట్‌తో పోలిస్తే సోడియం తక్కువగా ఉంటుంది. అయితే పింక్ సాల్ట్, కోషర్ సాల్ట్ కంటే సోడియం కొంచెం అధికంగా ఉంటుంది.

బ్లాక్ సాల్ట్ : బ్లాక్ సాల్ట్‌లో టేబుల్ సాల్ట్ కంటే సోడియం తక్కువగా ఉంటుంది. కడుపుబ్బరం, అజీర్తి, కడుపునొప్పి, వికారం, గుండెల్లో మంట వంటి సమస్యలతో బాధపడేవారు బ్లాక్ సాల్ట్ వాడితే మేలు. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, క్యాల్షియం, జింక్ వంటి మినరల్స్ కూడా అధికంగా ఉంటాయి.

లో సోడియం సాల్ట్ : ఈ వెరైటీ సాల్ట్‌లో సోడియం తక్కువగా, పొటాషియం అధికంగా ఉంటుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు, ఉప్పు తక్కువగా తినాలనుకునే వారు ఈ సాల్ట్‌ను ట్రై చేయవచ్చు.

పింక్ సాల్ట్ : పోషకాలు అధికంగా ఉండే పింక్ సాల్ట్ తరచూ తీసుకోవడం ద్వారా రక్త సరఫరా మెరుగవడంతో పాటు కండరాల నొప్పులను తగ్గే అవకాశం ఉంది. కణాల్లో పీహెచ్ లెవెల్స్‌ను బ్యాలెన్స్ చేస్తుంది.

రెగ్యులర్ సాల్ట్ : మనం దైనందిన జీవితంలో అధికంగా ఉపయోగించే వైట్ సాల్ట్‌లో అయోడిన్ అధికంగా ఉంటుంది. అయితే దీన్ని తక్కువ మోతాదులో తీసుకోవడం మేలు. ఈ సాల్ట్‌ను ఓ వ్యక్తి రోజుకు 5 గ్రాములకు మించి తీసుకోరాదు.

గళ్లుప్పు : పోషకాలు మెండుగా ఉండే గళ్లుప్పును కూడా ఇప్పుడు చాలామంది వినియోగిస్తున్నారు. అయితే ఈ సాల్ట్ నీటిలో అంత సులభంగా కరగదు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది.

ప్రార్థించే పెదవులకన్నా.. సాయం చేసే చేతులు మిన్న. సహాయం చేయటానికి ఉండాల్సింది డబ్బు కాదు... సాయం చేయాలనే పెద్ద మనసు' అనే మదర్ థెరిస్సా సూక్తులను ఆదర్శంగా తీసుకున్నారు **కోయ సుధా శ్రీనివాస్.** అందుకే తన చుట్టూ పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, మహిళలపై హింస, వేధింపులు వంటి సమస్యలు తాండవిస్తుంటే చూస్తూ ప్రశాంతంగా ఉండలేకపోయారు. సమాజానికి తన వంతుగా ఎంతో కొంత చేయాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. గత ముప్పై ఏండ్లుగా ఎందరో మహిళల జీవితాల్లో వెలుగులు నింపు తున్న ఆ సేవామూర్తి పరిచయం నేటి మానవిలో...

సమాజానికి కొంత ఇస్తూ...



సుధా ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామంలో పుట్టారు. తల్లి కనకదుర్గ, తండ్రి దావులూరి వెంకటేశ్వరావు. వీరిది వ్యవసాయ కుటుంబం. ప్రాథమిక విద్య చంద్రాల, వెల్వడంలోనూ, ఇంటర్‌ను మైలవరంలోనూ, డిగ్రీ ఆంధ్రా యూనివర్శిటీలో పూర్తిచేశారు. అనంతరం మైలవరానికి చెందిన శ్రీనివాస్‌తో ఆమె వివాహమైంది. 22 ఏండ్ల పాటు ఉపాధ్యాయినిగా పనిచేశారు. ఆర్థికంగా వెనుకబడిన గిరిజన విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు. చదువు మధ్యలోనే ఆపేసిన పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలలు, కళాశాలలకు తిరిగి పంపించేలా ప్రోత్సహించేవారు. వికలాంగులను ఆదరించి వారికి ఆర్థికంగా సహాయపడుతూ చదువులో మరింతగా ప్రోత్సహిస్తుంటారు. ప్రస్తుతం తాను చేస్తున్న సహాయ కార్యక్రమాలు సరిపోవనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించటానికి పూనుకున్నారు.

చిన్నప్పటి నుంచి సేవాభావం

సుధ హైస్కూల్లో చదివేటప్పుడే తోటి విద్యార్థినుల ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని తన తల్లిదండ్రులను ఒప్పించి ఎంతో కొంత సహాయం చేయించేవారు. మొదటి నుండి చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. స్కూలు ఎస్‌పిఎల్‌గా, విద్యార్థి సంఘం లీడర్‌గా అన్నింట్లోనూ ముందుండేవారు. వక్తృత్వ వ్యాసరచన పోటీల్లోనూ పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు రాష్ట్రప్రభుత్వం అప్పట్లో నిర్వహించిన వయోజన విద్యా ప్రాజెక్టు (అక్షరకృష్ణ)లో వాలంటీర్‌గా పనిచేసి పరిసర ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు, వృద్ధులకు చదువు నేర్పేవారు.

మహిళల స్వయం ఉపాధి...

ఆపదలో ఉన్న వారికి ఏదో ఒక రూపంలో సాయాన్ని అందించాలనే లక్ష్యంతో సుధ 2018లో భర్త శ్రీనివాస్, తోబుట్టువుల సహకారంతో 'మదర్‌థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్'ను ప్రారంభించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాలకు తమ సేవా కార్యక్రమాలను విస్తరించారు. మొదటి నుండి మహిళలను ఆర్థికంగా నిలబెట్టాలనే ఆలోచన ఆమెలో దృఢంగా ఉండేది. అందుకే ట్రస్ట్ ద్వారా మహిళల స్వయం ఉపాధి నిమిత్తం టైలరింగ్, మగ్గం, జ్యూట్ బ్యాగుల తయారీ, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీ కేర్, పచ్చళ్ళు, కారంపొడులు, పిండివంటల తయారీ, కంప్యూటర్ వంటి శిక్షణలు పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. ఇప్పటివరకూ సుమారు 20 వేల మంది ఈ శిక్షణను పొంది ఆర్థికంగా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. శిక్షణ పొందిన వారిని క్లస్టర్‌గా ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం వచ్చేలా కృషిచేస్తున్నారు. 'రుచి' ఫుడ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసిన మహిళా యూనిట్లతో ఇతర ప్రాంతాలకు పంపిస్తూ వారికి ఆదాయం సమకూరేలా కృషిచేస్తున్నారు.





సాయంలోనే సంతృప్తి

మాకున్న దాంట్లో కొంత సమాజ సేవ కోసం వెచ్చించాలనే సదాశయంతో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. దీని వల్ల ఎంతో సంతృప్తి పొందుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భాగస్వామం కూడా లభించటంతో ఎంతో కొంత సేవ చేయటానికి అవకాశం ఏర్పడింది. ప్రతిఒక్కరూ ఎంతోకొంత సమాజానికి సేవచేస్తే అభాగ్యులు, అన్నార్తులకు మేలు జరుగుతుంది. మా సేవలను గుర్తించి కొందరు దాతలు సహకరిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఎఫ్‌సిఆర్‌ఎ గుర్తింపు కూడా వచ్చింది. విదేశాల్లో స్థిరపడ్డ మన తెలుగు వాళ్లు సహకరిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయగలుగుతాం.

- కోయ సుధా శ్రీనివాస్,
చైర్మన్, మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్

ఆపన్నులకు అండగా...

మహిళలకే కాకుండా రైతుల కోసం కూడా సుధ అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. పాడిపరిశ్రమలు, సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై పలు అవగాహనా సదస్సులు నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన మదర్‌థెరిస్సా హోం ద్వారా అనాథలు, వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులను చేయూతనిస్తున్నారు. నిత్యావసర వస్తువులు, బియ్యం, సరుకులు, దుస్తులు, చలికాలంలో దుప్పట్లు వంటివి పంపిణీచేస్తున్నారు. ఎయిడ్స్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందులు, ఆహారం పంపిణీచేస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారు. వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక విద్యా, ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. కొంతమంది పేద విద్యార్థులకు ఫీజులు సైతం ఆమే చెల్లిస్తున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పేదలు, వలస కార్మికులు, యాచకులు, అనాథలకు ఫుడ్ ప్యాకెట్లు, మాస్కులు, సరుకులు, కూరగాయాలను ట్రస్ట్ ద్వారా పంపిణీచేశారు. తుపాన్లు, వరదల సమయాల్లో దాతల సహకారంతో వస్తు, ధన రూపేణా సేకరించి బాధితులకు అందిస్తున్నారు.

కౌన్సెలింగ్‌లతో...

చిన్న విషయాలకే విడిపోవాలనుకున్న దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబాలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా వందలాది జంటలు కలిసి వుండేలా తన వంతు పాత్ర పోషిస్తున్నారు. హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగానూ ఆమె కొనసాగుతున్నారు. యువతీ, యువకులకు ఆరోగ్య అవగాహన, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహించటంతోపాటుగా 'కెరీర్‌గైడెన్స్' ఇవ్వటం ద్వారా వారు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా తనవంతుగా కృషిచేస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా పోటీపరీక్షలకు కోచింగ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, సంస్థల ప్రాంగణాల్లో మొక్కలు నాటించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పర్యావరణంపై అవగాహనా సదస్సులు, ర్యాలీలు వంటివి నిర్వహిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

గోల్కొండ కోటలో సీఎస్

(మొదటిపేజీ తరువాయి)

జమిడికల్, చిందు యక్షగానం, కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం, పేర్ని వంటి వివిధ కళారూపాలకు చెందిన వెయ్యి మందికిపైగా కళాకారులు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనలు ఇస్తారన్నారు. పిల్లల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిల్చేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీఎస్ వెంట డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ అక్రమ ఆర్థిక బంధమే..

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకుంటారని కూడా ఆరోపించింది.

'పూర్తి పారదర్శకత, నిబద్ధతతో పని చేస్తామని ప్రకటన ద్వారా హామీ ఇచ్చిన మాధాబి తమ కన్సల్టింగ్ క్లయింట్ల జాబితాను ప్రకటించారు. ఆఫ్ షోర్ కంపెనీ సింగపూర్ కన్సల్టింగ్ కంపెనీ, ఇండియన్ కన్సల్టింగ్ కంపెనీ జాబితాలో ఉన్నాయి. ఏ ప్రయోజనం కోసం ఆమె వాటిని నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారంపై సెబీ చైర్‌పర్సన్ పూర్తిగా పారదర్శకంగా, బహిరంగ విచారణ జరిపిస్తారా?' అని హిండెన్‌బర్గ్ ప్రశ్నించింది.

తీవ్ర ఒత్తిడిలో అదానీ షేర్లు

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అదానీ కంపెనీ షేర్లు మరోమారు తీవ్ర నష్టాలను చవి చూశాయి. మంగళవారం సెషన్‌లో అదానీ గ్రూపు కంపెనీల స్టాక్స్ విలువ 2 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16వేల కోట్లు) ఆవిరయ్యింది. ఇంట్రాడేలో ఏకంగా రూ.53,000 కోట్ల మేర విలువ పతనమయ్యాయి. తుదకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.46 శాతం పతనంతో రూ.3,140.90 వద్ద ముగిసింది. అదానీ విల్మర్ 4.10 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 3.95 వాతం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 2.33 శాతం, ఎసిసి 0.96 శాతం, అదానీ పవర్ 1.21 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 0.23 శాతం, అంబుజా సిమెంట్స్ 0.66 శాతం చొప్పున క్షీణించాయి. ఇంట్రాడేలో పలు స్టాక్స్ రెండంకెల స్థాయిలో పతనాన్ని చవి చూశాయి.

కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అడ్మిషన్లకు చివరి రోజని పిటిషనర్ల లాయర్లు చెప్పారు. అడ్మిషన్లకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివి ఉండాలనే నిబంధనను కొత్తగా తేవడం వల్ల స్థానికులకు నష్టమన్నారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివి తల్లిదండ్రుల ఉద్యోగ, ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లిన వాళు తహసీల్దార్ ద్వారా లోకల్ ధ్రువీకరణ పత్రం పొందిన వారికి స్థానికత ఉండేదన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ, ఎన్టీఏలకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను ఈనెల 14కి వాయిదా వేసింది.

మరో బెంచ్‌కి లా అడ్మిషన్ల కేసు

రాష్ట్రంలోని లా కాలేజీల అడ్మిషన్లు తీవ్ర జాప్యం అవ్వడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ లాయర్ భాస్కర్‌రెడ్డి వేసిన పిల్‌ను విచారించేందుకు చీఫ్‌జస్టిస్ అలోక్ అరాధే నిరాకరించారు. ఈ వివాదంలోకి నల్సార్ యూనివర్సిటీ ఉన్నదనీ, ఆ యూనివర్సిటీకి తాను చాన్సలర్‌గా ఉన్నందున మరో బెంచ్‌కి పిల్‌ను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ తెలిపింది. ఇదిలా ఉండగా, వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా, కూకట్‌పల్లిలోని అనంత లా కాలేజీల్లో లా అడ్మిషన్లు నిలిపేసినట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా హైకోర్టుకు తెలిపింది.

నేడు కాంగ్రెస్ కీలక సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించనుంది. ఉదయం 10.30 గంటలకు అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, ఇంచార్జీలు, జాతీయ ప్రధాన కార్యదర్శులతో ఈ భేటీ జరుగనున్నది. ఈ భేటీలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పాల్గొంటారు. తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి తరుపున మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ఢిల్లీకి చేరుకున్నారు.

సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సులకే డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

కాలేజీల్లో 86,943 సీట్లున్నాయి. వాటిలో 81,904 (94.20 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇంకా 5,039 (5.80 శాతం) సీట్లు మిగిలాయి. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుదివిడతలో కొత్తగా 9,881 మందికి సీట్లు కేటాయించామని వివరించారు. 16,981 మంది స్లైడింగ్ చేసుకున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యలో 47 కోర్సులు అందుబాటులో ఉన్నాయనీ, వాటిలో 22 కోర్సుల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ఆరు యూనివర్సిటీ, 84 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు కలిపి మొత్తం 90 కాలేజీల్లో వంద శాతం ప్రవేశాలను కల్పించామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,460 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 15 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే ఆ సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు మంగళవారం నుంచి ఈనెల 17 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. విద్యార్హతలకు సంబంధించి జిరాక్స్ ప్రతులు, ఒరిజినల్ టీసీని కాలేజీల్లో అందించాలని సూచించారు. ఈనెల 16 వరకు సీట్లను రద్దు చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. ఇతర వివరాల కోసం https.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 77.53 శాతం సీట్లు భర్తీ

సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 61,587 సీట్లుంటే, 60,362 (98.01 శాతం) మందికి సీట్లు కేటాయించారు. వాటిలో 1,225 (1.99 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 16,692 సీట్లుంటే, 14,907 (89.31 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 1,785 (10.69 శాతం) సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 7,458 సీట్లుండగా, 5,782 (77.53 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 1,676 (22.47 శాతం) సీట్లు మిగిలాయి. ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 1,206 సీట్లుంటే, 853 (70.73 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 353 (29.27 శాతం) సీట్లు మిగిలాయి. ఇంజినీరింగ్‌లో 47 కోర్సులుంటే 22లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. బిల్డింగ్ సర్వీసెస్ ఇంజినీరింగ్ కోర్సులో 66 సీట్లుంటే, తొమ్మిది (13.64 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 57 (86.36 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులో 21 సీట్లుంటే, నలుగురు (19.05 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 17 (80.95 శాతం) సీట్లు మిగిలాయి. ప్లానింగ్ కోర్సులో 44 సీట్లుండగా, 12 (27.27 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 32 (72.73 శాతం) సీట్లు మిగిలాయి. ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్ కోర్సులో 69 సీట్లుంటే, 23 (33.33 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 46 (66.67 శాతం) సీట్లు మిగిలాయి.

ఆరోసారి అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటీ మద్రాస్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటీ మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ), నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లు సంయుక్తంగా నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటిస్తాయి. మొత్తం 13 విభాగాల్లో ర్యాంకుల జాబితాను కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది.

మొత్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో.. ఐఐటీ మద్రాస్ మొదటి స్థానంలో ఉండగా.. ఐఐఎస్సీ బెంగళూరు రెండు, ఐఐటీ బాంబే మూడో స్థానంలో ఉన్నాయి. టాప్ 10లో ఎనిమిది ఐఐటీలు, ఎయిమ్స్ ఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చోటు దక్కింది. విశ్వవిద్యాలయాల పరంగా.. ఐఐఎస్సీ బెంగళూరు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నాయి.

కళాశాలల విభాగంలో.. హిందూ కాలేజీ, మిరాండా కాలేజీ, సెయింట్ స్టీఫెన్ కాలేజీ టాప్ 3లో ఉన్నాయి. ఇవన్నీ దిల్లీలోనే ఉన్నాయి.ఇంజినీరింగ్ విభాగంలో.. ఐఐటీ మద్రాస్ వరుసగా 9వ సారి మొదటి స్థానం దక్కించుకుంది. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఐఐటీ హైదరాబాద్ ఎనిమిదో స్థానంలో ఉంది.

మేనేజ్‌మెంట్ విభాగంలో : ఐఐఎం అహ్మదాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోళికోడ్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

ఫార్మసీ విభాగంలో : జామియా హమ్‌దర్ద్ (ఢిల్లీ) మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రెండో స్థానం దక్కించుకుంది. బిట్స్ పిలానీ మూడో స్థానంలో నిలిచింది.

వైద్య విద్యలో: దిల్లీలోని ఎయిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్), వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

డెంటల్‌లో: మొదటి స్థానంలో చెన్నైలోని సవీత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్, రెండో స్థానంలో మణిపాల్ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, మూడో స్థానంలో ఢిల్లీలోని మౌలానా ఆజాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ నిలిచాయి.

పరిశోధన విద్యాసంస్థల్లో : ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ మద్రాస్, ఐఐటీ దిల్లీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో : ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఢిల్లీ) తొలి స్థానంలో ఉండగా.. కర్నాల్‌లోని ఐసీఏఆర్, లూధియానాలోని పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

ఆవిష్కరణల విభాగంలో: ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీల్లో: చెన్నైలోని అన్నా యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆరు, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఏడు స్థానాలు దక్కించుకున్నాయి.

న్యాయవిద్యలో: బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా వర్సిటీ, దిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో: ఐఐటీ రూర్కీ, ఐఐటీ ఖరగ్‌పూర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ టాప్ 3 ర్యాంకులు సాధించాయి.

కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ వాదనల తరువాత ఈ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ఈ స్కాంకు సంబంధించి ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ ఈనెల 8న కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్. గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కవిత తరఫు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గీ, విక్రమ్ చౌదరీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోహిత్గీ వాదనలు వినిపిస్తూ లిక్కర్ స్కాం కేసులో అరెస్టైన కవిత గత ఐదు నెలలుగా తీహార్ జైల్‌లోనే ఉన్నారని, ఆమె బెయిల్‌కు అర్హురాలని కోర్టుకు నివేదించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం సిసోడియాలు వరుసగా మధ్యంతర, సాధారణ బెయిల్ పొందిన కేసులకు సంబంధించిన అంశమని ధర్మాసనానికి వివరించారు. సెక్షన్ 45 కింద మహిళ అయిన కవిత బెయిల్ ఇవ్వాలని కోరారు.

ఈ వాదనలపై జస్టిస్ బిఆర్ గవాయి స్పందిస్తూ 'కవిత బాగా చదువుకున్న మహిళ, రాజకీయ వేత్త.' అని అన్నారు. ఇందుకు రోహిత్గీ బదులిస్తూ... కవిత మాజీ పార్లమెంటేరియన్ అయిన మహిళ అని వాదించారు. ఈ వాదనలపై మరోసారి జోక్యం చేసుకున్న ధర్మాసనం... కవిత సాధారణ మహిళ కాదని హైకోర్టు పేర్కొన్న అంశాన్ని గుర్తు చేశారు. ఈ పిటిషన్ పై దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీకి నోటీసులు జారీ చేస్తున్నట్టు వెల్లడించారు. అప్పటి వరకు కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని రోహిత్గీ కోరగా దర్యాప్తు సంస్థల వాదనల తరువాతే నిర్ణయం వెలువరిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

హెచ్‌ఎంఐఈ మెగా కార్ టెస్ట్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)



(ఈవీలతో సహా) ఉంటుంది. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకరణ, విస్తరణ ద్వారా భారతదేశం సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత ఉపాధిని ఆ సంస్థ కల్పించనుంది. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం దక్షిణ కొరియాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సీఎంతోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అక్కడి సియోల్‌లో హ్యూందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. చర్చల అనంతరం హెచ్‌ఎంఐఈ ప్రతినిధులు మాట్లాడుతూ... భారతదేశం తమకు చాలా ముఖ్యమైన మార్కెట్ అని తెలిపారు. అక్కడి వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ సెట్టింగ్ ఉత్పత్తులు, సాంకేతిక అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. అత్యాధునిక పరీక్షా సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించటంపై దృష్టి సారించిందని అన్నారు. హ్యూందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ అయిన హెచ్‌ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయాన్ని కల్పించాలనీ, ఆ మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న స్నేహపూర్వక పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థ వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, వ్యాపారం చేసేందుకు హెచ్‌ఎంఐఈ లాంటి అత్యుత్తమ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. హెచ్‌ఎంఐఈ ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించే అవకాశముందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

యువత దేశానికి మార్గనిర్దేశం కావాలి

అంతర్జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేపటి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, సన్మార్గంలో నడుస్తూ దేశానికి యువత మార్గనిర్దేశం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతీయువకులకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ యువత అన్ని రంగాల్లో రాణించేలా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ తీసుకుని ముందుకెళ్తుందని తెలిపారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, పెడదారులను నియంత్రిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమేనని పేర్కొన్నారు.

రేపు రాష్ట్రానికి సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా విదేశాల్లో పర్యటిస్తున్న సీఎం రేవంత్ బుధవారం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అమెరికా పర్యటనను ముగించుకుని, ప్రస్తుతం దక్షిణ కొరియాలోని పారిశ్రామికవేత్తలతో వరస భేటీలు నిర్వహిస్తున్న ఆయన మంగళవారం అర్ధరాత్రి అక్కడి నుంచి బయలుదేరనున్నారు. బుధవారం మధ్యాహ్నం లేదా సాయంత్రానికి ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారని సీఎంవో వర్గాలు తెలిపాయి. అనంతరం గురువారం నగరంలోని గోల్కొండ కోటలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే సీఎం, జాతీయ జెండాను ఎగరేసి, రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అదే రోజు మధ్యాహ్నం ఆయన ఖమ్మం జిల్లా పర్యటనకు బయల్దేరి వెళ్లనున్నారు. ఆ జిల్లాలోని సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన ఎత్తిపోతలను ఆయన ప్రారంభిస్తారు. ఆ తర్వాత రూ.2 లక్షల రైతు రుణమాఫీని ప్రకటిస్తారు.



బైబై పారిస్.. వెల్‌కమ్ లాస్‌ఏంజిలిస్

- అట్టహాసంగా పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలు
- ముగిసిన 2024 పారిస్ విశ్వ క్రీడలు

నవతెలంగాణ-పారిస్

సిటీ ఆఫ్ లైట్.. సిటీ ఆఫ్ ఒలింపిక్‌గా వెలుగొందగా 2024 పారిస్ ఒలింపిక్స్ ఆదివారంతో ఘనంగా ముగిశాయి. భారత కాలమానం ప్రకారం అర్థరాత్రి అనంతరం జరిగిన ముగింపు వేడుకలు అత్యంత అట్టహాసంగా సాగాయి. ఫ్రాన్స్ జాతీయ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో సుమారు 9000 మంది అథ్లెట్లు హాజరయ్యారు. ఫ్రెంచ్ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. హాలీవుడ్ నటుడు టామ్ క్రూస్ స్టేడియం పైకప్పు మీద నుంచి స్టేజిపైకి వచ్చిన సన్నివేశం చూపరులను కట్టిపడేసింది. ఒలింపిక్ జ్యోతిని ఆర్పివేయటంతో పాటు ఒలింపిక్ పతాకాన్ని 2028 విశ్వ క్రీడల వేదిక లాస్ ఏంజిల్స్‌కు అప్పగించారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ కరెన్ బాస్ ఒలింపిక్ పతాకాన్ని అందుకుని.. ఒలింపిక్స్ బ్యాటన్‌ను స్వీకరించారు. 2024 పారిస్ ఒలింపిక్స్ ముగిసినట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ ప్రకటించారు.

మెరిసిన మను, శ్రీజేష్ : పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత స్టార్ అథ్లెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 2024 ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మను బాకర్, హాకీ దిగ్గజం పీఆర్ శ్రీజేష్ (రెండు ఒలింపిక్ మెడల్స్) ముగింపు పరేడ్‌లో భారత పతాకధారులుగా నిలిచారు. మను బాకర్, పీఆర్ శ్రీజేష్ మువ్వెన్నల జెండాతో ముందుండి సాగగా.. భారత బృందం అనుసరించింది. జాతీయ స్టేడియంలో బాణాసంచా వెలుగులతో పారిస్ ఒలింపిక్స్ అధికారికంగా ముగిశాయి. అమెరికా (యుఎస్ఏ) 40 స్వర్ణాలు, 44 రజతాలు, 42 కాంస్య పతకాలతో 126



మెడల్స్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనా 40 స్వర్ణాలు, 27 సిల్వర్, 24 కాంస్యాలు సహా 91 మెడల్స్ సాధించి రెండో స్థానంలో నిలిచింది. జపాన్ 45 (20 స్వర్ణాలు, 12 రజతాలు, 13 కాంస్యాలు), ఆస్ట్రేలియా 53 (18 స్వర్ణాలు, 19 రజతాలు, 16 కాంస్యాలు) టాప్-4లో నిలిచాయి. భారత్ ఓ రజతం, ఐదు కాంస్య పతకాలతో ఆరు మెడల్స్ సాధించి 71వ స్థానంలో నిలిచింది.

మహిళల క్రికెట్ లీగ్ షురూ

- మిథాలీరాజ్ వంటి మేటి క్రికెటర్లను తయారు చేస్తాం
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు




నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) తొలిసారి మహిళల లీగ్‌ను మొదలుపెట్టింది. క్రికెట్ దిగ్గజం మిథాలీరాజ్ వంటి మేటి క్రికెటర్లను తయారు చేయాలనే సంకల్పంలో భాగంగానే మహిళల లీగ్‌ను తీసుకొచ్చినట్టు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మహిళల లీగ్‌ను జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. 'మహిళల లీగ్‌లో 450 మంది మహిళా క్రికెటర్లు పోటీపడుతున్నారు. అండర్-15లో 12 జట్లు, అండర్-17లో 12 జట్లు, అండర్-19లో ఆరు జట్లు బరిలో నిలిచాయి. లీగ్ పూర్తిగా హైదరాబాద్‌లోనే జరుగుతుంది. ప్రతి జట్టు ఓ మ్యాచ్ ఉప్పల్ స్టేడియంలో ఆడేలా షెడ్యూల్ రూపకల్పన చేశాం. మిథాలీరాజ్ వంటి మేటి క్రికెటర్లను తయారు చేయటమే లక్ష్యంగా ఈ లీగ్‌ను మొదలుపెట్టాం. భవిష్యత్‌లో భారత్, డబ్ల్యూపీఎల్‌కు తెలంగాణ క్రికెటర్లు ప్రాతినిథ్యం వహించటమే లక్ష్యంగా సాగుతున్నామని' జగన్ తెలిపారు.

బరిలో.. స్టార్ క్రికెటర్లు!

- అనంతపురం వేదికగా భారత జట్ల ఢీ
- బెంగళూర్‌లో సైతం కొన్ని మ్యాచుల నిర్వహణ?

వచ్చే నెల 5 నుంచి దులీప్ ట్రోఫీ



ఐసీసీ టీ20 ప్రపంచకప్.. జింబాబ్వే, శ్రీలంక పర్యటనల అనంతరం భారత క్రికెటర్లకు స్వల్ప విరామం దక్కింది. కీలక టెస్టు సీజన్ ఆరంభానికి ముందు భారత క్రికెటర్లు దులీప్ ట్రోఫీ బరిలోకి దిగుతున్నారు. నాలుగు వారాల విరామం అనంతరం సెప్టెంబర్ 5 నుంచి ఆరంభం కానున్న దులీప్ ట్రోఫీలో అగ్రశ్రేణి క్రికెటర్లు ఆడేందుకు రంగం సిద్ధమైంది. ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ అనంతపురంలో జరగాల్సి ఉన్నప్పటికీ.. లాజిస్టికల్ కారణాలతో కొన్ని మ్యాచులను బెంగళూర్‌కు మార్చే అవకాశం కనిపిస్తోంది!.

నవతెలంగాణ-ముంబయి

బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచుల టెస్టు సిరీస్ ముంగిట.. టీమ్ ఇండియా క్రికెటర్లు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పోటీపడనున్నారు. భారత క్రికెట్‌లో అగ్రశ్రేణి ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ మినహా దాదాపుగా అందరూ దులీప్ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమవుతున్నారు. రవిచంద్రన్ అశ్విన్, జశ్‌ప్రీత్ బుమ్రాలు ఆరంభ మ్యాచులకు దూరమైనా.. ఆఖర్లో రెడ్ బాల్‌తో మ్యాజిక్ చేసేందుకు సన్నద్ధమవుతారని సమాచారం. సెప్టెంబర్ 5 నుంచి ఆరంభం కానున్న దులీప్ ట్రోఫీలో పోటీపడే భారత జట్లను (ఏ,బి, సి,డి) సీనియర్ సెలక్షన్ కమిటీ త్వరలోనే ఎంపిక చేయనుంది. బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు కలిగిన క్రికెటర్లతో పాటు సెలక్షన్ కమిటీ దృష్టిలో ఉన్న క్రికెటర్లను సైతం ఈ టోర్నీకి ఎంపిక చేయనున్నారు. అజిత్ అగార్కర్ సారథ్యంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ ఈ నెలాఖరులో సమావేశం కానుంది.

రిషబ్ పంత్ పునరాగమనం : భారత టెస్టు జట్టులో అత్యంత కీలక ఆటగాడు రిషబ్ పంత్. విదేశీ టెస్టులో కండ్లుచెదిరే గణాంకాలు పంత్ సొంతం. 2022 డిసెంబర్ కారు ప్రమాదంలో గాయపడిన అనంతరం రిషబ్ పంత్ రెడ్ బాల్ ఫార్మాట్‌లో ఆడలేదు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తో జాతీయ జట్టులో రీ ఎంట్రీ ఇచ్చిన పంత్.. తాజాగా దులీప్ ట్రోఫీతో మళ్లీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ ప్రయాణం ప్రారంభించనున్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్టులో సిరీస్‌లో నాలుగు మ్యాచులకు దూరమైన కెఎల్ రాహుల్ సహా శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, సూర్యకుమార్ యాదవ్, రజత్ పాటిదార్‌లు దులీప్ ట్రోఫీలో మెరువనున్నారు.

బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రిహాబిలిటేషన్‌లో ఉన్న పేసర్ మహ్మద్ షమిని దులీప్ ట్రోఫీలో ఓ మ్యాచ్‌లో ఆడమని సెలక్టర్లు కోరే అవకాశం ఉంది. మహ్మద్ షమి ఇప్పుడిప్పుడే పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించి, నెట్స్‌లో వర్క్‌లోడ్ పెంచుకుంటూ వెళ్తున్నట్టు ఎన్‌సీఏ వర్గాల సమాచారం. బంగ్లాదేశ్‌తో చెన్నై టెస్టు మ్యాచ్‌కు ముందు మహ్మద్ షమి మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని అజిత్ అగార్కర్ ప్యానల్ కోరినట్టు తెలుస్తోంది. భారత్, బంగ్లాదేశ్ చెన్నై టెస్టు సెప్టెంబర్ 19 నుంచి ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

ఆతిథ్యం చేజారనుందా?! : ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీకి ఆతిథ్యం అందించే భాగ్యం అనంతపురంకు తగ్గింది. ఇక్కడి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) స్టేడియంలో దులీప్ ట్రోఫీ మ్యాచులు షెడ్యూల్ చేశారు. బీసీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఇప్పటివరకు దులీప్ ట్రోఫీ వేదికగా అనంతపురంను కొనసాగించారు. కానీ టీమ్ ఇండియా కీలక క్రికెటర్లు ఈ టోర్నీలో పోటీపడుతుండటం, దాదాపుగా మూడు వారాల పాటు సాగే దులీప్ ట్రోఫీకి లాజిస్టికల్ సమస్యలు తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. దీంతో దులీప్ ట్రోఫీ మ్యాచులకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కెఎస్‌సీఏ)ను బీసీసీఐ కోరినట్టు సమాచారం. సెప్టెంబర్ 5, 12, 19న సమాంతరంగా రెండేసి మ్యాచులు షెడ్యూల్ చేశారు. వీటిలో ఒక్కో మ్యాచ్‌ను అనంతపురంలో నిర్వహించి, రెండో మ్యాచ్‌ను బెంగళూర్‌కు మార్పు చేస్తారా? లేదంటే పూర్తిగా టోర్నమెంట్‌ను బెంగళూర్‌కు తరలిస్తారా అనే అంశంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్టు తెలుస్తోంది. గతంలోనూ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత్, ఆస్ట్రేలియా టీ20 మ్యాచ్‌ను సైతం హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు మార్చారు. అనంతపురంలో లాజిస్టికల్ సమస్యలు ఎదురైతే.. విశాఖపట్నం, విజయనగరం లేదా విజయవాడ వేదికగా దులీప్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తామని ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నుంచి బీసీసీఐకి ఏమైనా ప్రతిపాదనలు వెళ్తాయా అనేది చూడాలి.

హైదరాబాద్ కెప్టెన్ తిలక్


బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్



నవతెలంగాణ-హైదరాబాద్ : వందేండ్లకు పైబడిన చరిత్ర కలిగిన, ప్రతిష్టాత్మక బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో పోటీపడే హైదరాబాద్ జట్టుకు స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ నాయకత్వం వహించనున్నాడు. ఈ మేరకు హెచ్‌సీఏ సీనియర్ సెలక్షన్ కమిటీ సోమవారం హైదరాబాద్ జట్టును ఎంపిక చేసింది. రాహుల్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఫిట్‌నెస్ కారణాలతో తిలక్ వర్మ తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేకుంటే.. రాహుల్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. సివి మిలింద్ వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అందుకోనున్నాడు. బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్ ఈ నెల 21 నుంచి ఆరంభం కానుండగా తమిళనాడు క్రికెట్ సంఘం (టిఎన్‌సీఏ) నాలుగు వేదికల్లో మ్యాచులను షెడ్యూల్ చేసింది. తమిళనాడు నుంచి రెండు జట్లు సహా దేశవ్యాప్తంగా పది జట్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్, జార్ఖండ్‌తో హైదరాబాద్ గ్రూప్ దశలో పోటీపడనుంది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్, సర్ఫరాజ్ ఖాన్ సైతం ఈ టోర్నీలో ఆడుతున్నారు.

హైదరాబాద్ జట్టు : తిలక్ వర్మ (కెప్టెన్), రాహుల్ సింగ్ (వైస్ కెప్టెన్), సివి మిలింద్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, టి. రవితేజ, తనయ్ త్యాగరాజన్, హిమతేజ, కార్తికేయ కక్, నితేశ్ పరాజ్ రాజ్ (వికెట్ కీపర్), అనికెత్ రెడ్డి, రాహుల్ (వికెట్ కీపర్), అభిరాత్ రెడ్డి, వరుణ్ గౌడ్.

కమిటీ కుర్రోళ్ళకి మహేష్ ప్రశంసలు



మహేష్‌బాబు

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఈనెల 9న వంశీ నందిపాటి విడుదల చేశారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఇటు ఫ్యామిలీ ఆడియెన్స్, అటు యూత్‌ను ఆకట్టుకున్న ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. అలాగే బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబట్టుకుంటోంది.

ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలతో పాటు సినీ సెలబ్రిటీల అప్రిషియేషన్స్ కూడా అందుకుంటోంది. తాజాగా హీరో మహేష్ బాబు 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర యూనిట్‌ను సోషల్ మీడియా ద్వారా అభినందించారు. "కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు సంబంధించి మంచి విషయాలను విన్నాను. తొలి చిత్రంతో నిర్మాతగా సక్సెస్‌గా సాధించిన నిహారిక కొణిదెలకు అభినందనలు. సినిమాలో సక్సెస్‌లో భాగమైన చిత్ర యూనిట్‌కు అభినందనలు. సినిమాను త్వరలోనే చూస్తాను' అంటూ మహేష్ తెలియజేశారు.

ఆద్యంతం భావోద్వేగభరితం..



మాళవిక మోహనన్, విక్రమ్

విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తోంది. సోమవారం విజయవాడలో జరిగిన ప్రెస్‌మీట్‌లో హీరో విక్రమ్ మాట్లాడుతూ, 'నా 'అపరిచితుడు' సినిమా దేశంలోనే విజయవాడలో అత్యధిక రోజులు ఆడింది. ఇదొక బ్యూటిఫుల్ అడ్వెంచరస్ మూవీ. డైరెక్టర్ రంజిత్ ఈ సినిమాను ప్రేక్షకులందరికీ నచ్చేలా అన్ని ఎమోషన్స్‌తో తెరకెక్కించారు. ఒక కొత్త వరల్డ్‌లోకి మిమ్మల్ని ఈ సినిమా తీసుకెళ్తుంది. ఈనెల 15న తప్పకుండా థియేటర్స్‌లో చూడండి' అని చెప్పారు.

నవచిత్రం

డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్



ఛార్మి, పూరి జగన్నాథ్, రామ్, కావ్యాథాపర్

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రూపొందిన పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్'. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించిన ఈ సినిమాలో రామ్ పోతినేనికి జోడీగా కావ్య థాపర్ నటించింది.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో వరంగల్‌లో 'డబుల్ ఇస్మార్ట్' ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది.

రామ్ మాట్లాడుతూ, "ఇస్మార్ట్ శంకర్' ప్రీరిలీజ్ ఈవెంట్‌కి ఇక్కడికి వచ్చాం. మళ్ళీ 'డబుల్ ఇస్మార్ట్' ఈవెంట్‌కి ఇక్కడి రావడం చాలా హ్యాపీగా ఉంది. మణిశర్మ అద్భుతమైన ఆల్బం ఇచ్చారు. స్క్రీన్ మీద చూశాక పాటలు ఇంకా నెక్స్ట్ లెవల్‌కి వెళ్తాయి. సంజయ్ దత్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. కావ్య చాలా హార్డ్ వర్క్ చేసింది. విష్ హానెస్ట్‌గా తన పని తను చేస్తూ ఉంటాడు. ఛార్మి ఫైటర్. ఆమె లేకుండా ఈ సినిమా పాజిబుల్ అయ్యేది కాదు. పూరితో పని చేసినప్పుడు వచ్చే కిక్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది' అని తెలిపారు.

"డబుల్ ఇస్మార్ట్' గురించి మాట్లాడాలంటే ఒకే ఒక పేరు.. రామ్ పోతినేని. ఇస్మార్ట్ శంకర్, డబుల్ ఇస్మార్ట్‌కి రామ్ ఎనర్జీ మామూలుగా లేదు. సంజు బాబాకి నేను పెద్ద ఫ్యాన్‌ని. 150 సినిమాల హీరో ఆయన. ఆయన ఈ సినిమాలో చేయడం కొత్త కలర్ తీసుకొచ్చింది. రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ గురించి చేసిన ఫోన్ కాల్‌తో నేను చాలా ఎమోషనల్ అయిపోయాను. నామీద ఆయనకి ఉన్న ప్రేమ, అభిమానంతో చేశారు.

\- డైరెక్టర్ పూరి జగన్నాథ్

అరుదైన గౌరవం



సంధ్యా రాజు

ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి, విమర్శకుల ప్రశంసలు అందుకున్న తెలుగు నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వానం అందింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో నిర్వహించే 'ఎట్ హోమ్ రిసెప్షన్' సెలబ్రేషన్స్‌కి ఆహ్వానిస్తూ లేఖ అందింది.

తన తొలి చిత్రం 'నాట్యం'తో రెండు జాతీయ పురస్కారాలను దక్కించుకున్న ఘనత సంధ్యారాజుకు సొంతం. తమిళనాడుకి చెందిన వ్యాపారవేత్త, రామ్‌కో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ పి.ఆర్.వెంకట్రామరాజా పుత్రిక సంధ్యారాజు. హైదరాబాద్‌లో నిశ్శంఖల డ్యాన్స్ అకాడమీ, నిశ్శంఖల ఫిల్మ్ ఫౌండర్‌గా అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తన నృత్య కళతో ప్రపంచ యవనిక పై అసమానమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు సంధ్యారాజు. ప్రత్యక్ష నృత్య ప్రసారాల్లో పాల్గొనడమే కాదు, చలనచిత్ర రంగంలోనూ తనదైన ముద్రతో రాణిస్తున్నారు. నటిగా, క్లాసికల్ డ్యాన్సర్‌గా, జాతీయ పురస్కారాన్ని అందుకున్న కొరియోగ్రాఫర్‌గా, నిర్మాతగా... భారతీయ సాంస్కృతిక రంగంలో ఎంతో మందికి స్ఫూర్తి పంచుతున్నారామె. 'ఎట్ హోమ్ రిసెప్షన్'ని ఈనెల 15 సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తారు. 15న ఉదయం జెండా వందనం పూర్తవగానే సాయంత్రం ఈ వేడుకను రాష్ట్రపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.


పట్నం పిల్ల వచ్చేసింది..



కుష్బూ చౌదరి, తేజస్ కంచర్ల

'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల తాజాగా నటిస్తున్న చిత్రం 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికిఫైడ్' అనేది సినిమా ట్యాగ్ లైన్. సెప్టెంబర్ 13న సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ మూవీ నుంచి 'పట్నం పిల్ల..' అనే సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం. హీరోయిన్ పట్నం నుంచి సెలవులకు పల్లెటూరుకి వస్తుంది. అక్కడ హీరో ఆమెను చూసి మనసు పారేసుకుంటాడు. తన మనసులోని ప్రేమలో తెలియజేసేందు తను పడే పాట్లు, మనసులోని భావాలను వ్యక్తం చేసే పాట అని అర్థమవుతుంది. ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నారు. ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉంది.

భిల్ల జాతి అధినేత చండుడు



సంపత్

హీరో విష్ణు మంచు నటిస్తూ, నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. తాజాగా ఈ చిత్రంలో నటుడు సంపత్ పోషించిన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

అడవినే భయభ్రాంతుల్ని చేసే భీకర జాతి.. నల్ల కనుమ నేలలో పుట్టారు.. మొసళ్ల మడుగు నీరు తాగి పెరిగారు.. భిల్ల జాతి అధినేత చండుడు అంటూ భీకరమైన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. నటుడు సంపత్ ఈ క్యారెక్టర్‌లో అందరినీ మెప్పించేలా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, బ్రహ్మానందం, బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ భాగమైన సంగతి తెలిసిందే. మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో ఈ సినిమాని భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

స్వాతంత్ర్యం.. మా స్వాతంత్ర్యం



లక్ష్మణ్ పూడి, తమ్మారెడ్డి భరద్వాజ, కర్రి బాలాజీ, వంశీ

తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ స్థాపించి 'ఆహారం మాది ఆరోగ్యం మీది' అనే నినాదంతో కొంతమంది డైటీషియన్స్, కొంతమంది డాక్టర్స్‌ను కలుపుకొని కూరగాయలతో కొన్ని వంటకాలు కనిపెట్టి ఎంతోమందికి దీర్ఘకాలిక వ్యాధుల్ని తగ్గిస్తున్నారు లక్ష్మణ్ పూడి. ఆయన తన మాతృ సంస్థ ప్రజానాట్యమండలి రూపకల్పనలో ఎం శేషగిరి రచించిన పాటను శ్రీనివాస్ నందుల సంగీత సారథ్యంలో లక్ష్మణ్ పూడి గానం చేసినటువంటి 'స్వాతంత్రం మా స్వాతంత్ర్యం..' అనే పాటను దర్శక,నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సోమవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయ్యింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన దేశం ఆర్థికంగా, టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి చెందింది. కానీ నిరక్షరాస్యత, పేదరికంలో చాలా కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిస్థితులు అన్నింటిని దృష్టిలో పెట్టుకుని లక్ష్మణ్ పూడి స్వాతంత్ర్యం మీద చేసిన సాంగ్ అద్భుతంగా ఉంది' అని అన్నారు.

ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి గాయకుడు లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ,'నేను కారులో వెళుతున్నప్పుడు సిగ్నల్స్ దగ్గర భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి స్వాతంత్ర్యం అంటే ఏమిటో తెలియదు. దేశంమీద ప్రేమతో ఇలాంటి నిరక్షరాస్యులను పాటతో మేల్కొల్పటానికి ఈ సాంగ్ చేశాం. సాంగ్ లాంచ్ చేసిన మా గురువు భరద్వాజ్‌కి కృతజ్ఞతలు' అని చెప్పారు. ఈ కార్యక్రమానికి సినీ డైరెక్టర్ కర్రి బాలాజీ, వంశీ లక్ష్మణ్ పూడి తదితరులు హాజరయ్యారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

జెట్వెర్క్ బోర్డులోకి వినోద్ కుమార్ దాసరి



బెంగళూరు : ప్రముఖ కాంట్రాక్టు మానుఫాక్చరింగ్ సంస్థ జెట్వెర్క్ బోర్డు ఆఫ్ డైరెక్టరుగా వినోద్ కుమార్ దాసరి నియమితులయ్యారు. తయారీ రంగంలో ఆయనకున్న విశేష అనుభవం తమ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయనుందని ఆ కంపెనీ కో-ఫౌండర్, సిఇఒ అమ్రిత్ ఆచార్య తెలిపారు. ఆటోమోటివ్, ఇంజినీరింగ్‌తో సహా విభిన్న రంగాలలో దాసరి దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగి ఉన్నారని పేర్కొన్నారు.

కావేరి సీడ్స్ రెవెన్యూ రూ.808 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ విత్తన కంపెనీకావేరి సీడ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 5.32 శాతం వృద్ధితో రూ.808.08 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇదే సమయంలో సంస్థ నికర లాభాలు 5.63 శాతం పెరిగి రూ.282.91 కోట్లుగా ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 267.84 కోట్ల లాభాలు ఆర్జించింది.

మొరాకన్ కంపెనీతో జిఆర్‌ఎం భాగస్వామ్యం

హైదరాబాద్ : జిఆర్‌ఎం ఓవర్సీస్ మొరాకన్ కంపెనీతో భాగస్వామ్యం కుదర్చుకోవడంతో ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత విస్తరించినట్లు ప్రకటించింది. ఎఫ్‌ఎంసిజి రంగంలోని జిఆర్‌ఎం ఓవర్‌సీస్ తాజాగా మోరాకోలోని సోలారిజ్ ఇన్వెస్ట్‌తో ఒప్పందం కుదర్చుకున్నట్లు తెలిపింది. దీంతో మొరకన్ వినియోగదారులకు తమ టనోష్ బ్రాండ్ బాస్మతి బియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు పేర్కొంది. ఇందులో 1కిలో, 5కిలోల పరిమాణంలోని ప్యాకెట్లన ఎగుమతి చేయనున్నట్లు వెల్లడించింది. ఇంతక్రితం ఈ సంస్థ యెమెన్ నుంచి బిన్ అవాద్ అల్‌నకీబ్ గ్రూపు నుంచి 60 కోట్ల విలువ చేసే ఆర్డర్‌ను పొందింది.

హైదరాబాద్‌కు విస్తరించిన ఆరెంజెథియరీ ఫిట్‌నెస్

హైదరాబాద్ : సైన్స్ ఆధారిత వ్యాయామాల ఫిట్‌నెస్ బ్రాండ్ ఆరెంజెథియరీ ఫిట్‌నెస్ హైదరాబాద్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 7లో 2400 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త స్టూడియోను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు ఛబ్రియా తెలిపారు. డ్యూయల్ సర్టిఫైడ్ కోచ్‌లు వ్యక్తిగత శిక్షణ అందిస్తారన్నారు. ఇక్కడి స్టూడియోలో 8 స్టేషన్‌లు ఉన్నాయన్నారు. వచ్చే మూడు, నాలుగేళ్లలో దేశంలో 40-50 స్టూడియోలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మై హోమ్ నుంచి 'అక్రిడా' ప్రాజెక్టు

- గోపన్‌పల్లిలో 25 ఎకరాల్లో నిర్మాణం

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ మై హోం గ్రూప్ మరో ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. నగరంలోని గోపన్‌పల్లి నుండి తెల్లాపూర్ రోడ్ మధ్యలో మై హోమ్ అక్రిడా పేరుతో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలోని అక్రిడా కింద 12 టవర్లలో 3780 ఫ్లాట్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఫేజ్-1లో భాగంగా 6 టవర్లు బుకింగ్ కోసం తెరువబడ్డాయని వెల్లడించింది. ప్రతిమ గ్రూప్ భాగస్వామ్యంలో దాదాపు 24.99 ఎకరాలలో జీప్లస్ 39 అంతస్తుల్లో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపింది. ఫ్లాట్ల పరిమాణం 1399 చదరపు అడుగుల నుంచి 2347 చదరపు అడుగుల మేర ఉంటుందని తెలిపింది. సౌకర్యం, లొకేషన్ సౌలభ్యం, కమ్యూనిటీలకు దగ్గరగా ఉండేలా హౌసింగ్ ప్రాజెక్ట్‌లను అభివృద్ధి చేయడంలో మై హోం మూడు దశాబ్దాలుగా అగ్రగామిగా ఉందని మై హోమ్ గ్రూపు ఛైర్మన్ రామేశ్వర్ రావు పేర్కొన్నారు.

మియాపూర్‌లో బే విండో కొత్త స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : మియాపూర్‌లో తమ మూడవ ఫర్నిచర్ స్టోర్‌ను ప్రారంభించినట్లు బే విండో వెల్లడించింది. బే విండో తొలి రెండు స్టోర్లు జూబ్లీహిల్స్, గచ్చిబౌలిలో ఉన్నాయి. లివింగ్ రూమ్‌లు, డైనింగ్ రూమ్‌లు, బెడ్‌రూమ్‌లను మార్చడానికి రూపొందించిన విస్తృతమైన ఫర్నీచర్‌ను అందించడానికి తమ సంస్థ కట్టుబడి ఉందని బే విండో వ్యవస్థాపకులు సిద్దాంత్ ఆనంద్ అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో ఐదు స్టోర్లు. 2025 చివరి నాటికి హైదరాబాద్ వెలుపల మరో ఐదు స్టోర్లను ప్రారంభించాలని యోచిస్తోన్నామన్నారు.

జీవో 46పై సమగ్రంగా చర్చిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



జీవో 46పై ఉన్న సందేహాలు, ఇతర సాంకేతిక సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బాధితులు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి జీవోతో జరిగే నష్టంపై వివరించారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. జీవో46ను రద్దు చేసి, న్యూమరికల్ పోస్టులను సృష్టించాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక సమస్యలపై సమాలోచన చెయ్యడానికి సిద్ధమనీ, అవసరమైన పత్రాలు సమర్పిస్తామని బాధితులు వివరించారు. ఈ నెల 19న జీవో 46పై హైకోర్టులో జరిగే విచారణకు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. జీవో 46 రద్దుపై శాసనసభ సబ్ కమిటీలో చర్చించి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని ఈ సందర్భంగా పొన్నం బాధితులుకు హామీ ఇచ్చారు.

అటవీ భూముల్లో నుంచి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్

మూడు నిర్మాణ ప్రతిపాదనలు

- మొదటి దానికే సర్కారు ఓటు
- ఆ భూముల కోసం ప్రయత్నం
- రోడ్లు భవనాల శాఖ కసరత్తు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆలస్యమవుతున్న ప్రాంతీయ వల రహదారి (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు సర్కారు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టును త్వరగా పట్టాలెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. హైదరాబాద్ మహానగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు అవతలివైపు నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల బదిలీ కోసం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖతో సంప్రదింపులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా వినతి సమర్పించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ సమాయత్తమవుతున్నది. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు అలైన్‌మెంట్‌లు ఉంటే అందులో ఫస్ట్ అలైన్‌మెంట్‌కు పొందాల్సిన అనుమతులపై ప్రధానంగా దష్టిపెట్టింది. ఇప్పటికే సీఎం, మంత్రి పలుమార్లు సంబంధిత కేంద్ర మంత్రులు, అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. ఈ ప్రణాళికకు తగినట్టు రోడ్లు భవనాల శాఖ అధికారులు కూడా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి

ఓఆర్‌ఆర్ వెలుపల రెండు భాగాలుగా 347.84 కి.మీ. మేర రీజినల్ రింగు రోడ్డుకు డిజైన్ ఖరారైంది. దక్షిణ భాగంలో చౌటుప్పల్-ఆమనగల్లు-షాద్‌నగర్-సంగారెడ్డి మీదుగా వెళ్లే 186 కి.మీ. రహదారిలో కొంత మేర నర్సాపూర్ రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా వెళుతున్నది. రహదారి నిర్మాణానికి అటవీ భూములు కావాల్సి ఉన్నందున ఆ శాఖ నుంచి అనుమతి పొందడం తప్పనిసరైంది. రహదారి కోసం సేకరించే అటవీ భూమికి రాష్ట్ర అటవీశాఖతో పాటు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రోడ్లు భవనాల శాఖ అధికారులు రూపొందించిన అలైన్‌మెంట్ ప్రతిపాదనలకు అనుమతి లభించినా భూసేకరణ కోసం అటవీ శాఖకు రెవెన్యూ అధికారులు గతేడాది మార్చిలోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశారు. కొన్ని సాంకేతిక కారణాల రీత్యా దాన్ని తిరస్కరించారు. అయితే, మళ్ళీ ఫీల్డ్ సర్వే నిర్వహించడంతో పాటు అన్ని అంశాలను సమగ్రంగా క్రోడీకరించి ఇంజినీరింగ్ విభాగం నివేదికను రూపొందించింది.



మొదటి అలైన్‌మెంటే ఎందుకు?

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి మూడు అలైన్‌మెంట్లను ఆర్‌అండ్‌బీ ప్రతిపాదించింది. ఉత్తర భాగం 158.64 కిలోమీటర్ల మేర ఉండే మొదటి అలైన్‌మెంటుకు రూ.8407 కోట్లు ఖర్చవుతుంది. సంగారెడ్డి, మాసాయిపేట, తూప్రాన్, నాగులపల్లె, గజ్వేల్, యాదగిరిగుట్ట, భువనగిరి, చౌటుప్పల్ గుండా వెళుతుంది. దీని కోసం 153.7 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది.

ఇందులో 7.2 కిలోమీటర్ల అటవీ భూమి కూడా ఉంది. మిగతా రెండు అలైన్‌మెంట్లు నిడివితోపాటు నిధులు కూడా అధికంగా ఖర్చవుతాయి. ఎక్కువ అటవీ భూములున్నాయి. దీంతో సర్కారు తొలి అలైన్‌మెంట్ అనుమతి కోసం మాత్రమే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది. ఈ అలైన్‌మెంట్‌లో కీలకమైన నగరంతోపాటు జిల్లాల్లోని ఆయా ప్రాంతాలు అనుసంధానం కానుండడమూ ఒక ప్రధాన కారణం. అలాగే మిగతా రెండు అలైన్‌మెంట్లతో పోలిస్తే నిడివి తక్కువ. అటవీ శాఖ భూములు తీసుకోవడం అనివార్యమే అయినా కొన్ని చెరువులు సైతం ఉన్నాయి. ఇకపోతే సుమారు 45 వేల చెట్లను, 15 వేల కుటుంబాలను అక్కడి నుంచి తరలించాల్సి వస్తున్న తరుణంలో అటవీ శాఖ అనుమతి తప్పనిసరి కానుంది.

కేంద్రమంత్రిని కలిసిన పోస్ట్‌మాస్టర్ జనరల్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ వచ్చిన కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను తెలంగాణ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి కలిశారు. సర్కిల్ పరిధిలో పోస్టల్ సేవల్ని ఆయనకు వివరించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని 'హర్ ఘర్‌కు తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 6,267 పోస్టాఫీసుల ద్వారా ఇప్పటి వరకు 1.14 లక్షల జాతీయ పతాకాలను అమ్మినట్టు చెప్పారు. ఇతర రాష్ట్రాలకు 6.38 లక్షల జాతీయ పతాకాలను సరఫరా చేశామన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి జాతీయపతాకాన్ని బహూకరించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ జీ.ఆదిత్య రెడ్డి డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

లోపాలను సరి చేస్తున్నాం

- పీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్ కారరణంగా కొంత మందికి రుణమాఫీ కాలేదని పీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ లోపాలను సరి చేస్తున్నట్టు తెలిపారు. లోపాలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

సాగర్ డ్యామ్‌పై ఏపీ దౌర్జన్యం

- క్రస్ట్ గేట్ల దగ్గరికి వెళ్లే గేటు తాళం ధ్వంసం
- కొత్త తాళం వేసిన వైనం
- కేఆర్‌ఎంబీకి డ్యామ్ అధికారుల ఫిర్యాదు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఏపీ, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న నాగార్జునసాగర్‌పై గతేడాది డిసెంబర్ ఒకటో తేదిన జరిగిన సంఘటన మరోసారి పునరావృతమైంది. ప్రాజెక్టు ప్రధాన గేటు నుంచి డ్యామ్ పైకి చొచ్చుకొనివచ్చి 13గేట్ల వరకు బారికేడ్లు, ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్న ఏపీ పోలీసులు ప్రాజెక్టు అధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా 5వ గేటు నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు తరలించిన ఘటన మరవకముందే ఈ నెల 11న(ఆదివారం) రాత్రి అలాంటి సంఘటనే మరొకటి డ్యామ్‌పై చోటుచేసుకోవడం గమనార్హం. ఈ సారి డ్యామ్‌పై దౌర్జన్యంగా వ్యవహరించిన ఏపీ ఇరిగేషన్ అధికారులు డ్యామ్ పైనుంచి క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన గేటు తాళాన్ని ఏకంగా పగులగొట్టిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వాక్ వే బ్రిడ్జికి ఆంధ్రా, తెలంగాణ రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయగా తెలంగాణ అధికారులే దాని నిర్వహణ పూర్తిగా చేపడుతున్నారు. అయితే ఈ నెల 11న రాత్రి సమయంలో ఏపీ సీఎం పేషీ నుంచి సుమారు 20 మంది డ్యామ్‌పై చేరుకున్నట్టు తెలిసింది. వాక్ వే బ్రిడ్జి గేటు తాళం వేసి ఉండటంతో తెలంగాణకు చెందిన డ్యామ్ అధికారులను తాళం చెవి అడిగారు. తాళం చెవి ఇచ్చేందుకు కొంత సమయం పడుతుందని చెప్పడంతో ఆంధ్రా అధికారులు దౌర్జన్యంతో గేట్ తాళం పగులగొట్టి వాక్ వే బ్రిడ్జి మీదికి వెళ్లిపోయారు. అనంతరం గేటుకు కొత్త తాళం వేసి తాళం చేవి తమ వెంట తీసుకుపోయారు. అయితే ఈ వివాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను తెలంగాణ అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఈ ఘటనపై డ్యామ్ ఈఈ మల్లికార్జునరావు స్పందిస్తూ ఆంధ్రా అధికారులు తాళం పగులగొట్టిన విషయం తన దష్టికి వచ్చిందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు, కష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కు నివేదించామన్నారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్యామ్ పహారా కాస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆంధ్రా నుంచి ఎవరు వచ్చినా అనుమతిస్తున్నారనీ, అయినా దౌర్జన్యంగా వ్యవహరించడం విచారకమన్నారు. కాగా 13వ గేట్ వరకు తమ ఆధీనంలో ఉన్నదంటూ తరుచూ ఏపీ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని తెలంగాణ ఉద్యోగులు వాపోతున్నారు. డ్యామ్ కంట్రోల్ రూమ్ 26వ గేట్ అవతల ఉన్నదని అక్కడికి వెళ్లి డ్యూటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై కేఆర్‌ఎంబీ ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది, రానున్న రోజుల్లో ఈ వివాదం ఇంకెన్ని మలుపులు తీసుకుంటుందో తెలియడానికి వేచిచూడాల్సిందే.

బదిలీల్లో సాంకేతిక తప్పలను సరిదిద్దాలి

- పీఆర్టీయూ తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీల్లో సాంకేతిక కారణాల ద్వారా జరిగిన తప్పులను సరిదిద్దాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఇచ్చిన ఆప్షన్లు కాకుండా ఇతర పాఠశాలలు బదిలీల్లో కేటాయించబడ్డాయని తెలిపారు. సీనియర్ల కన్నా జూనియర్లకే మంచి స్థానాలు కేటాయించారని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని డీఎస్సీ దృష్టికి తీసుకొస్తే పొరపాటు జరిగిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారని తెలిపారు. కానీ వాటిని పరిష్కరించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లామనీ, దరఖాస్తులను పరిశీలిస్తామన్నారని వివరించారు. రెండు రోజుల్లో సవరించిన ఉత్తర్వులను సంబంధిత డీఈవోలకు పంపిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలకు వ్యతిరేకం

- ఎల్‌సీజీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నిర్ణయాలను స్వాగతిస్తున్నామని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్ల అసోసియేషన్ (ఎల్‌సీజీటీఏ) తెలిపింది. ఏకీకృత సర్వీసు నిబంధనలను వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంతరెడ్డి, గౌరవాధ్యక్షులు కె యాదగిరి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1992 నుంచి 2018 వరకు అన్ని ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీసు నిబంధనలకు అనుకూలంగా జీవోలను తీసుకొచ్చాయనీ, వాటిని హైకోర్టు, సుప్రీంకోర్టు తిరస్కరించాయని గుర్తు చేశారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టమైన తీర్పును ఇచ్చాయని తెలిపారు. అయినా జేఏసీ అదే తీర్మానం చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీరాజ్ చట్టం ఆధారంగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులందరినీ జిల్లా పరిషత్ పరిపాలన పరిధిలోకి పంపించాలని డిమాండ్ చేశారు.

సకల జీవులకూ ఈ భూమిపై జీవించే హక్కు

- ఏనుగుల దినోత్సవం సందర్భంగా సదస్సు పెట్టడం అభినందనీయం : రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ భూమి మనుషులకు మాత్రమే ఆవాసం కాదనీ, సకల జీవులకూ జీవించే హక్కు ఉందనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రపంచ ఏనుగు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బెంగుళూరులో నిర్వహించిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ హ్యూమన్-ఎలిఫెంట్ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్" సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏనుగులు, మనుషుల మధ్య సంఘర్షణ, వాటి సంరక్షణ, నిర్వహణపై అర్థవంతమైన చర్చ జరిగేందుకు కర్నాటక ప్రభుత్వం ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును చేపట్టడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రకృతి పరిరక్షణ, సహజ వనరుల నిర్వహణ రంగంలో పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్) అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఆసియా ఏనుగులను చేర్చడం మానవ వైఫల్యాన్ని నిరూపిస్తున్నదని ఆందోళన వెలిబుచ్చారు. దంతాల కోసం ఏనుగులను క్రూరంగా వేటాడటం దారుణమన్నారు. అటవీ భూములు, నీటి వనరుల ఆక్రమణ, అడవుల నిర్మూలనతో ఏనుగులు ఆవాసం కోల్పోయి, ఆహార సేకరణ కోసం వలసపోతూ ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల ఆవాసాల్లో అటవీసంపద, నీటి వనరులను మెరుగుపరచడం, ఏనుగులు పంట పొలాల్లోకి, జనావాసాల్లోకి వచ్చినపుడు సంయమనంతో వ్యవహరించడం ద్వారా అవి ప్రమాదాలకు లోనుకాకుండా నివారించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖండ్రే, పలు రాష్ట్రాల అటవీ శాఖా మంత్రులు, దేశ, విదేశాలకు చెందిన పలువురు అటవీరంగ నిపుణులు, రీసెర్చ్ స్కాలర్లు, పలువురు పౌర సమాజ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ ప్రసాద్‌ను పరామర్శించిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ తండ్రి బండ శ్రీహరి మరణించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఆయన ఇంటిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు సోమవారం సందర్శించారు. శ్రీహరి పార్థివ దేహానికి నివాళులర్పించారు. బీఎస్ ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీహరి మరణం పట్ల సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రాథమిక కీ విడుదల చేయాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ రాతపరీక్షలు ముగిసి వారం రోజులు దాటినా ఇంకా ప్రాథమిక కీ విడుదల చేయలేదని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే డీఎస్సీ ప్రాథమిక కీని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని జిల్లాల్లో విద్యావాలంటీర్ల నియామక ప్రక్రియను చేపట్టడం ఉపాధ్యాయ నియామకాలు ఆలస్యమవుతాయన్న ప్రచారం జరుగుతున్నదని తెలిపారు. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి వల్ల అభ్యర్థులు ప్రాథమిక కీ విడుదల కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్‌ను విడుదల చేసి డీఎస్సీ ఫలితాలను ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాణదాతలకే రక్షణ లేదా?

- డాక్టర్ లక్షానాయుడు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాణాలు కాపాడే డాక్టర్లకే భద్రత లేకుంటే మిగిలిన వారికి భద్రత ఎక్కడుంటుందని ఆమ్ ఆద్మీ పార్టీ వైద్యుల విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ లక్షానాయుడు ప్రశ్నించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసును వెంటనే పరిష్కరించి నిందితులను శిక్షించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళా వైద్యుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కృష్ణా ట్రిబ్యునల్‌లో ఏపీ కౌంటర్ దాఖలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా జలాల వాటాల పంపిణీకి సంబంధించిన కేసులో న్యూఢిల్లీలో కేడబ్ల్యూడీటీ-2 ట్రిబ్యునల్‌లో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్‌మెంట్ ఆఫ్ కేసుకు ప్రతిగా ఆంధ్రప్రదేశ్ కౌంటర్ దాఖలుచేసింది.కాగా గత జూన్‌లోనే ఏపీ స్టేట్‌మెంట్ ఆఫ్ కేసుకు సంబంధించి తెలంగాణ కౌంటర్ దాఖలు విషయం తెలిసిందే. రెండు రాష్ట్రాల కౌంటర్ అఫిడవిట్లు భారీ పుస్తకాల తరహాలో ఉన్నాయి. కౌంటర్ అఫిడవిట్లకు ప్రత్యామ్నాయంగా ఇరు రాష్ట్రాలు రిజాయిండర్ అఫిడవిట్లు దాఖలు చేయడానికి ట్రిబ్యునల్ రెండు వారాల అనుమతి ఇచ్చింది. ఇదిలావుండగా రెండు రాష్ట్రాల నుంచి తమ తమ సమస్యలను వివరిస్తూ ఈనెల 28, 29 తేదీల నాటికి నివేదికలు సమర్పించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది.

దళిత వ్యాపారుల ఆదాయాలు తక్కువే

నిరాదరణే కారణమన్న అధ్యయనం

న్యూఢిల్లీ : దళిత సమాజం నుండి వచ్చి వ్యాపారాలు నిర్వహించుకునే వారి ఆదాయం ఇతర వ్యాపారస్తుల ఆదాయంతో పోలిస్తే 16 శాతం తక్కువగా ఉంటోంది. అట్టడుగు వర్గాలకు చెందిన ఇతర వ్యక్తుల వ్యాపారాలు కూడా ఇదే విధంగా తక్కువ ఆదాయంతో నడుస్తున్నాయి. జనాభాలో వేర్వేరు వర్గాల వ్యాపారులు పొందుతున్న ఆదాయాలపై నిర్వహించిన అధ్యయనం ఈ విషయాన్ని తెలియజేసింది. దళిత సమాజం ఎదుర్కొంటున్న నిరాదరణ కారణంగానే ఆదాయాల్లో వ్యత్యాసం కన్పిస్తోందని పరిశోధకులు వివరించారు. సమాజంలోని అన్ని వర్గాలతో దళిత వ్యాపారులు మంచి సంబంధాలు కొనసాగిస్తున్న ప్పటికీ వారి ఆదాయాలు పెరగడానికి అవి ఉపయోగపడడం లేదు. అయితే ఇవే సంబంధాలు ఓబీసీలు, ఎస్టీలు, ముస్లింలు వంటి ఇతర అట్టడుగు వర్గాల వ్యాపారులకు మాత్రం ఆర్థికంగా ఉపయోగపడుతున్నాయి.



సమాజంలోని అన్ని వర్గాలతో సత్సంబంధాలు కొనసాగిస్తే ఎవరి వ్యాపారాలైనా వృద్ధి చెందుతాయన్న భావనలో వాస్తవం లేదని తమ అధ్యయనం స్పష్టం చేసిందని దానికి నేతృత్వం వహించిన బెంగళూరు ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతీక్ రాజ్ చెప్పారు. ఇది చాలా ఆశ్చర్యంగా, అనూహ్యంగా, అసాధారణంగా ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు.

కాగా ఈ అధ్యయనం ప్లాస్ వన్ జర్నల్‌లో ప్రచురితమైంది. దళిత వ్యాపారులు, ఇతర వ్యాపారుల మధ్య ఆదాయ వ్యత్యాసం 15-18 శాతం మధ్య ఉన్నదని, దీనికి ప్రధానంగా కులమే కారణమని ప్రతీక్ రాజ్ తెలిపారు.

2021లో జనగణన చేయకపోవడంతో పాటు కులగణనను కూడా తాజా పరచలేదని, ఈ నేపథ్యంలో దేశంలోని 140 కోట్ల జనాభాలో దళితుల సంఖ్య 25-30 కోట్లు ఉండవచ్చునని తాము అంచనా వేశామని ప్రతీక్ చెప్పారు. దళితులు అవమానాలను ఎదుర్కోవడం, నిరాదరణకు గురికావడం వల్లనే ఆదాయాల్లో వ్యత్యాసాలు కన్పిస్తున్నాయని అధ్యయన బృందం సభ్యుడు ప్రొఫెసర్ హరి బాప్‌బుజి తెలిపారు. ప్రజలతో సత్సబంధాలు కలిగి ఉండడం అట్టడుగు వర్గాలపై ఒకేలా ప్రభావం చూపడం లేదని అధ్యయనం గుర్తించింది.